మాగజైన్
గత వారంలో జరిగిన విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
అన్నమయ్య
: fb.com/vaartha Digital
Published from Annamayya Nellore, Kadapa, Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nalgonda, Tadepalligudem,
17-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 137 పేజీలు: 10+4 వెల: 6.50

## టైమ్స్ మేగజైన్ జాబితాలో క్రికెటర్ స్మృతి మంధాన



**న్యూఢిల్లీ,జూన్ 16:** భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకుంది. ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ 2026 సంవత్సరానికి గాను ప్రకటించిన క్రీడారంగంలో 100 మంది అత్యంత ప్రభావశీల వ్యక్తుల జాబితాలో ఆమెకు చోటు దక్కింది.




# భారత్‌కు ఆర్థిక శక్తి ఎపి

### స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎపిదే పేటెంట్
### గ్రీన్ రాజధానిగా అమరావతి అభివృద్ధి
### అమరావతిని అడ్రస్‌గా మార్చుకోండి
### సింగపూర్ పారిశ్రామికవేత్తలకు సిఎం చంద్రబాబు పిలుపు
### సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో ప్రసంగించిన సిఎం



మంగళవారం సింగపూర్‌లో సిఐఐ పార్టనర్‌షిప్ సదస్సులో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు. హాజరైన పారిశ్రామికవేత్తలు

**విజయవాడ జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** భూమి, నీరు, మౌలిక వసతులు, అత్యుత్తమ పాలసీలతో పెట్టుబడులకు ఎపి అత్యంత అనుకూల స్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఎపిదే పేటెంట్ అని, పెట్టుబడులకు ఎంతో సురక్షితమని స్పష్టం చేశారు. ఈ ఏడాది విశాఖలో తలపెట్టిన పార్టనర్షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా సింగపూర్‌లో సిఐఐ నిర్వహించిన బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ... 'సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఎపికి మంచి సంబంధాలున్నాయి. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే నాకు చాలా అభిమానం. 3 దశాబ్దాలుగా సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్‌షిప్‌నే నిర్మించాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చింది. బ్లూ, గ్రీన్ రాజధానిగా ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించి అందించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసిపనిచేస్తున్నాం. పెట్టుబడులకు ఎపి అత్యుత్తమ ప్రాంతం అని స్పష్టం చేస్తున్నా. సింగపూర్ పారిశ్రామికవేత్తలు అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను రెండోనివాసంగా ఎంచుకోవాలి' అన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు**

ఎపిలో పరిశ్రమలకు భూమి కేటాయింపు, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నాం. >>2



మంగళవారం ఫ్రాన్స్‌లోని ఎవియన్‌లో జి-7 సమ్మిట్ సందర్భంగా కలుసుకున్న ట్రంప్, మోడీ

# చేయిచేయి కలిపిన ట్రంప్, మోడీ

### • జి-7 సమ్మిట్‌లో ఉభయుల భేటీ • 16 నెలల తర్వాత ఇద్దరు అధినేతలు ముఖాముఖి • నేడు ఇద్దరి మధ్య ద్వైపాక్షిక సమావేశం

**పారిస్, జూన్ 16:** ఫ్రాన్స్‌లోని ఎవియన్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌లు మంగళవారం పరస్పరం కలుసుకుని మాట్లాడారు. గత 16 నెలల తర్వాత ఈ ఇద్దరునేతలు ముఖాముఖిగా సమావేశమవడం విశేషం. ఇద్దరు నేతలు చివరిసారిగా 2025 ఫిబ్రవరిలో అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని వైట్ హౌస్‌లో భేటీ అయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం జరిగిన ఆ సమావేశం తర్వాత ఇదే తొలి ప్రత్యక్షసమావేశం. జీ7 సదస్సు >>2



మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో డి.సిఎం పవన్ సమావేశమైన దృశ్యం


# గోదావరి పుష్కరాలకు కేంద్రం సహకారం

### విబి జి రాం జి ద్వారా పుష్కర పంచాయితీల అభివృద్ధి
### మ్యాజిక్ డ్రైయిన్‌ను ప్రశంసించిన కేంద్రమంత్రి, దేశవ్యాప్త అమలుకు ఆసక్తి
### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో డి.సిఎం పవన్ భేటీ

**విజయవాడ, జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** గోదావరి పుష్కరాల నిర్వహణ నిమిత్తం ఎంపిక చేసిన 260 మోడల్ పంచాయతీలకు విబి జి రాం జి కార్యక్రమం కింద అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక సహకారం అందిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముందుకు రావడం శుభపరిణామం అని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మంత్రి పవన్ కల్యాణ్అన్నారు. విబి జి రాం జి నిధుల కేటాయింపులో రాష్ట్రానికిచ్చిన ప్రాధాన్యతకు కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి తదితర కార్యక్రమాల ద్వారా కాలుష్యరహిత గ్రామాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణలో ఇది ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పారదర్శకత, జవాబుదారీతనంతో రాష్ట్ర గ్రామీణా >>2

# జులై మూడోవారంలో మెగా పిటిఎం

### 'తల్లికి వందనం' కూడా అప్పుడే..
### ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల పెంపునకు ప్రత్యేక చర్యలు
### రాష్ట్రానికి ఎన్‌సిసి స్టేట్ యూనిట్ మంజూరు
### 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం
### విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



మంగళవారం విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 16, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం త్వరితగతిన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం, బడిపిలుస్తోంది, షైనింగ్ స్టార్స్, మెగా పిటిఎం, యోగాంధ్ర, టెట్ నిర్వహణ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల ప్రవేశాల పెంపుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి.. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, జులై 3వ >>2

# కోట్లల్లో టోకరా



### చీరాలలో భారీ గోల్డ్ స్కాం
### ప్రజలను నట్టేట ముంచిన బంగారం వ్యాపారి

**చీరాల టౌన్, జూన్ 16, ప్రభాతవార్త:** చీరాల పట్టణంలో సంచలనం సృష్టించిన భారీ మోసం వెలుగులోకి వచ్చింది. స్థానిక బ్రహ్మంగారి చెట్టు వద్ద నగల వ్యాపారం నిర్వహిస్తున్న బిత్రా రాఘవేంద్రరావు అనే వ్యాపారి కోట్ల రూపాయల విలువైన బంగారం, నగదు సేకరించి రాత్రికి రాత్రే పరారైన ఘటన బాధితులను కన్నీటి పర్యంతం చేస్తోంది. యేళ్లుగా నమ్మకంగా వ్యాపారం చేస్తూ వచ్చిన బిత్రా రాఘవేంద్రరావు, కస్టమర్ల విశ్వసాన్ని ఆసరాగా చేసుకుని భారీ ఎత్తున డబ్బులు, బంగారం సేకరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు బంగారు నగలు తయారు చేయించుకోవడానికి తమ వద్ద ఉన్న బంగారాన్ని అప్పగించగా, మరికొందరు కొత్త నగల కోసం లక్షల రూపాయలు ముందస్తుగా చెల్లించినట్లు బాధితులు వాపోతున్నారు. అయితే 4 రోజు >>2

# ఎపి రైల్వేకు 10,144 కోట్లు

### - కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

**విజయవాడ, జూన్ 16 (ప్రభాతవార్త):** దేశంలో రైల్వే రంగం విప్లవాత్మక మార్పులను చవి చూస్తోందని, వికసిత భారత్ లక్ష్య సాధనలో రైల్వేలు కీలక శక్తిగా మారాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో సుడిగాలి పర్యటన జరిపి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి ప్రహ్లాద్ జోషి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిలతో కలిసి విజయవాడ సమీపం లోని రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్‌ను సందర్శించిస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.10,144 కోట్లను కేటాయించినట్లుఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి వెల్లడించారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లు, స్టేషన్‌ల ఆధునికీకరణ, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, సరుకు రవాణా సామర్థ్యాల పెంపు వంటి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. అమరావతిని దేశ ప్రధాన నగరాలతో అను సంధానం చేస్తామని, ఇందులో భాగంగా అమరావతికి కొత్త రైల్వే లైను మంజూరు చేసి నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. >>2

# రూ. 400 కోట్లతో డయాఫ్రం వాల్

### పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి: మంత్రులు నాదెండ్ల, పార్థసారధి



మంగళవారం ఏలూరులో మాట్లాడుతున్న మంత్రి నాదెళ్ల

**ఏలూరు, జూన్, 16 : ప్రభాతవార్త:** రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధితో కలిసి జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, డా. కామినేని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ప్రభృతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ దేశానికి వెన్నుముకఐన రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. విత్తనం నాటిన దగ్గరనుండి పండిన పంటకు గిట్టుబాటు దార కల్పించే వరకు రైతుకు అన్ని విధాలా తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం చివరిలో 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, 6.30 లక్షల మంది రైతుల నుండి 9132 కోట్ల రూపాయల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ సీజన్లో కూటమి ప్రభుత్వం 7. 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 10.27 లక్షల మంది రైతుల నుండి కొనుగోలు చేసి 17వేల 455 కోట్ల రూపాయలను రైతులకు చెల్లించామన్నారు. గత ప్రభుత్వం రైతులను మోసం చేసి 6 నెలలలకు పైగా బకాయిలు పెట్టిన ధాన్యం కొనుగోలు సొమ్ము 1674 కోట్ల రూపాయలను, నెల రోజుల్లోనే రైతుల ఖాతాలకు జమచేసి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలోగా రైతుల ఖాతాలకు సొమ్మును జమచేస్తున్నామని మంత్రి చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు 70 శాతం పూర్తిచేస్తే, గత ప్రభుత్వం 10 శాతం కూడా పూర్తి చేయలేదని అన్నారు. వీళ్ళ నిర్వాహం వలన రూ 400 కోట్లు విలువచేసే డయాఫ్రమ్ వాల్ డామేజీ అయినను పట్టించు కోలేదని, కూటమి ప్రభుత్వం రాగానే ప్రపంచ నిపుణులను రప్పించి మరలా రూ 400 కోట్లు వెచ్చించి డయాఫ్రమ్ వాల్ ను నిర్మించామని అన్నారు. వచ్చే సంవత్సరం గోదావరి పుష్కరాలకు ముందుగానే పోలవరం పూర్తి చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలుతో అనేక కీలక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.



మంగళవారం బ్రాటిస్లావాలో స్లోవేకియా అత్యున్నత పురస్కారం ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్‌ను ప్రధాని మోడీకి ప్రదానం చేస్తున్న స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని

# ప్రధాని మోడీకి స్లోవేకియా అత్యున్నత పురస్కారం

**బ్రాటిస్లావా, జూన్ 16:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది. భారత ప్రధానికి స్లోవేకియా దేశ అత్యున్నత జాతీయ పురస్కారమైన ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ (ఫస్ట్ క్లాస్)ను ప్రదానం చేశారు. బ్రాటిస్లావాలో జరిగిన ఒక కార్యక్రమంలో స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని ఈ అవార్డును మోదీకి అందజేశారు. ప్రధాని మోదీ అందుకున్న 33వ అంతర్జాతీయ పురస్కారంఇది. ఈ గౌరవంపై ప్రధాని మోడీ స్పందిస్తూ ఈ పురస్కారం 140 కోట్ల మంది భారతీయులకు చెందిందని అన్నారు. ఈ సాయంత్రం ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ అందుకోవడం గౌరవంగా ఉంది. ఈ గౌరవానికి స్లోవేకియా ప్రజలకు, ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. భారత్, స్లోవేకియా మధ్య శాశ్వత స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నానని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ అనేది విదేశీ పౌరులకు మాత్రమే స్లోవేకియా ప్రభుత్వం అందించే అత్యున్నత పౌర, సైనిక పురస్కారం. యూరప్ పర్యటనలో భాగంగా మోడీ స్లోవేకియాలో పర్యటిస్తున్నారు. ఒక భారతప్రధాని ఈ దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య వలసలు, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు 11ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. రెండు దేశాల మధ్య సంబంధాలను సమగ్ర భాగస్వామ్య స్థాయికి పెంచినట్టు అధికారులు తెలిపారు.

# 'నీట్' ముగిసేదాకా 'టెలిగ్రామ్'పై బ్యాన్

**న్యూఢిల్లీ,జూన్ 16:** కేంద్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రాంయాప్‌ను ఇండియా బ్లాక్ చేసింది. ఈనెల 22వ తేదీ వరకు టెలిగ్రాం యాప్ అందుబాటులో ఉండదు. ఈనెల 21వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ రీఎగ్జామ్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక జూన్ 30వ తేదీ వరకు టెలిగ్రాం యాప్‌లో ఉన్న మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా ప్రభుత్వం డిజైబుల్ చేసింది. ఎగ్జామ్ మెటీరియల్‌ను లీకేజీ చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ చర్యలకు చేపట్టింది. మెసేజింగ్ ఫ్లాట్‌ఫామ్‌కు చెందిన యాప్‌ను తక్షణమే బ్లాక్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇచ్చిన మార్గదర్శకాల ఆధారంగా ఈ చర్య చేపట్టారు. కేవలం ఎగ్జామినేషన్ పీరియడ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ యాప్‌ను రద్దు చేశారు. పేపర్ లీక్ ఘటనలను తగ్గించేందుకు ఎడిటింగ్ ఫీచర్లను డిజైబుల్ చేశారు. గతంలో పోస్టు చేసిన మెసేజ్‌లను ఎడిట్ చేసి ఆప్షన్ ప్రస్తుతం 30వ తేదీ వరకు బ్లాక్ చేశారు. పేపర్ లీకేజీలకు పాల్పడుతున్న చీటింగ్ ముఠాలు టెలిగ్రాం యాప్‌ను విరివిగా వాడుతున్నట్లు ప్రభుత్వం గుర్తిం చింది. నీట్ పరీక్షరాస్తున్న అభ్యర్థులను ఆ చీటింగ్ ముఠా టార్గెట్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. పేపర్ లీకేలకు చెందిన అనేక ఛానళ్లను, గ్రూపులను ఇప్పటికే ప్రభుత్వం తొలగించింది.

# కోట్లల్లో టోకరా

>> లుగా వ్యాపారి కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన కస్టమర్లు అతని ఇంటికి వెళ్లగా, ఇంటిని పూర్తిగా ఖాళీ చేసి కుటుంబంతో సహా పరారైనట్లుగుర్తించారు. దీంతో ఒక్క సారిగా మోసపోయినట్లు గ్రహించిన బాధితులు షాక్‌కు గురయ్యారు. బాధితుల కథనాల ప్రకారం, ఈ వ్యవహారం ముందస్తు ప్రణాళికతోనే జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నమ్మకాన్ని పెట్టుబడిగా మార్చుకున్న వ్యాపారి, కస్టమర్ల కళ్లల్లో కారం చల్లి కోట్ల రూపాయల విలువైన బంగారం, నగదుతో ఉడాయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయిస్తూ ఫిర్యాదులు నమోదు చేస్తున్నారు. మోసపోయిన వారిసంఖ్య, నష్టపోయిన మొత్తం రోజు రోజుకు పెరుగుతున్నట్లు సమాచారం. కొందరు జీవితకాల పొదుపులను కోల్పోగా, మరికొందరు పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం దాచుకున్న బంగారాన్ని అప్పగించి ఇప్పుడు ఆందోళనలో మునిగిపోయారు. బాధితులు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, పారారీలో ఉన్న వ్యాపారిని వెంటనే అరెస్టు చేసి తమ సొమ్ము, బంగారం తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను వేడుకుంటున్నారు.

# ఎపి రైల్వేకు 10,144 కోట్లు

>> కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తూ రైల్వే మౌలిక వసతులను దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గత 12 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం 1.05 లక్షల కిలోమీటర్లకు పైగా రైల్వే నెట్‌వర్క్‌ఉందని, దీనిని పూర్తిస్థాయిలో విద్యుదీకరించే కార్యక్రమం వేగంగాసాగుతోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. విద్యుదీకరణ చేపట్టకపోతే దేశం లక్షల కోట్ల లీటర్ల డీజిల్ దిగుమతులపై ఆధారపడాల్సి వచ్చేదని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచుతూ సౌరశక్తిని సమర్థవంతంగా వినియోగించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.

# నీట్ రాసే విద్యార్థిని,విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

**విజయవాడ, జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** జూన్ 21న దేశవ్యాప్తంగా జరగబోయే నీట్ రీఎగ్జామినేషన్ జరగబోతోంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్ష రాస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎగ్జామ్ సెంటర్ల దూరభారం, ప్రయాణ ఖర్చులతో టెన్షన్ పడుతున్న విద్యార్థులకు ఊరటనిస్తూ ఎపిఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ కీలక నిర్ణయం తీసు కుంది. నీట్ పరీక్షకు వెళ్లే విద్యార్థులకు టికెట్ ఫ్రీ సౌకర్యం కల్పించింది.హాల్ టికెట్ ఉంటేచాలు బస్సులో ఉచితంగా వెళ్ళ వచ్చు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బస్సు కండక్టర్‌కు తమ నీట్ హాల్ టికెట్ చూపిస్తే సరిపోతుంది. రద్దీ రూట్లలో స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసింది.

# భారత్‌కు ఆర్థిక శక్తి ఎపి

>> ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ అయిన ఆర్సెలార్ మిట్టల్‌కు అనతికాలంలోనే అన్ని అనుమతులు వేగంగా ఇచ్చాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఎపి నుంచి ఎగుమతులు చేస్తుంది. గూగుల్ క్లౌడ్ ఎఐ డేటా హబ్ కూడా ఏర్పాటు అవుతోంది. ఆ సంస్థకు గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించాం. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నాం. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించనుంది. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగింది. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయి. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నామని అన్నారు.

**గ్లోబల్ నగరాలకు ఎపి కనెక్టివిటీ**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానం తెచ్చాం. అలాగే ఎంఎస్‌ఎంఈ సహా వివిధ పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతపై కూడా దృష్టి పెట్టాం. రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా ఎక్కడా జాప్యం లేకుండా అనుమతులు వేగంగా వచ్చేలా చూస్తున్నాం. ఏపీకి ఉన్న వెయ్యి కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతంలో 6 ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయి. ఈ పోర్టులను దేశంలోని వివిధ ప్రాంతాలకు, విదేశీ పోర్టులకు కనెక్టు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం. 7 ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు ఎపిలో ఉన్నాయి. భోగాపురం లాంటి అంతర్జాతీయ విమానాశ్రయంతో గ్లోబల్ నగరాలకు కనెక్టివిటీ ఏర్పడుతుంది. లాజిస్టిక్స్, అగ్రికల్చర్, సివిల్ ఏవియేషన్, ఎనర్జీ లాంటి వివిధ అంశాల్లో ఫంక్షనల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఎపిలో ఉన్న పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలు అనుసంధానించేలా రహదారి, రైల్ నెట్వర్క్‌ను కూడా పెద్ద ఎత్తున నిర్మిస్తున్నాం. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డ్రోన్, డిఫెన్స్ క్లస్టర్లతో పాటు రాష్ట్రంలోని 175 చోట్ల నియోజకవర్గ ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పారిశ్రామిక పార్కులకు నీరు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. రాయలసీమలోని పుట్టపర్తి వద్ద 5వ తరం ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కూడా వస్తోంది. ఇవిల వినియోగం పెంచటం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేలా ప్రయత్నాలు చేస్తున్నాం అని ముఖ్యమంత్రి అన్నారు.

**నాలెడ్జ్ హబ్‌గా అమరావతి**

అమరావతిని ఎడ్యుకేషన్, నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయటంతో పాటు దేశంలోని ప్రధాన నగరాలను కనెక్ట్ చేస్తాం. హైస్పీడ్ రైల్ నెట్వర్క్ కూడా అమరావతిని హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలను కనెక్టు చేస్తుంది. అమరావతిలోనే ఐబిఎం, టిసిఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా క్వాంటం అమరావతిలో కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఆవిష్కరణల్ని, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం. ప్రాజెక్టులు పెట్టే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. త్వరలోనే విశాఖ సమీపంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. ఎపిలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు కూడా ఉన్నాయి. దేవాలయాలు, పర్యాటక, బుద్దిస్ట్ సర్క్యూట్‌లు ఉన్నాయి. ఆక్వా, వ్యవసాయం, హార్టికల్చర్‌లో ఎపి అగ్రస్థానంలో ఉంది. పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవకాశం ఉంది. పెద్దఎత్తున ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను పండిస్తున్నాం. ఎపికి వచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను పరీక్షించి అప్పుడు పెట్టుబడులు పెట్టాలని పిలుపునిస్తున్నాను. పెట్టుబడులు పెట్టడానికి ఇది సువర్ణ అవకాశం. ఇండియా గ్రోత్ స్టోరీలో భాగస్వాములు కావాలని కోరుతున్నాన్న అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి పి.నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇడిబి సిఇఒ షన్మోహన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా పోలీసు క్రీడల్లో ఎపి పోలీసులకు పతకాల పంట

## వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్, బ్యాడ్మింటన్ క్లస్టర్, పోలీస్ డ్యూటీ మీట్, జూడో క్లస్టర్లో పతకాలు

**విజయవాడ, జూన్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీసు క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్ర ఖ్యాతిని మరోసారి దేశవ్యాప్తంగా చాటారు. బ్యాడ్మింటన్ క్లస్టర్, వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్, జూడో క్లస్టర్, పోలీస్ డ్యూటీ మీట్‌లో మొత్తం 39 పతకాలు సాధించి పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచారు.

**పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్ 2026- 27:** హర్యానా పోలీసు ఆధ్వర్యంలో హర్యానా రాష్ట్రం మధుబన్‌లో మే 23 నుంచి 27 వరకు నిర్వహించిన 3వ ఆల్ ఇండియా పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్202627 (యోగ, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్) పోటీల్లో ఏపీ పోలీసు క్రీడాకారులు 4 స్వర్ణ, 12 రజత, 1 కాంస్య పతకంతో మొత్తం 17 పతకాలు సాధించి సత్తా చాటారు. పైన సాధించిన పతకాలన్నీ యోగా విభాగంలో లబించాయి,

**పోలీసు బ్యాడ్మింటన్ క్లస్టర్2025- 26:** ఉత్తరప్రదేశ్ పోలీసు ఆధ్వర్యంలో లక్నోలో మే నెల 9 నుంచి 13 వరకు నిర్వహించిన 2వ ఆల్ ఇండియా పోలీసు బ్యాడ్మింటన్ క్లస్టర్2025- 26 (బాడ్మింటన్ + టేబుల్ టెన్నిస్) పోటీల్లో ఏపీ పోలీసు జట్టు 2 స్వర్ణ, 2 రజత, 6 కాంస్య పతకాలతో మొత్తం 10 పతకాలు కైవసం చేసుకుంది. (టేబుల్ టెన్నిస్ లో 4 కాంస్య పతకాలు... బ్యాడ్మింటన్ లో రెండు బంగారు, రెండు రజిత, రెండు కాంస్య పతకాలను మొత్తం 10 పతకాలు) దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ప్రతిభావంతులైన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ పోటీల్లో ఎపి జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలను సాధించింది. జాతీయ స్థాయి పోలీసు డ్యూటీ మీట్ 2025 -26.... మార్చి 29, 2026 నుండి ఏప్రిల్ 3, 2026 వరకు నాగపూర్ లో జరిగిన జాతీయస్థాయి పోలీసు డ్యూటీ మీట్ లో 4 రజిత పతకాలు సాధించారు.

**జూడో క్లస్టర్ 2025- 26:** అక్టోబర్ 8, 2025 నుంచి 16 అక్టోబర్ 2025 వరకు జమ్మూ కాశ్మీర్ లో జరిగిన జూడో క్లస్టర్ లో (తైక్వాండో, కరాటే, పెన్కాక్సిలాట్) 2 బంగారు, 2 రజిత, 4 కాంస్య పతకాలను సాధించి ఏపీ పోలీసులు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు ఈ విజయాల నేపథ్యంలో పతక విజేతలు మంగళవారం మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పోలీసు ప్రతిష్ఠను ఇనుమడింపజేసినందుకు ప్రశంసించారు.క్రీడా స్ఫూర్తితో భవిష్యత్తులో జరిగే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఎపిపిఇసెట్ 2026 ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిపిఇసెట్2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. ఈ ఏడాది పిఇసెట్‌లో మొత్తం 89.76 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన తెలిపారు.ఫలితాల వివరాల్లోకి వెళితే, పిఇసెట్2026 కోసం మొత్తం 4,037 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,958 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,655 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో పురుషులు అధికంగా ఉన్నారు. పరీక్షకు హాజరైన పురుషుల్లో 92.91 శాతం (1,993 మంది) ఉత్తీర్ణులు కాగా, మహిళల్లో 81.43 శాతం (662 మంది) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడల రంగంలో కెరీర్‌ను ఎంచుకునే దిశగా ముందడుగు వేసిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వారి భవిష్యత్ ప్రయత్నాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ర్యాంక్ కార్డులను కూడా ఇదే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలను తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించారు.

# బాలల సంక్షేమం, ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి

## ఎపిఎస్సిపిసిఆర్ ఛైర్‌పర్సన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 16,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కులపరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించి అమలాపురంలోని పలు ప్రభుత్వ, సంక్షేమ, ఆరోగ్య సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రాలు, శిశు గృహం, వన్ స్టాప్ సెంటర్, ఆనంద నిలయం ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లలో అందుతున్న సేవలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాలలు, మహిళలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

# రొయ్యల ఫీడ్ ధరల పెంపును నిలిపివేసిన కూటమి ప్రభుత్వం

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం రొయ్యల ఫీడ్ ధరల పెంపును నిలిపివేసింది. ఫీడ్ ధరల నియంత్రణకు ప్రత్యేక రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సిఫార్సు మేరకు ఇకపై ఫీడ్ ధరల నిర్ణయం ఉంటుందన్నారు. జోన్, నాన్‌జోన్, 10 ఎకరాల పరిమితి నిబంధనలు తొలగించినట్లు వివరించారు. రైతులు, ఫీడ్ తయారీదారులతో 6 గంటలపాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించగా, రొయ్యల ఫీడ్‌ధరలు పెంచితే ఊరుకోబోమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సోయాబీన్, ఫిష్ ఆయిల్ ధరలు పెరిగిన మాట వాస్తవమే అయినప్పటికీ ముడి పదార్థాల ధరల భారం రైతులపై మోపడానికి వీల్లేదన్నారు.

## వారం - వర్జ్యం

17-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
తదియ రా. 9.43, పునర్వసు మ. 1.41,
వర్జ్యం : రా. 2.58-తె. 4.24,
దు. ఉ.8.11-ఉ.9.03, 2)రా. 11.56-రా. 12.48
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** యోగక్షేమాల పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తారు. తద్వారా లాభపడతారు. ప్రయాణాలు లభిస్తాయి. వస్త్రాలు కొనుగోలు.

**వృషభం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మిథునం:** పొదుపు పథకాలలో వైఫల్యం చెందకుండా జాగ్రత్తలు పాటించండి. అప్రయత్నంగా కార్యక్రమాలు పూర్తికాగలవు.

**కర్కాటకం :** చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరప్రాంతాల నుండి శుభ వర్తమానాలు అందుకుంటారు.

**సింహం:** నిర్మాణాత్మక, వ్యూహాత్మక విషయ వ్యవహారాలలో ఆచి తూచి నిర్ణయాలు తీసుకోండి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కన్య :** ఏదయినా ఒక అద్భుత కార్యక్రమం చేసి నలుగురిలో అఖండ ఖ్యాతిని ఆర్జించాలనే కోరిక బలపడుతుంది.

**తుల :** కళారంగాల వారికి సన్మాన, సత్కారాలు పొందుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఆస్తి లాభం.

**వృశ్చికం:** సంతానం పేరు మీద స్థిరాస్తులు బదిలీ చేయడం లేక కొనుగోలు వేయడం జరుగుతుంది. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** కార్యాలయంలో మీ ప్రతిపాదనలను అందరూ ఏకగ్రీవం ఆమోదిస్తారు. శ్రమ తగిన ప్రతిఫలాలు అందుకుంటారు.

**మకరం:** ఈ రోజు తనఖాలో ఉన్న వస్తువులను విడిపించుకుంటారు. ఆర్థికంగా ఎటువంటి ఒడిదుడుకులు ఉండవు.

**కుంభం:** ఆహారపు అలవాట్లలో కొద్దిపాటి మార్పు చేస్తారు. అహంభావం ధోరణి విడనాడడం వలన లాభపడతారు.

**మీనం :** కృత్రిమముగా, ప్రభుత్వ సంబంధమైన ఇబ్బంధులు రావచ్చును. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




మంగళవారం సింగపూర్‌లో సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో సాంకేతిక పరికరాలను తిలకిస్తున్న సిఎం చంద్రబాబు

# మూడోవారంలో మెగా పిటిఎం

>> వారంలో పథకం అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం, జులై మూడో వారంలో మెగా పీటీఎం నిర్వహణకు సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల పని సర్దుబాటుపైనా సమావేశంలో చర్చించారు.

**ఉన్నత విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష**

రాష్ట్రంలో ఎప్ సెట్, పాలిసెట్, ఆర్ సెట్ వంటి 12రకాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లకు ఎటువంటి జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత సమయంలో అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సెట్స్, పొరుగు రాష్ట్రాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ల తేదీలను కూడా గమనంలోకి తీసుకొని విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్రంలోని వివిధ సెట్‌ల తేదీలను ఖరారు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్, సివిల్ విభాగాల సీట్లకు డిమాండ్ ఉందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్‌కు సంబంధించి 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88లక్షల సీట్ల భర్తీకిగాను ఎప్ సెట్ నోటిఫికేషన్‌కు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సిటీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్‌కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ, మేధావి స్కిల్ యూనివర్సిటీ, జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో చర్చల పురోగతిపై మంత్రి సమీక్షి ంచారు. జిఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటును వేగవంతం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్‌సిసి కార్యకలాపాలు, శిక్షణ, క్యాంపులు సమన్వయం చేయడానికి ఎన్‌సిసి స్టేట్ డైరెక్టరేట్‌ను మంజూరు చేసిన కేంద్రప్రభుత్వానికి మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ఎన్‌సిసి వ్యవస్థను బలోపేతం చేయడానికి, ఆంధ్రప్రదేశ్ యువతకు మరింత సైనిక శిక్షణ, ప్రోత్సాహం అందించడానికి ఈ ప్రత్యేక కేంద్రం ఉపకరించగలదని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్య కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు కేంద్రం సహకారం

>> భివృద్ధి శాఖలో అమలు చేస్తున్న కార్యక్రమాలను పవన్ కల్యాణ్ కేంద్ర మంత్రివర్యులకు వివరించారు. అనంతరం మీడియాతో పవన్ మాట్లాడుతూ 'విబి జి రాం జి కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌కు దేశంలో మూడవ అత్యధిక నిధుల కేటాయింపు కేంద్ర ప్రభుత్వ సహకారానికి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ అన్ని విధాల అభివృద్ధి చెందడానికి గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూపుతున్న చొరవ ఎనలేనిది. రాష్ట్రానికి అత్యధిక నిధులు కేటాయించడంలో తమ వంతు సహాయ సహకారాలు అందించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితో సమావేశం అయ్యి రాష్ట్రం తరఫున కృతజ్ఞతలు తెలియజేశాం. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, జీవనోపాధి అకాశాలు మెరుగుపర్చేందుకు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చించాం. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలను శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతుగా అమలు చేయడంలో రాష్ట్రం చూపుతున్న నిబద్ధతను కేంద్ర మంత్రి అభినందించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడం తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిచింది. ఈ విజయాల కారణంగానే 2026 జూలై 1న నిర్వహించనున్నవిబి జి రాం జి ప్రారంభోత్సవ కార్యక్రమానికి, జాతీయ గ్రామ వికాస్ సమ్మేళనం నిర్వహణకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో పశువులకు తాగునీటి కొరత తలెత్తకుండా చేపట్టిన నీటి తొట్టెల నిర్మాణాన్ని కేంద్ర మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు.

పెదపెంకి గ్రామంలో అమలు చేసిన మ్యాజిక్ డ్రెయిన్స్ కార్యక్రమం విజయవంతం అయిన విషయాన్ని వివరించాం. ఈ కార్యక్రమం ద్వారా పారిశుధ్యం, గ్రామీణ జీవన ప్రమాణాల మెరుగుదలలో సాధించిన ఫలితాల పట్ల కేంద్రవర్యులు ఆకర్షితులయ్యారు. ఈ నమూనాను మధ్యప్రదేశ్ లోని తన పార్లమెంటరీ నియోజకవర్గంలో అమలు చేయడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం సిద్ధం చేస్తున్న 260 మోడల్ పంచాయతీల అభివృద్ధికి విబి జి రాం జి కార్యక్రమం కింద ప్రత్యేక సహకారం అందించాలని కోరగా చౌహాన్ సుముఖత వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి నిరంతర ప్రోత్సాహం అందిస్తున్న శివరాజ్ సింగ్ చౌహాన్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. కేంద్ర సంకల్పంతో గ్రామీణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలను కేంద్ర మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్ ప్రస్తావించి ప్రత్యేక అభినందించినట్టు తెలిపారు. జులై 1న కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం వికసిత్ భారత్ - గ్రామ గౌరవ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వేదికగా మొదలు పెట్టాలని కేంద్రం నిర్ణయించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు.

# కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో పవన్ భేటీ



**విజయవాడ, జూన్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. మంగళవారం ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని మంచినీటి ఎద్దడి, కలుషితమవుతున్న నదుల పరిరక్షణ, జల్ జీవన్ మిషన్ అమలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఎపిలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీటి కొరత తీరలేదని పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ భేటీ విశేషాలను పవన్ కల్యాణ్ "ఎక్స్" వేదికగా వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన ప్రజలకు స్థిరమైన మంచినీటి సరఫరా అందించడానికి గుజరాత్‌లోని సూరత్ నమూనాను అధ్యయనం చేయాలని అధికారులకు పవన్ సూచించారు. సూరత్‌లో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేసి మళ్లీ ఎలా విజయవంతంగా వినియోగిస్తున్నారో, అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు.గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో నదీ జలాల స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ స్పష్టం చేశారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల ఎపిలోని నదులు, జలవనరులు దారుణంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వదిలే వ్యర్థాల వల్ల నదులు కలుషితం కాకుండా జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

# చేయిచేయి కలిపిన ట్రంప్, మోడీ

>> వేదికపై ఒకరినొకరు పలకరించుకున్న మోడీ, ట్రంప్ కొద్దిసేపు చర్చించారు. సదస్సు సందర్భంగా బుధవారం ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగనున్నట్లు సమాచారం. జీ7 సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్ చేరుకున్న ప్రధాని మోడీ, ప్రపంచ నాయకులతో కీలక అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకోవాలని ఎదురుచూస్తున్నానని తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్‌మీడియా వేదికగా సందేశం విడుదల చేశారు. ట్రంప్ ప్రభుత్వం భారతదేశంపై అదనపు సుంకాలు విధించడం, 2025 మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన సైనిక ఉద్రిక్తతలను తగ్గించడంలో తన పాత్ర ఉందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో ఇరుదేశాల సంబంధాల్లో కొంత ఉద్రిక్తత నెలకొంది.అయితే గత నెలలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత పర్యటన అనంతరం ఇరుదేశాలు సంబంధాల పునరుద్ధరణ దిశగా చర్యలు ప్రారంభించాయి. ఒమాన్ తీరంలో జరిగిన అమెరికా దాడుల్లో ముగ్గురు భారత నావికులు మరణించిన ఘటన తర్వాత కూడా ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో రుబియో, ప్రధాని మోడీతో సమావేశమై అధ్యక్షుడు ట్రంప్ తరఫున త్వరలో వైట్ హౌస్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో అమెరికా వ్యూహానికి భారత్ కీలక స్తంభమని రుబియో పేర్కొన్నారు.ఇతర ప్రపంచ నేతలతోనూ సమావేశాలుజీ7 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ పలు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భద్రత, వాణిజ్యం, ఇంధన సరఫరాలు తదితర కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి.

# ప్రపంచ స్థాయి క్రీడా హబ్‌గా ఆంధ్రప్రదేశ్

• మంత్రి నారా లోకేష్ • దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ మంత్రితో ప్రత్యేకంగా భేటీ


దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోందని రాష్ట్ర విద్యా, ఐటీ, యువజన సర్వీసుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేసారు. ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు వడివడిగా అడుగులు వేస్తోందని వివరించారు. రాష్ట్ర విద్యా, ఐటీ, యువజన సర్వీసుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఒక కీలక సమావేశం నిర్వహించారు. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఫీల్డర్‌గా చెరగని ముద్రవేసిన దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ మంత్రి నారా లోకేశ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మంత్రి నారా లోకేశ్‌ను జాంటీ రోడ్స్ మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిద్దరి మధ్య సమావేశం చాలా ఆత్మీయ వాతావరణంలో సాగింది. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిపై ఇరువురు తమ ఆలోచనలను పంచుకున్నారు. యువతను క్రీడల వైపు ఏ విధంగా ప్రోత్సహించాలన్న దానిపై సుదీర్ఘంగా చర్చించారు. క్రీడా రంగంలో అద్భుతాలు సృష్టించడం ఎలాగో లోతుగా విశ్లేషించారు. క్రీడల ద్వారా యువతలో సానుకూల దృక్పథాన్ని పెంచే మార్గాలను అన్వేషించారు. ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్, జాంటీ రోడ్స్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్‌ను కలవడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. క్రికెట్‌లో ఫీల్డింగ్ అంటేనే ప్రపంచవ్యాప్తంగా ముందుగా జాంటీ రోడ్స్ గుర్తుకు వస్తారని కొనియాడారు. ఆయన ఆటపట్ల చూపించే అభిరుచి ఎంతో అద్భుతమని లోకేశ్ అన్నారు.

జాంటీ రోడ్స్ క్రమశిక్షణ ఎందరికో ఆదర్శం అని ఆయన కితాబిచ్చారు. ఎప్పుడూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలనే తపన జాంటీ రోడ్స్‌లో కనిపిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది యువ క్రీడాకారులకు ఆయన నిజమైన స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. రాష్ట్రంలో భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దాలని లోకేశ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం ప్రపంచంలోనే అత్యుత్తమ పద్ధతులను రాష్ట్రంలో అమలు చేయనున్నారు. అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలను కూడా తీసుకురానున్నారు. ప్రపంచ స్థాయి శిక్షకులతో మన రాష్ట్ర క్రీడాకారులకు శిక్షణ ఇప్పించనున్నారు. ఈ దిశగా జాంటీ రోడ్స్ లాంటి దిగ్గజాల సలహాలు, సూచనలు ఎంతగానో ఉప యోగపడనున్నాయి. ఆధునిక సాంకేతికతను జోడించి క్రీడాకారుల నైపుణ్యాలను మెరుగు పరచనున్నారు.

# సిబిఎన్ 361 డిగ్రీస్ పుస్తకం ఆవిష్కరణ

• దార్శనిక నేతగా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ పుస్తకం




**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** సిబిన్ ఏట్‌దా రేట్ ఆఫ్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులకు అందించారు. ఈ పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయుడు శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ రచించారు. దీనిని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలో అనువదించారు. దార్శనిక నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ సందర్భాల్లో తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పాలకులుగా గుర్తింపు ఉన్న సింగపూర్, న్యూజిల్యాండ్ మాజీ ప్రధానులు లీ క్వాన్ యూ, జేసిందా ఆర్డాన్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ నేతల తరహాలోనే సిఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకొంటున్నారని, ఎపి అభివృద్ధికి విజన్‌ల రూపకల్పనతో పాటు అమరావతి రాజధాని నిర్మాణంలో తీసుకుంటోన్న శ్రద్ధ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని రచయిత శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ వివరించారు. ఎపి రెరా మాజీ ఛైర్మన్ రామనాథ్ వివిధ సందర్భాల్లో వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో బాహ్య ప్రపంచానికి తెలియని అంశాలను సిబిఎన్ 361 డిగ్రీస్ పుస్తకంలో ఆవిష్కరించినట్టు తెలిపారు. సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ శతజయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన వెండి నాణేన్ని సిఎం చంద్రబాబుకు అసోసియేషన్ ప్రతినిధులు బహూకరించారు. త్వరలోనే ఈ పుస్తకం తెలుగు, హిందీ సహా వివిధ భారతీయ భాషల్లో విడుదల చేయనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గతంలో వెలువడిన చంద్రబాబు ఎక్స్.0 పుస్తకం సాఫ్ట్ కాపీ 8 మిలియన్ల మేర డౌన్‌లోడ్ అయ్యిందని తెలిపారు. ఈ పుస్తకంలో పొందుపరచిన అంశాలు రాజకీయ పరిశోధకులు, నాయకత్వ లక్షణాలపై అధ్యయనం చేస్తున్న వారికి, మేనేజ్మెంట్ విద్య అభ్యసించే వారికి ఉపయుక్తంగా ఉందని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో రెరా మాజీ ఛైర్మన్ రామనాథ్, కెవి సత్యనారాయణ, శంకరప్రసాద్, సింగపూర్‌లోని తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

## కూటమి విజయాలను ప్రతి గడపకు చేర్చాల్సిన

# బాధ్యత టిడిపి కేడర్ దే

- మంత్రి నుంచి బూత్ స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ జనంలోకి వెళ్లాల్సిందే
- ఈనెల 25నుంచి ఆగస్టు 10వరకు ప్రతిగడపకు వెళ్లి చేసిన మంచిని చెబుదాం
- సర్ ప్రక్రియలో ఒక్క ఓటు కూడా పోకుండా చూడాల్సిన బాధ్యత నాయకులదే
- టిడిపి ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో యువనేత లోకేష్ వీడియో కాన్ఫరెన్స్

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై ప్రతిగడపకు వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత పార్టీ కేడర్‌పై ఉందని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయం నుంచి టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో లోకేష్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఈనెల 25నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 45రోజులపాటు ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి బూత్ స్థాయి వరకు నాయకులంతా రాష్ట్రంలోని ప్రతిగడపకు వెళ్లి చేసిన మంచిని చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేలా ప్రతి ఇంటికి కరపత్రాలు, బుక్ లెట్లు అందించాలన్నారు. కూటమిలోని జనసేన, బీజేపీ కేడర్ ను కలుపుకొని వెళ్లి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇది అధినేత చంద్రబాబు ఆదేశంగా ఆయన చెప్పారు. చంద్రబాబునాయుడు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్, దీంతోపాటు గత రెండేళ్లలో పెద్దఎత్తున చేపట్టిన సంక్షేమాన్ని జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కేడర్‌పై ఉందన్నారు. తల్లికి వందనం, దీపం 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలండర్లు, దేశంలో మరేరాష్ట్రంలో లేనివిధంగా రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ఆటో డ్రైవర్ల సేవలో, అన్నదాత సుఖీభవ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామన్నారు. చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతే మనం చేసిన కష్టం బూడిదలో పోసిన పన్నీరుగానే మిగిలిపోతుందని తెలిపారు.

2014-19 నడుమ చేసిన మంచిపనులను చెప్పుకోలేక పోవడం, ప్రత్యర్థుల విషప్రచారం వల్లే ఓటమి పాలయ్యామని లోకేష్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ప్రతిగడపకు వెళతామని తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో విజయోత్సవ సభలు నిర్వహించి కూటమి ప్రభుత్వ విజయాలపై ప్రజలను జాగృతం చేయాలన్నారు.

ఇప్పటికే ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలి, దీనిపై ఇప్పటికే కేడర్‌కు శిక్షణా తరగతులు నిర్వహించడంతోపాటు బీఎల్ఏలను కూడా నియమించామని తెలిపారు. ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నాయకులదేనని స్పష్టం చేశారు. శాసనసభ్యులు బీఎల్ఏలతో టచ్‌లో ఉండి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలి, ఎక్కడైనా సమస్య తీవ్రంగా ఉంటే పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఓటర్ వెరిఫికేషన్ సెల్‌ను సంప్రదించాలని లోకేష్ చెప్పారు.

ప్రజా దర్బారులో నేరుగా అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేష్




# ప్రజల అర్జీలన్నీ పరిష్కరిస్తాం

• ఎపి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** అర్జీలు స్వీకరించి, హామీలతో సరిపెట్టే తత్వం కూటమి ప్రభుత్వానికి లేదని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. స్వీకరించిన ప్రతి అర్జీని పరిశీలిస్తామన్నారు. వాటిని వెనువెంటనే పరిష్కరించే దిశలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ 90వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. పల్నాడు జిల్లాకు అత్యంత ముఖ్యమైన వరికపూడిశెల ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వరికపూడిశెల జలసాధన సమితి ప్రతినిధులు మంత్రి లోకేష్‌కి విజ్ఞప్తి చేశారు. బుద్ధ యోగా ఫౌండేషన్ ద్వారా మోసపోయిన 1056 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్స్‌కు తగిన న్యాయం చేయాలని బాధితులు కోరారు. మూడేళ్లుగా తాము చేసిన సేవలను గుర్తించి తగిన న్యాయం చేయడంతో పాటు భవిష్యత్‌లో కూడా ఈ సేవలు ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగించేలా చొరవ చూపాలని అభ్యర్థించారు. జంగారెడ్డిగూడెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో జరిగిన గోల్డ్‌లోన్ అవతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. తాము కుదవ పెట్టిన బంగారం వస్తువుతో పాటు తూకంలో తేడాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గర్భిణీల ఆరోగ్య సంరక్షణకు నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టడంతో పాటు మహిళల ఆత్మరక్షణకు ప్రతి నియోజకవర్గంలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేయాలని ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. యర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం పంచాయతీ సమగ్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎన్.మల్లికార్జున నాయుడు కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## పుంగనూరు టిడిపి నేతలతో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ టిడిపి నేతలు, కార్యకర్తలతో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్(సర్) ప్రక్రియపై మంత్రి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపైనా సమావేశంలో చర్చించారు. త్వరలోనే పార్టీ సంస్థాగత కమిటీలను పూర్తిచేస్తామని చెప్పారు. కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసుల ఎత్తివేతకు చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో పార్టీ పరంగా తలెత్తుతున్న సమస్యలను ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. జోనల్ ఇంఛార్జ్, నియోజకవర్గ పరిశీలకులను పంపి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు.

## పదోన్నతి పొందిన అదనపు ఎస్పీలకు పోస్టింగ్‌లు

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పదోన్నతి పొందిన పలువురు అదనపు ఎస్పీలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆ మేరకు డిజిపి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అనకాపల్లి అదనపు ఎస్పీ కె.వి.మహేశ్, అదనపు ఎస్పీ ఈగల్‌గా చొక్కా శ్రీనివాసరావు, విశాఖ అదనపు డిసిపిగా పి.రామచంద్రరావు, అనంతపురం అడ్మిన్ అదనపు ఎస్పీగా ముత్యాల నాగభూషణం, తిరుపతి అదనపు ఎస్పీ శాంతి భద్రతలుగా జె.బాబు ప్రసాద్, తిరుపతి అదనపు ఎస్పీ అడ్మిన్‌గా ఆర్ల శ్రీనివాసులు, తిరుపతి క్రైమ్ అదనపు ఎస్పీగా డి.బాలచంద్రారెడ్డిని నియమించారు. పదోన్నతి పొందిన పోలీసు అధికారులు వెంటనే విధుల్లో చేరవలసి ఉంటుంది.

## రేరా ట్రైబ్యునల్ సభ్యురాలిగా విద్యుల్లత

### పట్టణాభివృద్ధి రంగ అనుభవానికి మరో గౌరవం



**విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:** పట్టణ ప్రణాళిక, నగరాభివృద్ధి రంగాల్లో విశేష అనుభవం కలిగిన సీనియర్ అధికారి విద్యుల్లతకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక బాధ్యత అప్పగించనున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా ఆమెను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)గా పనిచేస్తున్న విద్యుల్లత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నట్లు తెలిసింది. తన సుదీర్ఘ ప్రభుత్వ సేవా కాలంలో ఆమె పట్టణాభివృద్ధి, నగర ప్రణాళిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాజకీయాలకు అతీతంగా విధి నిర్వహణలో నిబద్ధత, పనితీరు, ఫలితాలపై దృష్టి సారించే అధికారిగా విద్యుల్లతకు మంచి పేరు ఉంది. క్లిష్టమైన పట్టణాభివృద్ధి ప్రాజెక్టులు, ప్రణాళికా అంశాల్లో ఆమె చూపిన చొరవకు సహచర అధికారులు, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు లభించాయి. రేరా ట్రైబ్యునల్‌లో టెక్నికల్ సభ్యురాలిగా ఆమె నియామకం జరిగితే, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన వివాదాల పరిష్కారం, సాంకేతిక అంశాల పరిశీలన, పట్టణ ప్రణాళికకు సంబంధించిన కేసుల్లో ఆమె అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పరిపాలనలో సమర్థత, వృత్తిపరమైన నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన విద్యుల్లతకు ఈ బాధ్యత దక్కడం ఆమె సేవలకు లభించిన మరో గౌరవంగా భావిస్తున్నారు. రేరా ట్రైబ్యునల్ పనితీరు మరింత సమర్థవంతంగా మారడంలో ఆమె పాత్ర కీలకంగా ఉండనుందని అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## జనసేన జాయినింగ్స్ కమిటీ నియామకం

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీలో కొత్తగా చేరేవారిని సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేకంగా జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. 14 మంది సభ్యులతో ఆంధ్రప్రదేశ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలో కొత్తగా రాజ్యసభకు ఎంపికైన లింగమనేని రమేశ్‌తో పాటు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, సీనియర్ నతేలు కొటికలపూడి చినబాబు హరిప్రసాద్, పెదపూడి విజయ్ కుమార్ , కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య టీసీ వరుణ్, ఆరణ మదన్ సభ్యులుగా ఉంటారు. జనసేన పార్టీలో చేరుందకు ఆసక్తి కబనరుస్తున్న విద్యావంతులు, సామాజికవేత్తలు ఇతర పార్టీల నేతలతో పాటు తటస్థులను ఆహ్వానించేందుకు ఈ కమిటీ పని చేస్తుందన్నారు. త్వరలోనే జాయినింగ్స్ కమిటీ సమావేశం నిర్వహించి పార్టీలో చేరికలపై దిశానిరేద్శం చేయనున్నట్లు చెప్పారు. ఏపీ తరహాలోనే తెలంగాణలనూ జాయినింగ్స్ కమిటీ నియామకానికి సన్నాహాలు చేస్తున్నట్లు పవన్ తెలిపారు.

# మధురవాడకు మహర్దశ

## రూ.725 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

**24 గంటల తాగునీటి సరఫరా దిశగా కీలక అడుగు.. లక్షలాది మందికి ప్రయోజనం**

**విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:** విశాఖ నగర పరిధిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ (జోన్II), పరిసర ప్రాంతాల ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేసే లక్ష్యంతో రూపొందించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.725.18 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆధునిక తాగునీటి వ్యవస్థకు మార్గం సుగమమైంది. మధురవాడ, కొమ్మాది, ఎండాడ, కారాపాక, పరిసర ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరుగుతుండటంతో తాగునీటి అవసరాలు కూడా గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం కొన్ని ప్రాంతా ల్లో నీటి సరఫరా అంతరాయాలు, తక్కువ ఒత్తిడితో నీటి పంపిణీ సమస్యలు ఎదురవు తున్నాయి. కొత్త ప్రాజెక్టు అమలులోకి వస్తే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతికతతో నీటి నిల్వ, శుద్ధి, పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. ఈ మెగా ప్రాజెక్టు కోసం నిధులను మూడు వేర్వేరు వనరుల ద్వారా సమీకరించనున్నారు. కేంద్ర ప్రభుత్వ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూ సీ ఏఫ్) నుంచి రూ.172.37 కోట్లు అందనున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ తన వాటాగా రూ.190.21 కోట్లు భరిస్తుంది. మిగిలిన రూ.362.60 కోట్లను గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ టర్మ్ లోన్ రూపంలో సమకూర్చనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో మధురవాడ ప్రాంత ప్రజలకు రోజంతా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. నీటి కోసం నిల్వ చేసుకోవాల్సిన అవసరం తగ్గడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి. అలాగే వేగంగా విస్తరిస్తున్న నివాస కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు అండగా నిలవనుంది. నగర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలవనుంది. విశాఖను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక నగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఈ తాగునీటి ప్రాజెక్టు ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత లక్షలాది మంది ప్రజలు నాణ్యమైన తాగునీటి సేవలను నిరంతరాయంగా

# రెండేళ్లలో శాంతి భద్రతలు, మహిళా రక్షణ, డ్రగ్స్ నియంత్రణలో గణనీయ పురోగతి

## హోం మంత్రి వంగలపూడి అనిత



**సచివాలయం, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ళ కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాలను అరికట్టడం, విపత్తుల నిర్వహణ, జైళ్ళ సంస్కరణలు, పోలీసు సంక్షేమం వంటి అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలను చేపట్టి విశేష ఫలితాలు సాధించిందని రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి తెలిపారు.

మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రయోజనాలకు పరిమితమైన వ్యవస్థలను ప్రజా సేవా దృక్పదంతో పునర్మిస్తూ ప్రజలకు జవాబుదారీగా పనిచేసే పరిపాలన వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, నేరం జరగకుండా ముందుగానే నిరోధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల భద్రత, మహిళల గౌరవం, యువత భవిష్యత్తు, సమాజ శాంతి కోసం రాజీపడకుండా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి స్పష్టంచేశారు. సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన నిఘా వ్యవస్థలు, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, అంతర్‌శాఖ సమన్వయాన్ని మెరుగుపర్చడం ద్వారా రాష్ట్రంలో మొత్తం నేరాల శాతం సమారు 14.1శాతం మేర తగ్గిందన్నారు. శక్తియాప్ ద్వారా అత్యవసర సహాయం, మహిళలపై నేరాలకు ప్రత్యేక పర్యవేక్షణ అమలు చేయబడుతుందన్నారు. శక్తియాప్ ద్వారా ఇప్పటివరకు 11.15 లక్షలకు పైగా అత్యవసర ఎస్ఓఎస్ కాల్స్ అందాయని వాటిపై తక్షణ చర్యలు కూడా తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. తప్పిపోయిన చిన్నారులు, మహిళలు, వృద్ధులను గుర్తించి కుటుంబాలకు చేర్చేందుకు చేపట్టిన ఆపరేష్ ముస్కాన్ అత్యంతగా విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 8,396మంది తప్పిపోయిన వ్యక్తులను గుర్తించి, వారి కుటుంబాలకు తిరగి చేర్చడం జరిగిందన్నారు. అదనపు డిజి మధుసూధనరెడ్డి, హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్, ఎస్‌పిఎఫ్ డిజి డాక్టర్ త్రివిక్రమ వర్మ, హోంశాఖ స్పెషల్ సెక్రటరీ విజయ్‌కుమార్, ఈగల్ చీఫ్ ఐజి రవికృష్ణ, ఐజీలు శ్రీకాంత్, రాజకుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ఎండి ప్రకర్‌జైన్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ వెంకట రమణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# ఏనుగులు వ్యధ.. ఎన్నాళ్లు అనుభవించాలి

• ఎన్నో ప్రాణాలు బలిగొన్నాయి • పంట పొలాలకు తీవ్రనష్టం • రైతులను ఆదుకునే వారేరీ?

**విజయనగరం, జూన్ 16 ప్రభాతవార్త:** గత కొన్ని సంవత్సరాలుగా అడవిలో ఉండవలసిన గజరాజులు సాధారణ గ్రామాలలో సంచరించడంతో ప్రజలు భయాందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం ఏర్పడుతుంది. అరకొర ఫారెస్ట్ సిబ్బందితో గజరాజు ప్రజల బార్ కి రాకుండా కాపాడటం కష్టంగా తయారయింది. వన్యప్రాణులు పంట పొలాలలో సంచరించడంతో నోటి దగ్గరకొచ్చిన పంట బుగ్గిపాలవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పార్వతీపురం జిల్లా మక్కువ మండలంలో సుమారు పది గజరాజులు ధ్వంసం చేస్తూ పొలాల్లో అమర్చిన నీరు పంపుసెట్‌లు కూడా చెల్లాచెదురుచేస్తూ విధ్వంసం సృష్టించుతున్నాయి. అరకొరగా ఉన్న ఫారెస్టు సిబ్బంది గజరాజుల నుంచి వచ్చిన ధ్వజాన్ని వెనక్కి మళ్లించడంలో నిమగ్నమైన వారు కూడా మనుషులే కదా దీనిపై ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందో ఏమి తెలియ రాలేదు. ఎన్నాలిలా గజరాజులు దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవలసి వస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో వీటినుంచి ప్రజలను కాపాడే చర్యలు చేపట్టాలని ఉభయజిల్లాలకు చెందిన ప్రజలు ఏకరువు పెడుతున్నారు. రెండు వారాలుగా డబ్బగడ్డ, సి బిల్లి పెద్దవలస పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగులు గుంపు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. గత వారం రోజులుగా మక్కువ మండలం కాముడువలస సిబిల్లి, గైసీల తదితర ప్రాంతాల్లో 8 ఏనుగులు గుంపు పామాయిల్, అరటి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్లను, డ్రిప్ ఇరిగేషన్ పైపులను ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు అప్పులు చేసి వ్యవసాయంపై పెట్టుబడులు పెడితే ఈ ఏనుగులు ఎలా పాడు చేయడంతో జీర్ణించుకోలేక పోతున్నామని వాపోతున్నారు మరోవైపు పాడైన పంటల నష్టాలను అంచనా వేసేందుకు కూడా అధికారులు ముందుకు రావడంలేదని వాపోయారు. ఒకరిపై ఒకరు అధికారులు నెట్టుకుంటూ వస్తున్నారే తప్ప రైతులకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట కాముడవలసకు చెందిన రైతు జీ.పోలినాయుడు వ్యవసాయ పొలంలో ఉన్న రెండు బోర్లను ధ్వంసం చేశాయి. పామాయిల్ చెట్లను పీకేయడంతో రైతుకు సుమారు లక్ష వరకు నష్టం జరిగి ఉంటుందని వాపోతున్నాడు. సిబిల్లి, ఫైసిల, పెద్దవలస తదితరప్రాంతాల్లో అరటి తోటలు ధ్వంసమయ్యాయి. ఏనుగులు గుంపును ఒడిశాలోకి పంపించేందుకు అటవీ శాఖ అధికారులు విశ్వప్రయత్నం చేస్తున్న అవి కదలడం లేదు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారంతా రాత్రిపూట గుంపు గ్రామంలోకి వస్తుందేమోనని భయంతో వణికిపోతున్నారు. ఏనుగులను ఇక్కడి నుంచి అడవుల్లోకి తరలించాలని గిరిజనులు కోరుతున్నారు. అలాగే పాడైన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

**ANANTAPURAMU MUNICIPAL CORPORATION**
**e-PROCUREMENT - Tender Notice**

| | | |
|---|---|---|
| 1. | Tender Notice No | 101 to 116/NCAP and 15th FC and GF/2026-27/TO |
| 2. | Scope of work | Providing of BT Rods , Road Improvement, CC Road |
| 3. | No. of Works | 16 Nos |
| 4. | Estimate Cost | Rs. 4.00 to 200 Lakhs |

**Note :** The details of tender may be seen on e - procurement market Place available @ https://tender.apeprocurement.gov.in.

sd/- Commissioner, Municipal Corporation, Anantapuramu

వార్త

చెవిటి వాడు ఎవరు? మాట వినలేనివాడు కాదు. మంచి మాట విననివాడు.

-ఆది శంకరాచార్యులు

# చిక్కుముడులు వీడినట్లేనా?

ఇల్లలకగానే కాదు ముందుంది ముసళ్ల పండుగ అన్న చందాన పశ్చిమాసియాలో శాంతి వీచికలకు ఇంకా టైం పట్టేట్టుంది. అయితే శాంతి ప్రక్రియ మొదలైంది కనుక కనుచూపు మేరలో యుద్ధానంతర ప్రభావాలు ఒక్కటొక్కటీ కనుమరుగై యుద్ధ విరమణ పర్యవసానాలు వెలుగులోకి వస్తాయని ఆశపడ్తుంటారు. యుద్ధ విరమణకు సానుకూల ఒప్పందం తుదిరూపు దిద్దుకుందనగానే భారతీయుల్లోనే కాదు యుద్ధ ప్రభావిత దేశాల్లో కూడా ఎంతో సంతోషం వ్యక్తమైంది. హర్మూజ్‌జలసంధి మార్గంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు సాఫీగా జరిగితే బావుంటుందనే ఆలోచన మదిలో మొలకెత్తుతుంది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 4.7 శాతం తగ్గి 84 డాలర్లకు దిగువకు చేరింది. యుద్ధ నేపథ్యంలో క్రూడాయిల్ ధర 125 డాలర్లకు తాకడమే చెప్పుకోదగిన విపరిణామం. యుఎఇ, ఖతార్, కువైట్, బహ్రెయిన్ సౌదీ అరేబియా దేశాలపై ఇరాన్ దాడులకు తెగబడడంతో ముడి చమురు, సహజవాయులు తయారీ, సరఫరాకు ఆటంకమేర్పడింది. చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి తెరుచుకుంటోందంటేనే ప్రభావిత దేశాలు సంబరపడ్డాయి. అమెరికా ఇరాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందానికీ తమకూ సంబంధం లేదంటూ లెబనాన్‌పై ఇజ్రాయిల్ విరుచుకుపడటమొక్కటే ఈ ఒప్పందం ఎంతవరకు అమలులోకి వస్తుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయినా స్వయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన భరోసాతో ఒప్పందాలు సంతకాల వరకు వచ్చాయి. చమురు ధరలు దిగిరావడంతో మదుపరుల్లో కాస్తంత ఊరట కలిగింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు బ్యారెల్ ముడిచమురు ధర 70 డాలర్ల వద్ద ఉండేది. మళ్లీ ఆ రేటును చేరుకుంటే తప్ప మార్కెట్ల మాయాజాలం నుంచి బయటపడడం. అలా జరిగినా రిటైల్ ధరలు తక్షణమే అదుపులోకి వస్తాయని కానీ, అనేక కారణాల చేత ప్రభావితమైన ధరలన్నీ ఆగమేఘాల మీద తగ్గిపోయే పరిస్థితి ఉంటుందని కానీ చెప్పలేం. యుద్ధం వెంబడి నిత్యావసర వస్తువులు ఆకస్మికంగా కొండెక్కాసాయి. అలా అని యుద్ధ విరమణ తర్వాత అంతే స్పీడ్‌లో ధరలు తగ్గించే యంత్రాంగమేదీ లేదు. అంతే వేగంగా పనిచేసే పరిస్థితి ఏర్పడదు. ఇంకా ధరలు పెరిగినా పాత స్టాక్‌లున్నాయి కనుక మరి కొన్నాళ్లు ధరలు తగ్గించలేరు. మరికొంత కాలం వినియోగదారుని నెత్తిన ధరల భారం తప్పదు. ఈలోగా ఈనాటి శాంతి ఒప్పందం నరపపంచ ఇంధన మార్కెట్లకు శుభపరిణామమే కావచ్చు కాని సామాన్య వినియోగదారునికి మాత్రం తీవ్ర మనోవేదనే. ఈ ఒప్పందాలన్నీ సజావుగా అమల్లోకి వచ్చినా హర్మూజ్ జలసంధి తెరచుకోవడమే కాదు. అక్కడ జలాల్లో దాచిన మందుపాతరలు (సీమైన్స్) తొలగించడం, డ్రోన్ భద్రతలను ఉపసంహరించుకుంటే తప్ప, అక్కడే ఆగి ఉన్న 500 నౌకలు జలసంధి మార్గం నుంచి తమ సొంతదేశ సముద్ర జలాల్లోకి మరలవు. దానికీ దీర్ఘకాలమే పట్టొచ్చు. గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకున్న ఆ వాణిజ్య నౌకలన్నీ ఆయా దేశాలకు 'చేరిపోతే తప్ప' అలజడి తగ్గదు. భారత్ తన చమురు అవసరాలకు గల్ఫ్ దేశాల మీదనే ఆధారం. హర్మూజ్ తెరవగానే మరో మూడు నెలలకైనా చమురు తగ్గినా పాత ధరల అమల్లో ఉంటాయి. క్రమేపీ రవాణా ఖర్చులు తగ్గుతాయి. దానిపై ఎంతో కొంత ధరల తగ్గింపు ఉంటుంది. సామాన్యుడి వంటింటి ఖర్చు తగ్గుతుంది. చమురు విరివిగా, చౌకగా దొరికే అవకాశముంటే రవాణా ఖర్చులు ఆదా అవుతాయి. అదే జరిగితే 'కిచెన్ బడ్జెట్' తేలికవుతుంది. ఇంధన ధరలపై ప్రతికూల ప్రభావం కూడా తగ్గుతుంది. మొత్తానికి దిగుమతుల వ్యయం తగ్గడం వినియోగదారునికి ఊరటే. ఇరాన్ అణ్వాయుధీకరణపై ఇంకా అనిశ్చితి ఉండనే ఉంది. ప్రతిష్టంభనలో ఉన్న ఇరాన్ నిధులను అమెరికా డీఫ్రీజ్ చేయడం కూడా ముఖ్యమే. అసలు సిసలు 'పీఠముడి' ఈ రెండు అంశాలపైన ఉంది. ఈవ్యవహారంలో ఒప్పందం నాటి షరతుల మేరకు సజావుగా సాగితేనే పరిష్కారాలు ఫలవంతమౌతాయి. శాంతి వచనాలు వినేందుకు 19న స్విట్జర్లాండ్‌లోని జెనీవా అధికారిక కార్యక్రమంలోనే బయటపడతాయి. దాదాపు నాలుగు నెలల పశ్చిమాసియా కల్లోలానికి అంతిమఘడియలు సమీపించాయి. కానీ అన్నిదేశాలు, అన్నిషరతుల పాటింపు వంటిఅంశాలు కొలిక్కి వచ్చేసరికి మరికొన్ని నెలలు పట్టొచ్చు. తాజా అవగాహన అమలు జరిగితే పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాల పునరుద్ధరణ, నౌకాయాన, స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశమేర్పడ్తుందని భారత్ తరపున ప్రధాని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శాంతియుత పరిష్కారం ద్వారా ఓ కీలకమైన అడుగుపడటం పట్ల ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ గుటెరస్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రాంతీయ స్థిరత్వానికి ప్రస్తుత శాంతి ఒప్పందం దోహదపడగలదని భావిస్తున్నట్లు యూరోపియన్ కమిషన్‌అధ్యక్షురాలు ఉరులాఅభిభాషణ. ప్రస్తుతం ఒప్పందవిశేషాలకు వర్చువల్ సంతకాల ద్వారా ఆమోద ముద్ర పడింది. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఒమన్ దేశాలకున్న సార్వభౌమాధికారం విషయంలో అమెరికా స్పష్టతనివ్వడంలో ఇరాన్ కాస్త మెతకబడినట్లు ఉంది. ఒప్పందంపై డిజిటల్ సంతకాలు చేసినమరునాడు చమురుతో ఆయా దేశాల నౌకలు కదలికలు ప్రారంభమయ్యాయి. ఆది నుంచి అంతంవరకు శషభిషలు లేకుండా, ఒప్పందాలను చిక్కుముడులు పడకుండా అమలు చేయగలిగితే ప్రపంచానికే శుభపరిణామం కాగలదు.



అంధుని చేతికి ఆసరాగా ఊతకర్ర ఎంత అవసరమో, ఆపదలో ఉన్న వారికి ధైర్యం అంత అవసరం.

రామకృష్ణ పరమహంస



ఏ విషయమైనా కొత్తగా ఉన్నప్పుడే బాగుంటుంది. కాని స్నేహం మాత్రం పాతబడిన కొద్దీ బాగుంటుంది.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య

# సామాన్యుడికి భారంగా ప్రైవేట్ చదువు!

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు, ఇంగ్లీష్ మాధ్యమం వంటి అవకాశాలను పెంచితే ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడటం తగ్గుతుంది. ఇలాంటి కఠిన చర్యలను ప్రభుత్వం తీసుకుంటేనే ప్రైవేటు బడుల్లో ఫీజుల నియంత్రణకు ముక్కు తాడు వేసినట్టు అవుతుంది. 'విద్యవ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత' అనే భావనతో ప్రభుత్వం కఠిన నియంత్రణలు అమలు చేస్తేనే ప్రైవేటు బడుల్లో ఫీజులమోతకు అడ్డుకట్ట పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ కాపాడే విధానాలు అవసరం. విద్య వ్యాపార వస్తువు కాదు. అది సమాజాన్ని తీర్చిదిద్దే శక్తి. విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రైవేటు పాఠశాలల ఫీజుల విషయంలో సమతుల్యత అవసరం. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, విద్యాసంస్థలు, సమాజం కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది.**



డా.మోటె చిరంజీవి

విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు. సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి విద్యే పునాది. అయితే నేటి పరిస్థితుల్లో విద్య హక్కు కంటే వ్యాపారంగా మారిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు విద్యకు ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. కానీ కాలక్రమేణా ప్రైవేటు విద్యాసంస్థల సంఖ్యపెరిగింది. నాణ్యమైన విద్య, ఇంగ్లీష్ మాధ్యమం, ఆధునిక సదుపాయాల పేరుతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని కొన్ని విద్యాసంస్థలు ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల పెంపు తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా ఛార్జీలు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో వేల నుంచి లక్షల రూపాయల వరకు వసూలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడంతా జనాలు అమ్మో జూన్ నెల అనుకుంటున్నారు. ఇటు స్కూల్ ఫీజుల మోత మొదలైంది. ఇప్పటికిప్పుడు పాఠశాలల్లో ఎంతో కొంత ఫీజు కట్టాల్సి ఉంటుంది. మరోవైపు రైతన్నలకు పెట్టుబడి ఖర్చుల దిగులు పట్టుకుంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఏటా 10 శాతం నుండి 15 శాతం వరకు ఫీజులను పెంచుతూ తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్ నెలలో పాఠశాలల పునఃప్రారంభం వేళ అడ్మిషన్ల పేరుతో, పుస్తకాలు, డ్రెస్సుల పేరుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను నిలువునా దోచుకుంటున్నారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి, పొదుపులను ఖర్చుచేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉంటే ఆర్థిక ఒత్తిడి మరింత పెరుగుతోంది. కొంతమంది తల్లిదండ్రులు ఫీజుల కోసం వ్యక్తిగత రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సగటు వార్షిక ఫీజు రూ. 41,475 దాటిపోయింది. ఇది రాష్ట్రంలోని కనీస బీటెక్ ఫీజు (రూ.36,000) కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. గ్రామాల్లో సైతం సగటు స్కూల్ ఫీజు రూ. 35,104గా నమోదవుతోంది. పట్టణాలకు, గ్రామాలకు తేడా కేవలం ఆరువేల రూపాయలు మాత్రమే. ఎల్‌కేజీ, యూకేజీ చదువులకే కనీసం రూ.30,000 నుండి రూ. 50,000 వరకు వసూలు చేస్తున్నారు. హైస్కూల్ విద్యార్థులకైతే ఈ భారం రూ.80,000 పైమాటే. అదనపు వసూళ్ల దోపిడీ పుస్తకాలు, యూనిఫాంలదందా కనిపిస్తుంది. నిబంధనల ప్రకారం స్కూళ్లలో పుస్తకాలు అమ్మకూడదు. కానీ, ఐటీఐ ఒరియంటెడ్, ఐఐటీ లేదా నీట్ సిలబస్ పేరుతో ప్రైవేట్ పబ్లికేషన్ల పుస్తకాలను రూ. 10,000 నుండి రూ.12,000కు విక్రయిస్తున్నారు. కేవలం ట్యూషన్ ఫీజే కాకుండా యూనిఫాం, షూస్ కోసం రూ.4,000, స్కూల్ బస్సు ఛార్జీల కింద నెలకురూ.2,000 నుండిరూ. 3,000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. జూన్ నెలలో ఇద్దరు పిల్లలున్న ఒక మధ్యతరగతి కుటుంబం కేవలం చదువుల కోసమే ఒకేసారి రూ. 1,00,000 నుండి రూ.1,50,000 వరకు సిద్ధం చేసుకోవాల్సి వస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ చట్టంపై ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత కరవైంది. దీనివల్ల సుమారు 11వేల ప్రైవేటు స్కూల్స్‌లోని 32 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈభారాన్ని మోయాల్సి వస్తోంది. బోర్డుల ప్రదర్శన లేదు. పాఠశాలలో ఎంత ఫీజు వసూలు



చేస్తున్నారు, ఎలాంటి సౌకర్యాలున్నాయి అనే వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలనే విద్యాశాఖ నిబంధనలను ఏ పాఠశాల పాటించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని బడులు కూడా తామేం తక్కువకాదంటున్నాయి. ఈ స్కూళ్లల్లో సగటు ఫీజు రూ.35,104గా ఉంది. అంటే పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ బడుల ఫీజులకు తేడా ఆరువేలే కావడం గమనార్హం. ఈ వివరాలు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించినవే. అసెంబ్లీకి సమర్పించిన సోషియో ఎకనామిక్ సర్వేలో ఈ వివరాలు సర్కార్ పొందుపరిచింది. ప్రాంతాలవారీగా, యాజమాన్యాల వారీగా సగటు ఫీజుల వివరాలు సర్కార్ ఈ నివేదిక ద్వారా వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వబడుల్లో తల్లిదండ్రులు చేస్తున్న ఖర్చు రూ.2,286మాత్రమే. అదే ఎయిడెడ్ బడుల్లోని తల్లిదండ్రులు రూ.28,420, ఇతర బడుల్లో రూ.4,907, నాన్‌గవర్నమెంట్ స్కూళ్లల్లో రూ.34,012 చొప్పున ఖర్చుచేస్తుండగా అదే ప్రైవేట్ బడుల్లోని తల్లిదండ్రుల వ్యయం రూ.35,104గా ఉంది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లోని సర్కార్ స్కూళ్లల్లో తల్లిదండ్రులు చేస్తున్న ఖర్చు రూ.3,963 మాత్రమే. అదే ఎయిడెడ్ బడుల్లోని తల్లిదండ్రులు రూ. 32,951, ఇతర బడుల్లో రూ.3,260, నాన్ గవర్నమెంట్ స్కూళ్లల్లో రూ. 38,884 చొప్పున ఖర్చుచేస్తుండగా అదే ప్రైవేట్ బడుల్లోని తల్లిదండ్రుల వ్యయం రూ.41,475గా ఉంది. విద్యాసంస్థలు కూడా తమవైపు నుంచి కొన్ని కారణాలను చెబుతున్నాయి. ఉపాధ్యాయుల వేతనాలు, భవన నిర్వహణ, విద్యుత్, సాంకేతిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు వంటి ఖర్చులు పెరిగాయని పేర్కొంటున్నాయి. అయితే ఈ ఖర్చుల పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడం సమంజసమా అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం ఈ అంశంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరంఉంది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణకు స్పష్టమైన విధానం రూపొందించాలి. ఫీజుల పెంపుపై పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా పెరుగుతున్న ఫీజులను నియంత్రించడానికి ప్రభుత్వం పలు కఠినమైన పారదర్శకమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర స్థాయిలో స్వతంత్ర ఫీజు నియంత్రణ కమిషన్ ఏర్పాటు చేసి, ప్రతి పాఠశాల వసూలు చేసే ఫీజులను పరిశీలించి ఆమోదించాలి. ప్రతి సంవత్సరం ఫీజుపెంపునకు గరిష్ట పరిమితి నిర్ణయించాలి. నిర్దిష్టశాతం కంటే ఎక్కువ పెంపు చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయాలి. పాఠశాలలు తమ ఫీజుల వివరాలను వెబ్‌సైట్‌లో, నోటీసు బోర్డులోతల్లిదండ్రులకు ముందుగానే వెల్లడించేలా నిబంధనలు అమలు చేయాలి. అడ్మిషన్ ఫీజు, డొనేషన్, డెవలప్‌మెంట్ ఫండ్, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేయకుండా కఠినచర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులు పాఠశాల సూచించిన దుకాణాల నుంచే కొనాలనే బలవంతాన్ని తొలగించి, ఎక్కడైనా కొనుగోలు చేసే స్వేచ్ఛ కల్పించాలి. జిల్లా స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, తల్లిదండ్రుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి. ప్రైవేటుపాఠశాలల ఆదాయం వ్యయాలపై ప్రతి సంవత్సరం ఆర్థిక ఆడిట్ నిర్వహించి, నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై జరిమానాలు విధించడం, గుర్తింపు రద్దు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఫీజుల నిర్ణయంలో తల్లిదండ్రుల ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు, ఇంగ్లీష్ మాధ్యమం వంటి అవకాశాలను పెంచితే ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడటం తగ్గుతుంది. ఇలాంటి కఠిన చర్యలను ప్రభుత్వం తీసుకుంటేనే ప్రైవేటు బడుల్లో ఫీజులనియంత్రణకు ముక్కు తాడు వేసినట్టు అవుతుంది. 'విద్యవ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత' అనే భావనతో ప్రభుత్వం కఠిన నియంత్రణలు అమలు చేస్తేనే ప్రైవేటు బడుల్లో ఫీజుల మోతకు అడ్డుకట్ట పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక స్థితి రెండింటినీ కాపాడే విధానాలు అవసరం. విద్య వ్యాపార వస్తువు కాదు. అది సమాజాన్ని తీర్చిదిద్దే శక్తి. విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రైవేటు పాఠశాలల ఫీజుల విషయంలో సమతుల్యత అవసరం. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, విద్యాసంస్థలు, సమాజం కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. ●

# స్పష్టతే న్యాయానికి నిజమైన బలం

తరిగోపుల నారాయణస్వామి

భారత పార్లమెంటు ద్వారా రూపొందించబడే ప్రతి చట్టం ప్రజల జీవన విధానంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అయితే ఆ చట్టం ఎప్పటి నుంచి అమలులోకి వస్తుంది? 'ఎవరికి వర్తిస్తుంది?', గత ఘటనలకు కూడా వర్తిస్తుందా లేదా?' వంటి అంశాలు స్పష్టంగా చట్టంలో పొందుపరచబడకపోతే న్యాయవ్యవస్థలో, పరిపాలనలో, ప్రజల జీవితాలలో అనేక గందరగోళాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యకు మూలకారణం చట్ట నిర్మాణ సమయంలో ప్రారంభ తేదీ, వర్తింపు పరిధులను అత్యంత స్పష్టంగా పేర్కొనకపోవడమే. ప్రజాస్వామ్యంలో చట్టం రూపొందించడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత. అందువల్ల ప్రతి చట్టంలో ఈ చట్టం ఫలానా తేదీ నుంచి అమలులోకి వస్తుంది. ఈ తేదీ తర్వాత జరిగే నియామకాలు, సంఘటనలు లేదా లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది అనే అంశాలను స్పష్టంగా పేర్కొనడం తప్పనిసరి చేయాలి. ఇది కేవలం సాంకేతిక అంశం కాదు, ప్రజల న్యాయ హక్కుల రక్షణకు సంబంధించిన మౌలిక అవసరం. చట్టంలో స్పష్టత లేకపోతే న్యాయస్థానాలు చట్ట ఉద్దేశ్యాన్ని విశ్లేషించి వ్యాఖ్యానించాల్సి వస్తుంది. కొన్ని సందర్భాలలో ఆ వ్యాఖ్యానాలు చట్టం అమలులోకి రాకముందు ఉన్న పరిస్థితులకు కూడా వర్తించేలా మారవచ్చు. దీనివల్ల ప్రజలు, ఉద్యోగులు, సంస్థలు అనిశ్చితికి గురవుతారు. ఉదాహరణకు విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ అర్హత పరీక్ష అంశంపై అనేక న్యాయ వివాదాలు తలెత్తాయి. కొత్త అర్హతలు పాత నియామకాలకు వర్తిస్తాయా లేదా అనే ప్రశ్న కోర్టుల ముందుకు వెళ్లింది. చట్టం వర్తింపు పరిధి మరింత స్పష్టంగా ఉండి ఉంటే ఇలాంటి వివాదాలు చాలా వరకు నివారించబడేవి. అలాగే సమాచార హక్కు చట్టం, వస్తు సేవల పన్ను చట్టం, దివాలా చట్టం ఆధార్ చట్టం, వివిధ భూ సంస్కరణ చట్టాలు వంటిఅనేక చట్టాల అమలులో కూడా ప్రారంభదశలో వ్యాఖ్యాన భేదాలు, అమలు గందరగోళాలు, న్యాయ వివాదాలు కనిపించాయి. ఈ ఉదాహరణలన్నింటిలో ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. చట్టం ప్రారంభ తేదీ, వర్తింపు పరిధి, గతానికి వర్తింపు అంశాలు ఎంత స్పష్టంగా ఉంటే అంత తక్కువ వివాదాలు ఉంటాయి. స్పష్టత లేకపోతే కోర్టులు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. దీనివల్ల సంవత్సరాల పాటు కేసులు కొనసాగి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇక్కడ మరో ముఖ్యమైన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పటికే అమలులో ఉన్న కొన్ని చట్టాలలో ఈ విధమైన అనిశ్చితి లేదా సందిగ్ధత ఉంటే, ప్రజాప్రతినిధులు వాటిని అలాగే వదిలేయకుండా సవరణలు చేయాలి. అవసరమైతే చట్ట సవరణ ద్వారాఈ చట్టం ఫలానా తేదీ నుంచి అమలులో ఉన్నవారికే వర్తిస్తుంది, లేదా ఈ తేదీకి ముందు జరిగిన సంఘటనలకు వర్తించదు అనేస్పష్టమైన నిబంధనలను చేర్చాలి. ఇలా చేస్తే సంబంధిత వర్గాల ప్రజలు, ఉద్యోగులు, సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయి. అంతేకాకుండా న్యాయస్థానాలపై పడుతున్న భారం కూడా తగ్గుతుంది. ప్రజాస్వామ్యంలో మంచి చట్టం అంటే కఠినమైన చట్టంకాదు, స్పష్టమైన చట్టం. ప్రజలు, అధికారులు, న్యాయస్థానాలు ఒకే విధంగా అర్థం చేసుకునే చట్టమే ఉత్తమ చట్టం. అందువల్ల భవిష్యత్తులో రూపొందించే ప్రతి చట్టంలో ప్రారంభ తేదీ, వర్తింపు పరిధి, గతానికి వర్తింపుపై స్పష్టమైన నిబంధనలు తప్పనిసరి చేయాలి. అలాగే ఇప్పటికే ఉన్నసందిగ్ధ చట్టాలను సవరించి స్పష్టత తీసుకురావాలి. చట్టం ప్రజల కోసం ఉండాలి, ప్రజలను అయోమయంలో పడేయడానికి కాదు. స్పష్టతే న్యాయానికి నిజమైన బలం. ●

# 'కాక్రోచ్'ల అపర సృష్టి మస్క్‌దేనా?



సరికొండ రవీంద్రనాథ్

భారతదేశంలోనే కాదు యూరప్‌తోసహా అనేక దేశాల్లో కాక్రోచ్ పుట్టలను సృష్టించిన చరిత్ర ఎలాన్ మస్క్‌ది. పారిస్ నుంచి ఢిల్లీ వరకూ, బ్రస్సెల్స్ నుంచి మలేషియా వరకూ అన్నిదేశాలూ మస్క్‌వల్ల ఎదోరకమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అనేక దేశాలు మస్క్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను నిషేధించాయి. ఎఐ వేదిక గ్రోక్ ద్వారా ప్రముఖుల అశ్లీల వీడియోలు చేసి అపఖ్యాతిపాలు చేయడం. ఇదే ఎలైన్ మస్క్ సోషల్ మీడియా ప్లాట్ ఫాంల అజెండా. ప్రముఖులు ఎప్పుడు తన దుష్ప్రచారానికి దొరుకుతారా అని ఎదురుచూస్తున్న మస్క్‌కు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ 'కాక్రోచ్' వ్యాఖ్యలు అవకాశంగా దొరికాయి. అయితే ఆయన తన ఉద్దేశ్యం గురించి వివరణ కూడా ఇచ్చారు. ఎక్స్ వేదికగా అభిజీత్ దీప్కే అకౌంట్ ఓపెన్ చేయడం రెండు లక్షల ఫాలోవర్స్ రావడం రాత్రికి రాత్రి జరిగిపోయింది. మొదట ఎక్స్‌లో కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో అభిజీత్ దీప్కే అకౌంట్ ఓపెన్ చేయగానే ఫాలోయర్లు రెండు లక్షల మందికి పెరిగిపోయారు. అసాధారణంగా ఫాలోయర్లు పెరగడం, మరో వైపు, వివాదానికి చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కేంద్ర బిందువు కావడంతో భారత దేశ హోం శాఖ అప్రమత్తమై ముందు జాగ్రత్తగా అకౌంట్‌ను తాత్కాలికంగా సీజ్ చేయించింది. తర్వాత దీని వివరాలు తెలుసుకుని అకౌంట్‌ను కొనసాగించడానికి అనుమతించారు. కాక్రోచ్ జనతా పార్టీ సీజ్ కావడంతో కాక్రోచ్ ఈజ్ బ్యాక్ అనే పేరుతో ఎక్స్‌లోనే మరో అకౌంట్‌ను అభిజీత్ ప్రారంభించాడు. మస్క్ ఎక్స్ వ్యవహార శైలిపై ఇప్పటికే దేశంలో అనేక ఫిర్యాదులున్నాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహించే పోస్టులను తొలగించాలని సహాయోగ్ సెన్సార్ విభాగం కోరినా మస్క్ ఎక్స్ ఖాతరు చేయలేదు. దీనితో మస్క్ ఎక్స్‌కు హోం శాఖ ఈ ఏడాది జనవరి రెండోతేదీన నోటీసులు జారీ చేసింది. ఆ కడుపు మంటతోనే మస్క్ కాక్రోచ్ ఉద్యమానికి భారీ ప్రచారాన్ని ఇచ్చినట్టు అనుమానిస్తున్నారు. భారత హోంశాఖ 'ఫేక్' ఫాలోయర్స్ పై విచారణ మొదలు పెట్టడంతో ఎక్స్‌పై ప్రభుత్వ చర్య ప్రారంభం అవుతుందన్న అనుమానంతో కావచ్చు. అకౌంట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌కు మార్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పది రోజుల్లో రెండు కోట్ల మంది ఫాలోయర్స్ చేరారు. ఇది అసాధారణమైన పెరుగుదలగానే సైబర్ నిపుణులు భావిస్తున్నారు. సాధారణంగా కంపెనీల మార్కెటింగ్ కుట్రలు, కుతంత్రాలకు ఉపయోగించే బోట్ నెట్ వర్క్‌లు, ఎక్స్‌మేటా డేటా సెంటర్లు అల్ గోరథమ్స్ ప్రమోషన్ ద్వారా ఫేక్‌లతో ఫాలోయర్ల సంఖ్య అసాధారణంగా పెంచుతారు. ఎలాన్ మస్క్, ట్రంప్ లాంటి వారు కావాలనుకుంటే డేటా సెంటర్లలోనే ఆలోరిథమ్స్‌లో మాయ చేయడం కష్టమేమీ కాదు. ఇటువంటి కుట్రల కోసమే సోషల్ మీడియా ప్లాట్ ఫాంలను అమెరికా ఉపయోగించుకుంటోంది. బోట్ నెట్ వర్క్‌లు, ఆటో కంప్యూటరైజ్డ్ ప్రాసెస్ లేకపోతే పది రోజుల్లో కోటి నలభై



లక్షల 'వర్టికల్ గ్రోత్' సాధ్యం కాదని సైబర్ నిపుణుల అంచనా. దేశ రాజధానిలో జరిగిన కాక్రోచ్‌ల నిరసన ప్రదర్శన రెండు వాస్తవాలను తేటతెల్లం చేస్తోంది. ఒకటి ఇండిగో, నీట్ లాంటి జాతీయ విపత్తులు సంభవించినా బాధ్యులైన మంత్రులపై చర్యలు తీసుకోని ప్రధాని నరేంద్ర మోడీ మొండి స్వభావం. రెండు దేశంలోని కీలకమైన, సమస్యలను ఆధారం చేసుకుని అస్థిరత సృష్టించడానికి విదేశీ శక్తుల ప్రయత్నం. కోట్లాది మంది ప్రజలను క్షోభకు గురిచేసే పరిణామాలపై ప్రధాని నరేంద్ర మోదీ నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం తప్పున్నర. భావప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం, ఇతర దేశ రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం, రాజకీయ నాయకులకు సంబంధించి, ప్రజలకు సంబంధించిన డేటా చోరీలు చేయడం ఎలాన్ మస్క్ అసలు వ్యాపారం. ఈ కారణంగానే ఆయన నడుపుతున్న ఎక్స్‌ఎఐ గ్రోక్ నును అనేక దేశాలు నిషేధించాయి. భారత ప్రభుత్వంతో కూడా మస్క్ ఎక్స్‌కు తీవ్రమైన విభేదాలున్నాయి. సోషల్ ప్రపంచ వ్యాప్తంగా ఎలెన్ మస్క్ హీనమైన, అరాచకమైన చర్యల గురించి కొంచెం మీడియాలతో బాటు అన్ని ఆన్ లైన్ ఛానల్స్‌లో ప్రసారం చేసే సమాచారాన్ని భారత ప్రభుత్వ సంస్థ సహయోగ్ సెన్సార్ చేస్తుంది. చట్ట, ప్రజావ్యతిరేక సమాచారం ఉంటే దీన్ని వెంటనే తొలగించమని సహయోగ్ కోరుతుంది. సోషల్ మీడియాలకు, ఇతర సంస్థలకు నోటీసులు ఇస్తుంది. ఇలా నిబంధనలు విధించడం మస్క్‌కు ఇష్టం లేదు. ఎలాన్ మస్క్ టెస్లా, స్టార్లింక్ వంటి తన ఇతర వ్యాపారాలను భారత దేశంలోకి విస్తరించాలని భావిస్తున్నాడు. భారత రాజ్యాంగాన్ని గౌరవించని ఏ డిజిటల్ ప్లాట్ ఫాంను అనుమతించబోమని భారత్ తెగేసి చెప్పింది. భారత చట్టాలకు లోబడి పని చేస్తామని హామీ ఇచ్చిన తర్వాతనే మెటా, గూగుల్ వంటి ఇతర టెక్ దిగ్గజాలకు అనుమతు లొచ్చాయి. బ్లూటిక్ ప్రీమియం బాడ్జిల పేరుతో యూజర్లను మోసం చేస్తూండటంతో డిజిటల్ సర్వీసెస్ యాక్ట్ (డిఎస్ ఎ) కింద యూరోపియన్ యూనియన్ మస్క్‌కు 1500 కోట్ల రూపాయల జరిమానా విధించింది. వినియోగదారుల అనుమతి తీసుకోకుండా 6కోట్ల మందికి పైగా యూరోపియన్ వినియోగదారుల వ్యక్తిగత పోస్టులను మస్క్ గ్రోక్ చౌర్యం చేసింది. దీనిపై విచారణ జరుగుతోంది. ఎక్స్ అల్గారిథమిక్ మోసాలు, డీప్ ఫేక్లపై ఫ్రాన్స్, భారతదేశం, మలేషియా, టర్కీలలో విచారణ జరుగుతోంది. బాలల పోర్న్ వీడియోలు, ఎఐతో బ్లూ ఫిలింలు చేసి ప్రసారం చేయడం, హింసాత్మకమైన తీవ్రవాద సంస్కృతిని ప్రోత్సహించే వీడియోలు ప్రసారం చేయడంపై కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఎంతో స్నేహితులమని చెప్పుకునే అరబ్ దేశాలు కూడా మస్క్‌ఎక్స్‌ను తమ దేశాల్లో అడుగుపెట్టనీయడం లేదు, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాల్లో ప్రత్యక్షంగానే మస్క్ పాల్గొంటాడనే కారణంగానే అనేక దేశాలు ఎక్స్‌ను బహిష్కరిస్తున్నాయి. ●

## ప్రజావాక్కు



### గృహిణుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

ఇంటిని సక్రమంగా నడిపించడం, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఆహారం, పిల్లల సంరక్షణ, వృద్ధుల అవసరాలు చూసుకోవడం వంటి బాధ్యతలను నిర్వర్తించే గృహిణుల సేవలకు ఇప్పటికీ సరైన గుర్తింపు లభించడం లేదు. వేతనం లేకుండా వారు చేసే గృహకార్యం దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా నిలుస్తున్నప్పటికీ, వారికి సామాజిక భద్రత మాత్రం అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో గృహిణులకు సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం అత్యంత ప్రాధాన్యంగా మారింది. గృహకార్యానికి విలువ ఇవ్వాల్సిన అవసరాన్నిసుప్రీంకోర్టు కూడా ప్రస్తావించడం గమనార్హం. గృహిణులు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని న్యాయస్థానం పేర్కొనడం సమాజ దృష్టికోణంలో పెద్ద మార్పుకు సంకేతం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మోసాలను నియంత్రించలేమా?

ఆధార్ పేరు పెట్టి ప్రభుత్వాలు ప్రజలతో ఆడుకుంటూ ఉన్నారు. డేట్ ఆఫ్ బర్త్ చేంజ్ ఒకసారి, నేమ్ చేంజ్ లేదా స్పెల్లింగ్ కరెక్షన్స్ రెండుసార్లు పరిమితి పెట్టారు. టుయెర్ ఈజ్ హ్యూమన్ అంటారు. మానవ తప్పిదాలు సహజంగా జరుగుతాయి. స్పెల్లింగ్ మిస్టేక్స్ రావడం ప్రింట్ పొరపాట్లు జరగడానికి అవకాశాలుంటాయి. దేశం బోర్డర్లో ఉన్న ప్రజలకు కఠినమైన నిబంధనలు ఉండడం అర్థం ఉంటుందేమో కానీ అందరికీ ఇలా ఇబ్బంది పెట్టడం తగదు. అన్నింటికీ ఆధార్ ఉపయోగిస్తున్నారు. అన్నింటితో ఆధార్‌ని లింక్ చేస్తున్నారు. నిజానికి ఓటు వేయడానికి చేతి వేలి ముద్రలు, కన్నులు ఐరిష్ మ్యాచ్ అయితేదొంగఓట్లు వేయడానికి అసలుఅవకాశం ఉండదు.

- వి. రూపవతి, బొబ్బిలి

### వేతనాలు పెంచాలి

విద్యుత్‌శాఖలో గత రెండు దశాబ్దాలుగా ఎందరో విద్యావంతులు ప్రభుత్వం తమను పర్మినెంట్ చేస్తుందనే ఆశతో మీటర్‌రీడింగ్ పనులు చేస్తూవున్నారు. వారికి ఇప్పటికీ ఎదుగూ బొదుగూ లేకుండా కేవలం నెలకి పది వేల రూపాయలే ఇస్తున్నారట. వారు రోజుకు 8గంటలు పైగా డ్యూటీలు చేస్తున్నారు. సెలవులు కూడాతక్కువ. పదివేల రూపాయలతో లక్ష రూపాయల జీతం పొందే పర్మినెంట్ ఉద్యోగితో సమానంగా ఫుల్ టైం డ్యూటీలు చేస్తున్నారు. పెరిగిపోతున్న ధరలకుపదివేల రూపాయలు సరిపోవు.

- టి. సాంబశివరావు, గుంటూరు

### పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

పెరుగుతున్న వాహనాల సంఖ్య, మితిమీరిన వేగం కారణంగా నేడు రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించడం వల్ల కలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రివేళల్లో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలుఏర్పాటు చేయాలి. గుంతలమయమైన రోడ్లను వెంటనే మరమ్మతు చేయడం ద్వారాచాలా ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినమైన జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి పట్ల ఎటువంటి మినహాయింపు ఉండకూడదు.

- కె. నారాయణస్వామి, హైదరాబాద్

### రైతుల కష్టాలు తీరేదెలా?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు రైతులు పండించిన మొక్కజొన్న, వరి వంటిపంటలు కలలాల్లో కొనుగోలు చేయక తడిసిపోతుంటే మరోపక్క ప్రగతిపేరిట 99 రోజుల సంబరాలు చేస్తుంది. రైతులు తాము పండిచ పంటను కలలాల్లో పెట్టుకొని రోజులు తరబడి ఎదురు చూస్తున్న అధికారులు రావడం లేదంటూ కొనుగోలు చేయక రైతులు ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరోవైపు ఈదురు గాలుల వల్ల మామిడి రైతులు నష్టపోతున్నారు. వారికి భరోసా కల్పించి ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పవచ్చు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది.

- ఎం. సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### సమాన పనికి సమాన వేతనం

భారతదేశంలో ఆర్థిక, సాంకేతిక రంగాలు వృద్ధి చెందుతున్నప్పటికీ లింగ వివక్ష రూపం మార్చుకుని కొనసాగుతోంది. క్షేత్రస్థాయి పరిశీలనలు భిన్నమైన వాస్తవాలను చూపుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు, చదువు ఆపివేయడం వంటి సమస్యలున్నాయి. వ్యవసాయ రంగంలో సమానంగా శ్రమిస్తున్న

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# రూ.75వేల సహకార రుణాలు మాఫీ

### తమిళ సిఎం విజయ్ సంచలన నిర్ణయం

### పంటరుణాలు తీసుకొన్న రైతులకు భారీ ఊరట



**చెన్నై,జూన్ 16:** తమిళనాడు రైతాంగానికి ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న అన్నదాతలకు పెద్ద ఎత్తున ఊరటనిస్తూ రుణమాఫీ పథకంలో సవరణలు చేస్తూ మంగళవారం ప్రకటించింది. గతంలో ప్రకటించిన నిబంధనలపై రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, నిరసనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం అందరికీ ప్రయోజనం చేకూరేలా ఈ పథకం పరిధిని మరింతగా విస్తరించింది. తాజా మార్పుల ప్రకారం సహకార బ్యాంకుల నుంచి రూ. 75,000 వరకు పంట రుణాలు తీసుకున్న సన్న, చిన్న, పెద్ద రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ వర్తింపజేయనున్నారు. రూ. 75,000 కంటే ఎక్కువ మొత్తంలో రుణాలు కలిగి ఉన్న రైతులకు సైతం ప్రభుత్వం అండగా నిలిచింది. అలాంటి రైతులకు ఒక్కొక్కరికి రూ. 35,000 చొప్పున రుణ విముక్తి కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. నిజానికి గత నెలలోనే విజయ్ ప్రభుత్వం రుణమాఫీపై ప్రాథమిక ప్రకటన చేసింది. ఆ నిబంధనల ప్రకారం సన్నకారు రైతులకు రూ. 50 వేల వరకు పూర్తి మాఫీ, చిన్న రైతులకు రూ. 50 వేల లోపు రుణాలపై 50 శాతం మాత్రమే మాఫీ ఇవ్వాలని భావించారు. అలాగే రూ. లక్ష వరకు రుణాలున్న పెద్ద రైతులకు కేవలం రూ.5వేల వరకు మాత్రమే రాయితీ ఇస్తామన్నారు. అయితే ఈ అరకొర మాఫీపై రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసనలకు దిగింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ముఖ్యమంత్రి విజయ్ సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రైతుల డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం పాత నిబంధనలను పక్కనబెట్టి మరింత ఉదారంగా కొత్త మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ తాజా సవరణల నిర్ణయం వల్ల తమిళనాడు వ్యాప్తంగా దాదాపు 14.43 లక్షల మంది రైతు కుటుంబాలకు అపారమైన ఆర్థిక లబ్ధి చేకూరనుంది. కాగా ఈ నిర్ణయంతో రాష్ట్రప్రభుత్వ ఖజానాపై రూ. 5,932కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడనుంది. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను క్షుణ్ణంగా అంచనా వేసిన తర్వాతే రైతుల సంక్షేమాన్ని కాంక్షించి ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు ఎక్కడా విఘాతం కలగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. రుణమాఫీకి సంబంధించి సహకార బ్యాంకులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పూర్తి మొత్తాన్ని రాబోయే 45 నుంచి 60 రోజుల్లోగా పూర్తిగా చెల్లిస్తామని అధికారికంగా ప్రకటించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై తమిళనాడు రైతు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### విడాకుల కేసు ఆగస్టు 7కు వాయిదా



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఆయన భార్య సంగీత స్వర్ణలింగంల విడాకుల వ్యవహారంలో న్యాయస్థానంలో మరోసారి ప్రతిష్టంభన ఎదురైంది. వీరిద్దరి వివాహ రద్దు పిటిషన్‌పై సోమవారం చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం లో జరగాల్సిన విచారణ మళ్లీ వాయిదా పడింది. ఈ విచారణకు అటు ముఖ్యమంత్రి విజయ్ కానీ, ఇటు సంగీత కానీ వ్యక్తిగతంగా హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నాటి కోర్టు విచారణకు విజయ్, సంగీత ఇద్దరూ రాలేదు. వారి తరఫు న్యాయవాదులు మాత్రమే కోర్టుకు హాజరై ప్రస్తుత పరిస్థితులను న్యాయమూర్తికి వివరించారు. ఇరుపక్షాల ముఖ్య వ్యక్తులు అందుబాటులో లేకపోవడంతో విచారణ ప్రక్రియ ఆశించిన విధంగా ముందుకు సాగలేదు. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయమూర్తి కేసు తదుపరి విచారణను ఆగస్టు నెలకు పొడిగించారు. ఈ కేసులో ఇలాంటి ఆలస్యం జరగడం ఇదే మొదటిసారి కాదు. గత కొన్ని నెలలుగా ఈ విడాకుల పిటిషన్ వరుస వాయిదాలతో నలుగుతోంది. అంతకుముందు జరిగిన పలు విచారణల సందర్భాల్లోనూ విజయ్, సంగీత కోర్టుకు రాలేదు. ప్రతిసారీ వారి లీగల్ రిప్రజెంటేటివ్స్ మాత్రమే హాజరవుతూ వస్తున్నారు. అంతకుముందు ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం కేసును జూన్ 15వ తేదీ అంటే సోమవారం రోజుకు వాయిదా వేసింది. అయితే ఈసారి కూడా వారిద్దరూ రాకపోవడంతో కేసు మరింత కాలం ముందుకు పడేలా చేసింది.




## హర్ముజ్‌ను దాటిన ఐదు నౌకలు

### జలసంధిపై పట్టు సడలించిన అమెరికా

### అంతర్జాతీయ జలాల్లోకి రాకపోకలు

**వాషింగ్టన్, జూన్ 16:** అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం అధికారికంగా ఖరారు కానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇంతకాలం హర్ముజ్ జలసంధిని దిగ్బంధించిన అమెరికా పట్టు సడలించింది. దాంతో కనీసం ఐదు ఇరాన్ నౌకలు ఆ జలసంధిని దాటి, అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తర్వాత ఆ ప్రభావం హర్ముజ్ జలసంధిలో రాకపోకలపై పడింది. అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలను ఇరాన్ అడ్డుకోగా ఇరాన్ పోర్టుల నుంచి రాకపోకలు సాగించే నౌకలను అడ్డగిస్తూ అమెరికా దిగ్బంధనం ప్రకటించింది. అటు ఇరాన్, ఇటు అమెరికా హర్ముజ్‌ను దిగ్బంధించడంతో ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయాయి. ఇప్పుడు శాంతి ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, ఇరాన్ బృందానికి నాయకత్వం వహించిన ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ ఘాలిబఫ్ సంతకాలు చేశారు. డిజిటల్ రూపంలో ఈ సంతకాలు జరగ్గా, శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అధికారిక కార్యక్రమం ఉంటుంది. ఈ వరుస పరిణామాలు వేళ ఇరాన్ నౌకలు హర్ముజ్‌ను దాటాయి. శాంతి ఒప్పందంపై ప్రకటన చేసినప్పుడే హర్ముజ్ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తున్నట్లు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడది వాస్తవ రూపం దాల్చినట్లు కనిపిస్తోంది.

**రెండు దశలుగా అమెరికా-ఇరాన్ చర్చలు..**

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు రెండు దశల్లో జరుగుతాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. తొలి దశలో ప్రధాంశం హర్ముజ్ జలసంధి అని వెల్లడించారు. దాంతో పాటు అమెరికా దిగ్బంధనం, ఇరాన్ పునర్నిర్మాణం గురించి చర్చలు ఉంటాయని చెప్పారు. అణు సంబంధిత అంశాలు, ఆంక్షల నుంచి ఉపశమనం వంటివి రెండో దఫాలో చర్చిస్తామని పేర్కొన్నారు. అయితే, లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలే ఈ ఒప్పంద చర్చలు ఎటు వెళ్లాలో నిర్ణయిస్తాయని, ఈ విషయం ట్రంప్ యంత్రాంగానికి బాగా తెలుసునని అన్నారు. ఇజ్రాయెల్‌ను కట్టడి చేయాల్సిన బాధ్యత అమెరికాపైనే ఉందని, అది ట్రంప్‌నకు పెద్ద సవాల్‌గా మారబోతోందని వ్యాఖ్యలు చేశారు.

## శాంతి చర్చల్లో ఇద్దరు ఇరాన్ సైకాలజిస్టులు!



**ఇరాన్, జూన్ 16:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని ఎదుర్కోవడానికి ఇరాన్ ఒక అసాధారణమైన మార్గాన్ని అనుసరించినట్లు సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ మానసిక స్థితిని అంచనా వేయ డానికి, ఆయన ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టుల సహాయం తీసుకున్నట్లు ఒక కథనం వెల్లడించింది. ట్రంప్ ఎప్పటికప్పుడు మారే స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, చర్చల ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ ట్రంప్ ప్రవర్తనలో మానసిక రుగ్మత ధోరణులు ఉన్నాయని మేము భావించాము. అందుకే చర్చలకు సంబంధించిన సలహాదారుల బృందంలో ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను చేర్చాము. వారి సహాయంతో ట్రంప్‌నకు పంపే సందేశాలను జాగ్రత్తగా రూపొందించాము అని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఈ మానసిక నిపుణుల సలహాలు తీసుకోవడం ప్రారంభించినట్లు సమాచారం. ఈ వ్యూహం ఫలించిందని, తమ సలహాదారుల సిఫార్సులను పాటించడం మొదలుపెట్టినప్పటి నుంచి ట్రంప్ స్పందనలో స్పష్టమైన మెరుగుదల కనిపించిందని ఆ అధికారి వివరించారు. భవిష్యత్తులో ఈ చర్చల వివరాలు బయటకు వస్తే, తమ పద్ధతులు ఎంత పకడ్బందీగా ఉన్నాయో స్పష్టమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ ఏడాది మొదట్లో ఇప్సోస్ నిర్వహించిన ఒక సర్వేలో 10 మంది అమెరికన్లలో 6 మంది ట్రంప్ వయసు పెరిగేకొద్దీ ఆయన ప్రవర్తన అస్థిరంగా మారిందని అభిప్రాయపడ్డారు. వీరిలో 89 డెమోక్రాట్లు, 30 రిపబ్లికన్లు ఉండటం గమనార్హం.

## పార్టీని వీడే వారు నిశ్చింతగా వెళ్లిపోవచ్చు

### శివసేన చీఫ్ ఉద్ధవ్‌థాకరే

**ముంబయి,జూన్ 16:** పార్టీని వీడాలనుకునే వారిని తాను బలవంతం చేయబోనని శివసేన అధినేత ఉద్ధవ్‌థాకరే స్పష్టం చేశారు. శివసేనను వీడాలనుకునే వారు నిశ్చింతగా వెళ్లిపోవచ్చన్న స్పష్టం చేశారు. పార్టీలో ఉండమని ఎవరిపైనా ఒత్తిడి చేయొద్దని నిర్ణయించు కున్నానని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన చీలిక గురించి ప్రస్తావిస్తూ బాలాసాహెబ్ థాకరే స్థాపించిన పార్టీని వీడిన వారు తమ నిర్ణయం పట్ల చివరికి పశ్చాత్తాపపడతారని థాకరే అన్నారు. ఈ రోజు నాది కాకపోవచ్చు, కానీ రేపు కచ్చితంగా నాదే. అప్పటి వరకు మనం ఇలాంటివి భరించాల్సి ఉంటుందని థాకరే అన్నారు. మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన శివసేన ఎంపీలు షిండే వర్గంలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఏడుగురు ఎంపీలు షిండేతో సంప్రదింపులు జరుపుతున్నారని, వచ్చే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోపు వారంతా షిండే వర్గంలో చేరే అవకాశం ఉందని శివసేనకు చెందిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే క్రిపాలు మానె వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొంత మంది పార్టీ ఎంపీల విధేయతపై వస్తున్న ఊహాగానాలపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరే మౌనం వీడారు.

## అది ట్రంప్ తీసుకొన్న నిర్ణయం

### మా ప్రయోజనాలు వేరు..

### శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



**జెరుసలేం, జూన్ 16:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు కొన్నిసార్లు విభేదాలు వస్తుంటాయని అంగీకరించారు. ఓ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందానికి సంబంధించి ఎదురైన ప్రశ్నకు నెతన్యాహు బదులిస్తూ.. 'నాకు, ట్రంప్‌నకు మధ్య కొన్నిసార్లు విభేదాలు వస్తుంటాయి. అమెరికాతో సంబంధాల విషయంలో ఇజ్రాయెల్ తన సొంత ప్రయోజనాలకు కట్టుబడి ఉంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని ట్రంప్ కుదుర్చుకున్నారు. అది ఆయన నిర్ణయం. మాకు మా సొంత ప్రయోజనాలు ఉన్నాయి' అని వ్యాఖ్యానించరు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చూడటమే తన లక్ష్యమన్నారు. తాను అధికారంలో ఉన్నంత కాలం అది జరుగుతుందన్నారు. శాంతి ఒప్పందం ఉన్నా.. లేకున్నా ఇరాన్ వద్ద అణ్వాయుధాలు మాత్రం ఉండవని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సైనిక ఘర్షణల్లో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పతనమైందని నెతన్యాహు పేర్కొన్నారు. దాని సైనికులకు, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ నష్టం విలువ వందల బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఘర్షణ ఇంకా ముగియలేదంటూ నెతన్యాహు హెచ్చరికలు చేశారు. ఇరాన్ దాని మిత్ర దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొంటూనే ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ రక్షణ వ్యయానికి అదనంగా 350 బిలియన్ షెకెళ్లను (ఇజ్రాయెల్ కరెన్సీ) కేటాయిస్తున్నట్లు నెతన్యాహు ప్రకటించారు.

## రెండుకోట్ల బీమా కోసం భర్తను చంపిన భార్య



**బెళగావి,జూన్ 16:** కర్ణాటకలోని బెళగావి జిల్లాలో జరిగిన ఒక మాజీ సైనికుడి మృతి కేసు సంచలనం సృష్టిస్తోంది. సాధారణ బైక్ ప్రమాదంగా భావించిన ఈ ఘటన రూ.2 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బుకోసం భార్య, ఆమె ప్రియుడు కలిసి పన్నిన దారుణ హత్యగా పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో మృతుడి భార్య, ఆమె ప్రియుడితో పాటు వైద్యులు, ఫోరెన్సిక్ సిబ్బంది సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మాజీ సైనికుడు సందీప్ మంజర్గి మార్చి 13న బైక్‌పై నుంచి జారిపడి స్వల్పంగా గాయపడ్డారు. దీంతో అతని భార్య సుమ మంజర్గి, మొదట హుక్కేరి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఘటప్రభలోని జేజీ ఆసుపత్రికి మార్చింది. మార్చి 15న సందీప్ గుండెపోటుతో మరణించి నట్లు వైద్యులు ప్రకటించారు. పోస్టుమార్టం నిమి త్తం మృతదేహాన్ని బీఐఎంఎస్ ఆసుపత్రికి తర లించగా, ప్రాథమిక ఫోరెన్సిక్ నివేదికలో కూడా ఎలాంటి విష ప్రయోగం జరగలేదని, గుండె పోటు వల్లే మరణం సంభవించిందని పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్రగాయాలు కాకపోవడం ఆరోగ్యంగా ఉన్న సందీప్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంపై పోలీసులకు అనుమానం కలిగింది. ఈ క్రమంలో సుమ ప్రియుడుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పుండలీక్ దొంబార్ పెట్టిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ కేసును కీలక మలుపు తిప్పింది. ప్రమాదానికి గురైన వ్యక్తి అకస్మాత్తుగా ఎలా చనిపోయాడు. అంటూ తనకు అంతా తెలిసినట్లుగా అతను పోస్ట్ పెట్టాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు కుట్ర మొత్తం బయట పడింది. పోలీసుల కథనం ప్రకారం సందీప్, పుండలీక్ గతంలో కలిసి హోటల్ వ్యాపారం చేశారు. ఈ క్రమంలోనే సందీప్ భార్య సుమతో పుండలీక్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదే సమయంలో సందీప్ పేరు మీద మూడు వేర్వేరు కంపెనీల నుంచి సుమారు రూ.2కోట్ల విలువైన ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నారు. ఆ డబ్బును కాజేయాలనే దురుద్దేశంతోనే ఈ హత్యకు పథకం పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సుమ, పుండలీక్ కలిసి సెలైన్ బాటిల్ ద్వారా విషాన్ని, నిద్రమాత్రలను ఇచ్చి సందీప్‌ను హత్య చేశారు. అనంతరం ఈ హత్యను గుండెపోటుగా చిత్రీకరించేందుకు వైద్య, ఫోరెన్సిక్ సిబ్బందికి రూ.3లక్షలకు పైగా లంచం ఇచ్చి నివేదికలను తారుమారు చేయించారు. నిందితుల నుంచి విషం సీసాలు, సిరంజిలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సందీప్ భార్య సుమ, ప్రియుడు పుండలీక్‌తో పాటు డాక్టర్ బసవరాజ్, ఎఫ్‌డీఏ అధికారి అశోక్, ఎఫ్ఎస్ఎల్ క్లర్క్ అప్పాసాహెబ్ సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేశారు.

## సంక్షిప్త వార్తలు

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే: ఖర్గే



**న్యూఢిల్లీ, జూన్ 16:** నీట్ పేపర్ల లీకేజీ, సిబిఎస్ఇ పరీక్షల అక్రమాలు జరిగినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. సదరు మంత్రిని రాజీనామా చేయమని కోరకపోవడం ద్వారా మోడీ సర్కార్ జవాబుదారీతనం అనే పరీక్షలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ మేరకు ఖర్గే మంగళవారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఎన్‌డియే సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. జూన్ 21న జరగనున్న నీట్ యూజీ 2026 రీఎగ్జామ్‌కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్ పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని కూడా ఖర్గే తప్పుపట్టారు. పరీక్షల్లో జరిగిన అక్రమాల వల్ల దాదాపు అరడజను మంది యువకులు ప్రాణాలు తీసుకున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు.

### భవానీపూర్ ఫలితాలపై హైకోర్టులో మమత పిటిషన్

**కోల్‌కతా, జూన్ 16:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో బిజెపి నేత సువేందు అధికారి చేతిలో ఓటమి పాలైన మమతా బెనర్జీ, ఆ ఫలితాలను సవాల్ చేస్తూ కోల్‌కత్తా హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపిస్తున్నారు. దీనిపై న్యాయవిచారణ జరపాలని, సంబంధిత ఎన్నికల రికార్డులను భద్రపరచాలని కోరుతూ మమతా బెనర్జీ మంగళవారం హైకోర్టులో స్వయంగా పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేరుగా కోల్‌కతా హైకోర్టుకు హాజరవడం ఇది రెండోసారి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భవానిపూర్ నియోజకవర్గం నుంచి సువేందు అధికారి మమతా బెనర్జీపై 15,105 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఫలితంపై మమత అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

### చర్చించాకే టిఎంసి రెబెల్ ఎంపిల విలీనంపై నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్ 16:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వర్గీయులతో చర్చించాకే ఆ పార్టీ రెబల్ ఎంపిలు విలీనంపై లోక్‌సభ స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. టిఎంసి రెబల్ ఎంపిలు తాము ఎన్‌సిపిఐలో విలీనమయ్యామంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఇటీవల లేఖ అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపిల స్థితిగతులను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పరిశీలిస్తున్నారని, రెండు వర్గాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ కార్యాలయం మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి ఎంపిల బృందానికి అధికారిక సమావేశం కోసం ఆహ్వానిస్తూ ఇ-మెయిల్ పంపిందని స్పష్టం చేశాయి. తిరుగుబాటు వర్గం కోరిన విలీన అభ్యర్థనపై, పార్టీ అధికారిక నాయకత్వంతో చర్చించిన తర్వాతే స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వెల్లడించాయి.

### ఎయిరిండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్



**న్యూఢిల్లీ, జూన్ 16:** కన్నూర్‌నుంచి జెడ్డా బయలుదేరిన ఎయిరిండియా విమానంలో సాంకేతికలోపం తలెత్తింది. టేకాఫ్ అయిన కాసేపటికే ఇంజిన్‌లో సమస్య ఉన్నట్లు వార్నింగ్ లైట్స్ వెలగడంతో పైలట్లు వెంటనే అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త గా గాల్లోనే రెండుగంటల పాటు చక్కర్లు కొట్టించి ఇంధనాన్ని పూర్తిగా ఖర్చు చేశారు. తర్వాత కన్నూర్ ఎయిర్ పోర్టులోనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు.దీంతో అందులోని 180 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఇంజిన్ ఫ్యూయల్ ఫిల్టర్‌లో లోపమే దీనికి కారణమని అధికారులు గుర్తించారు.

### జస్పాల్ రాణా తల్లి కన్నుమూత



**న్యూఢిల్లీ, జూన్ 16:** దివంగత భారత షూటింగ్ దిగ్గజం, కోచ్ జస్పాల్ రాణా తల్లి శ్యామా దేవి రాణా కన్నుమూశారు. జస్పాల్ రాణా మరణించిన నాలుగు రోజులకే ఆయన తల్లి కూడా మరణిం చటంతో వారి కుటుంబంలో విషాదఛా యలు ఆలుముకున్నాయి. కుమారుడి ఆకస్మిక మరణాన్ని శ్యామా దేవి తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైనట్టు వారి కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచారు.

## చైనా, జపాన్, ఇండోనేసియాల్లో భూకంపం

### డ్రాగన్ కంట్రీలో ఒకరి మృతి, నలుగురికి గాయాలు

**న్యూఢిల్లీ/బీజింగ్, జూన్ 16:** చైనా, జపాన్, ఇండోనేషియాలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం భూకంపాలు సంభవించాయి. అత్యధికంగా 6.7 తీవ్రతతో ఇండోనేషియాలోని సులవేసి ద్వీపంలో భూకంపం సంభవించగా, ఆ తర్వాత చైనాలోని క్వింగ్‌హైలోని హైక్సీ ప్రిఫెక్చర్‌లో 6.3 తీవ్రతతో, జపాన్‌లోని హోన్షు తూర్పు తీరానికి సమీపంలో 6 తీవ్రతతో ప్రకంపనలు సంభవించాయి. చైనాలో భూకంపం కారణంగా ఒక వ్యక్తి మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. ఇండోనేషియాలో ఎనిమిది మంది



గాయపడ్డారు. జపాన్‌లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానిక మీడియా కథనం ప్రకారం, ఇండోనేషియాలోని పాలుకు తూర్పు ఆగ్నేయంగా స్థానిక కాలమాన ప్రకారం ఉదయం 10:27 గంటలకు ప్రకంపనలు సంభవించినట్లు మొదట నివేదికలు వెలువడ్డాయి. దాదాపు 4 లక్షల జనాభా ఉన్న పాలు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లోకి ఈ ప్రకంపనలు ప్రజలను పరుగులు పెట్టించాయి. పైకప్పులు కూలిపోవడం, గోడలు బద్దలవడం, శిథిలాలు వీధులపై చెల్లాచెదురుగా పడటంతో భారీ నష్టం వాటిల్లింది. నష్టం, నిరాశ్రయులైన ప్రజల గురించిన సమాచారం ఇంకా సేకరిస్తున్నట్లు ఇండోనేషియాలోని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. భూకంప కేంద్రం 43 కిలోమీటర్ల ఎత్తులో, సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత అనేక ప్రకంపనలు సంభవించాయి, వాటిలో అత్యంత బలమైనది 5.2 తీవ్రతతో నమోదైంది. ఇండోనేషియాలో మాదిరిగానే, క్వింగ్‌హైలో కూడా 4.9 తీవ్రతతో సహా అనేక ప్రకంపనలు సంభవించాయి.

### రెండు ట్రక్కులు ఢీ

## ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనం



**భువనేశ్వర్, జూన్ 16:** ఒడిశాలో దారుణం జరిగింది. రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో వాటిలోని ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా, భస్మా పోలీస్ స్టేషన్ పరిధిలో కైంత్రా వద్ద, పదో నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైవేపై ఝూర్సుగూడ నుంచి సుందర్‌గఢ్ వెళ్తున్న ట్రక్కు అతివేగం కారణంగా అదుపు తప్పింది. వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో డివైడర్‌ను దాటిన ట్రక్కు ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు మీదికి వెళ్లిపోయింది. దీంతో అటువైపు నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఇలా రెండు ట్రక్కులు ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. అవి పెద్ద ఎత్తున వ్యాపించి, పూర్తిగా అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు ట్రక్కుల్లోని డ్రైవర్లు మంటల్లో సజీవదహనమయ్యారు. మంటల తీవ్రత కారణంగా డ్రైవర్ల మృతదేహాలు తీవ్రంగా కాలిపోయాయి. ఇంకా డ్రైవర్లను గుర్తించాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## రాహుల్ గాంధీ వెన్నుపోటుదారుడు: డిఎంకె ఫైర్

**చెన్నై, జూన్ 16:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై డిఎంకె ఐటీ సెల్ తీవ్ర విమర్శలు గుప్పించింది. తమిళనాడులో కాంగ్రెస్, డిఎంకె కూటమి విడిపోవడంతో విమర్శలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకుడిని 'ఎ బిగ్ జోక్' అని అభివర్ణించింది. కాంగ్రెస్ అవసరాల కోసం తమను వాడుకుని, ఆ తర్వాత కొత్త పొత్తుల కోసం వెళ్లిపోయారని విమర్శించింది. కాంగ్రెస్ రాజకీయ మనుగడ కోసం పోరాడుతున్నప్పుడు తాము వారిని



భుజాలపై మోసాము, కానీ కొత్త మెరిసే బొమ్మను చూడగానే వారు పడవ నుండి దూకేశారని మండిపడ్డారు. ఇదే సమయంలో డిఎంకె పత్రిక 'మురసోలి'లో తన సంపాదకీయంలో ఇండియా కూటమి సమావేశం తర్వాత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. ప్రతిపక్ష పార్టీల మధ్య చీలికలకు కాంగ్రెస్ నాయకుడే కారణమని ఆరోపించింది. అయితే ఇండియా కూటమిలోని ఇతర ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన అంశాలకు తాము మద్దతు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ ప్రతిపక్షాల ఐక్యత గురించి బోధిస్తూనే, దానిని బలహీనపరుస్తున్నారని మండిపడింది. ప్రభుత్వాలు ఏర్పాటు చేసే తమ అవకాశాలను దెబ్బతీస్తోందని కూటమి భాగస్వాములే ఆరోపించినప్పుడు, కాంగ్రెస్ ఇప్పుడు ప్రతిపక్షాల ఐక్యత గురించి ఎలా మాట్లాడగలదని ప్రశ్నించింది. ఇండియా కూటమి సమావేశంలో వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ సహా పలు ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలు కాంగ్రెస్‌ను విమర్శించాయని పేర్కొంది. రాహుల్ గాంధీ రాజకీయ వైఖరి ప్రతిపక్ష కూటమిలో పదేపదే ఘర్షణలకు దారితీసిందని వాదించింది.

## డాక్టర్ చీటీ ఉంటేనే దగ్గు సిరప్

### కేంద్రం కఠిన ఆదేశాలు




**న్యూఢిల్లీ, జూన్ 16:** దగ్గు మందు విక్రయాల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని కేంద్రం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో కాఫ్‌సిరప్ విక్రయాలకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను తప్పనిసరి చేస్తూ డ్రగ్స్ రూల్స్ 1945 కింద నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో కాఫ్ సిరప్‌లు షెడ్యూల్ కే డ్రగ్స్ జాబితాలోని క్లాస్ ఆఫ్ డ్రగ్స్ సెక్షన్‌లో 7వ ఎంట్రీగా ఉండేవి. దీంతో, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా మెడికల్ షాపులు వినియోగదారులకు కాఫ్‌సిరప్‌లను విక్రయించే అవకాశం ఉండేది. ఈ షెడ్యూల్‌కు కేంద్రం తాజాగా మార్పులు చేసింది. కాఫ్ సిరప్‌లను షెడ్యూల్‌రేలోని మినహాయింపు జాబితా నుంచి తొలగిస్తున్నట్టు తెలిపింది. ఈ కొత్త రూల్‌కు సంబంధించిన ముసాయిదా నిబంధనలను కేంద్రం గతేడాది డిసెంబర్‌లోనే విడుదల చేసింది. ప్రజల అభిప్రాయాన్ని సేకరించింది. అనంతరం, తుది మార్గదర్శకాలను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ తాజాగా జారీ చేశారు. ఈ నేపథ్యం లో దేశవ్యాప్తంగా మెడికల్ షాపులన్నీ ఇకపై మెడికల్ ప్రిస్క్రిప్షన్ ఉన్న వారికే సిరప్‌లను విక్రయించాల్సి ఉంటుంది. తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి సుమారు 20 మంది చిన్నారులు మృతి చెందారు. అయితే ఆ ఘటన పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ తయారీకి చెందిన దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో తన హెచ్చరికల్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

## అయోధ్య రాముడికి ఖరీదైన ప్రసాదం

**ప్రయాగ్‌రాజ్, జూన్ 16:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మామిడి పండును అయోధ్య బాల రాముడికి నైవేద్యంగా పెట్టారు. జపాన్‌కు చెందిన మియాజాకీ అనే ప్రత్యేకమైన మామిడిపళ్లు కిలో రూ.2.5 నుంచి రూ.3 లక్షల వరకు ఉంటాయి. ఒక్కో పండు ధర దాదాపు రూ.లక్షకు పైగానే ఉంటుంది. ఓం ప్రకాశ్ సింగ్ అనే రైతు వీటిని పండించగా.. అతడి నుంచి కొనుగోలు చేసిన సీజన్‌లోని మొట్టమొదటిగా పండిన పండును స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా తులసి ఆకుల్లో పెట్టి బాలరాముడికి నైవేద్యంగా సమర్పించారు.

# అమెరికా విమాన ప్రమాదంలో కోసిగి యువకుడు మృతి

- ప్యారాచ్యూట్‌తో విన్యాసం.. విమానంలో సాంకేతిక లోపం
- పైలట్‌తో సహా 12 మృతి... అందులో కోసిగి వాసి



**కోసిగి, జూన్ 16 ప్రభాతవార్త:** అమెరికాలోని మిస్సోరిలో జరిగిన విమాన ప్రమాదంలో కర్నూలు జిల్లా కోసిగి మండలం తుమ్మిగనూరు గ్రామానికి చెందిన సాయి కార్తీక్ వర్మ(28) అనే యువకుడు మృతి చెందాడు. కోసిగి మండలం తుమ్మిగనూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రాజు కుమారుడు గత 10 సంవత్సరాల నుండి అమెరికాలోని మిస్సోరిలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా తన క్లాస్‌మెట్‌తో కలిసి విమానంలో నుండి కిందికి ప్యారాచ్యూట్ ద్వారా దిగే విన్యాసాలు చేసేవారు. ఇలాగే గతంలో కూడా పలు మార్లు ఈ విన్యాసాలు చేసినట్లు తెలిపారు. మరోసారి ఈ విన్యాసాలు చేయాలని సంకల్పించి ఆదివారం వారికి సెలవు కావడంతో తన స్నేహితులతో కలిసి విమానంలో విహారం చేసేవారని వారి తల్లిదండ్రులు తెలిపారు. కాగా తన కుమారుడితో పాటు అమెరికా దేశానికి చెందిన వారు కూడా ఈ విన్యాసం చేస్తుండడంతో వారి తల్లిదండ్రులు ఈ విన్యాసాన్ని చూసేందుకు వెళ్లారు. కాగా విమానం 300 మీటర్ల ఎత్తుకు వెళ్లింది. వెంటనే విమానంలో సాంకేతిక లోపం రావడంతో ఆ యువకుల తల్లిదండ్రుల ఎదుటే ఆ విమానం కుప్పకూలిపోయినట్లు చెప్పారు. దీంతో తమ కళ్లెదుటే ఈ సంఘటన జరగడంతో వారు పడిన వేదన వర్ణింపరానిదని అక్కడి వారు తెలిపినట్లు కోసిగి యువకుడి తండ్రి తెలిపారు. కాగా తుమ్మిగనూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రాజు, దాట్ల పద్మావతిలకు ఒకే కుమారుడు వందల కొద్ది పొలాలు ఉన్నాయి. అబ్బాయిని బాగా అమెరికాలోనే చదివించారు. ఎంతో కష్టపడ్డారు. తుమ్మిగనూరు నుండి రాజానగర్‌కు మకాం మార్చారు. అక్కడే డైరీఫాం ఏర్పాటు చేసుకుని అప్పుడప్పుడు తుమ్మిగనూరుకు వచ్చి తమ పొలాలను చూసుకునేవాడు. అయితే తన కుమారుడు సాయి కార్తీక వర్మ స్థిర పడితే ఇక్కడి ఆస్తులన్ని విక్రయించి తాము కూడా అమెరికాకు వెళ్లి తన కుమారుడితోనే ఉండాలని ప్రణాళికను సిద్ధం చేసుకునా న్నారు. అంతలోనే ఇలా విమానం రూపంలో మృత్యువు తన కుమారుడిని కబలించిందని తల్లిదండ్రులు వాపోయారు. తుమ్మిగనూరు రాజుగా పిలువబడే సుబ్రమణ్యం రాజు గతంలో నుండే తెలుగుదేశం పార్టీలో కొనసాగేవాడు. తన కుమారుడి దుర్ఘటన జరిగిన విషయాన్ని తెలుసుకున్న పలువురు టిడిపి నాయకులు ఆయనకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు.

### రైల్వే సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్


# కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడి


తురకపల్లి రైల్వేస్టేషన్ (ఫైల్‌ఫోటో)

**గుత్తి, జూన్ 16 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా గుత్తి రైల్వే జిఆర్‌పి పరిధిలో గుత్తి – కల్లూరు రైల్వేస్టేషన్ల నడుమ తురకపల్లి రైల్వే హాల్టింగ్ స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని అగంతకులు తమ సాంకేతిక నైపుణ్యంతో రైల్వే సిగ్నల్ సిస్టంను ట్యాంపరింగ్ చేసి రైలు ఆగేలా చేసి దోపిడికి పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మైసూర్ నుండి కాచిగూడ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు (12786)ను ఆధునిక పరిజ్ఞానంతో తురకపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఆగేలా చేశారు. అనంతరం ముసుగు ధరించిన వ్యక్తులు ఎస్-2, ఎస్-4, ఎస్-6, ఎస్-7 నెంబర్ల కంపార్ట్‌మెంట్లలో యధేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. రైలులో ప్రయాణిస్తున్న రేణుక అనే మహిళా ప్రయాణికురాలి వద్ద 37 గ్రాముల విలువైన బంగారు ఆభరణం, అనంతపురంకు చెందిన యశోదమ్మ వద్ద 4.2 గ్రాముల విలువైన నల్లపూసల దండ, మైసూర్‌కు చెందిన వైష్ణవి వద్ద ఐఫోన్-15, మైసూర్ నుండి మహబూబ్‌నగర్ వెళుతున్న సుచిత్ర వద్ద ఐదు తులాల బంగారం ఆభరణాన్ని అపహరించారు. అంబికా అనే ప్రయాణికురాలి వద్ద చోరీకి విఫలయత్నం చేశారు. గతంలోనూ ఈ ప్రాంతంలో దోపిడీలు జరిగాయి. ఈ సంఘటనపై ఐఆర్‌పి సిఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గుత్తి రైల్వే జిఆర్‌పి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆక్వా ఫీడ్ ధరలను తగ్గించండి

- వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ • జులై 1 లేదా 2న రైతులతో కలిసి ఆందోళన


ఆక్వా రైతులతో మాజీ సిఎం జగన్

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** దారుణంగా పెరిగిన ఆక్వా ఫీడ్ ధరలను ఈనెలాఖరులోగా తగ్గించాలని, లేని పక్షంలో వచ్చే నెల 1 లేదా 2వ తేదీన రైతులతో కలిసి ఆందోళన చేస్తామని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సిపి అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. 2019–24 మధ్య ఆక్వా రంగానికి తమ ప్రభుత్వం పూర్తి అండగా నిల్చిందన్నారు. ఆక్వా రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితుల మధ్య వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆక్వా రైతులతో పాటు, ఎపి ప్రాన్ ఫెడరేషన్ ప్రతినిధులు వైయస్సార్‌సిపి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు వివరించారు. వారి సమస్యలు సావధానంగా విన్న వైయస్ జగన్, ఆక్వా రైతులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని, 57 నెలల్లో ఆ మేరకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.3,306 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. 2014–19 మధ్య అదే యూనిట్ విద్యుత్‌కు రూ.3.85వసూలు చేసిన నాటి సీఎం చంద్రబాబు, 2019లో ఎన్నికలకు 6 నెలల ముందు ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.2కే అంటూ జీఓ జారీ చేసినా అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా జోన్ లోపల రైతులకు సబ్సిడీ కత్తిరింపులపై బెదిరిస్తున్నారని, ఆ దిశలోనే వారం క్రితం జీఓ ఆర్‌టీ:169 జారీ చేశారని, అందులో క్లాజ్ నెం:4లో పవర్ ఫ్యాక్టర్ (పీఎఫ్) నిర్వహణపై రూల్ పెట్టారని చెప్పారు. అది ఆక్వా రైతులు వాడే మోటార్లకు చాలా కష్టం అన్న ఆయన, ఆ విధంగా ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కట్ చేసే కుట్ర జరుగుతోందని ఆక్షేపించారు. తాము అప్పుడైనా, ఇప్పుడైనా ఎప్పుడూ ఆక్వా రంగానికి పూర్తి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న డైరెక్ట్ కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, గ్రాస్ శాలరీ చెల్లించాలని పారామెడికల్ సిబ్బంది రేపు నిర్వహిస్తున్న రాష్ట్ర ధర్నాకు ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ జెఎసి రాష్ట్ర కమిటి మద్దతు తెలిపింది. వీరి డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, డైరెక్ట్ కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లించాల్సిన వేతన బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు పత్రికా ప్రకటను విడుదల చేసింది. 'వైద్య, ఆరోగ్య శాఖలో, ఇతర శాఖలలో, వివిధ ప్రభుత్వ పథకాలు, సంస్థలలో కాంట్రాక్ట్ సిబ్బంది ఏళ్ళ తరబడి పనిచేయించుకోవడం సరైందికాదంది. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీసం పిఎఫ్, ఇఎసఐలు కూడా అమలు చెయ్యకుండా రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయించుకుంటున్నాయి. ఉద్యోగులు చనిపోతే వారి కుటుంబాలు ఎటువంటి ఆధారం లేకుండా రోడ్డున పడుతున్నాయి. దాదాపు 3 లక్షల మంది ఆప్కాస్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులది ఇదే పరిస్థితి. అందరికీ ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఈఅంశాలను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులను రెగ్యులరైజ్ చెయ్యాలని, ఈలోగా గ్రాస్ శాలరీ చెల్లించాలని, సర్వీసులో ఉండగా మరణించిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కాంపాషినేట్ అపాయింట్‌మెంట్లు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్‌ఐలు అమలు చేయాలని, 8 గంటల పనివిధానం వర్తింపచేయాలని" రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ జెఎసి రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది.

## సర్దార్ పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి



**కాకినాడ, జూన్ 16 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో జరిగిన గౌడ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 18న పాపయ్య గౌడ్ జయంతి జరగనుందని రాజధానిలో 10 ఎకరాలు సర్దార్ పాపయ్య గౌడ్ స్మృతివనం భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో గౌడ భవనాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గౌడ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి అనేక ఇబ్బందులు పడుతున్న గౌడ కులస్తులను అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గౌడలు ఐక్యతతో ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. రాబోవు ఎన్నికలలో తమకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన పార్టీల వెంట తాము ఉంటామని గౌడ సామాజిక వర్గాన్ని నిరక్ష్యం చేయరాదని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్ట వీరబాబు గౌడ్ తెలిపారు జిల్లా, మండల స్థాయిలో గౌడలు తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి తమ సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి పథంలో పైనించాలన్నారు.

## మంత్రి సంధ్యారాణికి అస్వస్థత



**సాలూరు, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళ, శిశు గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొనేందుకు వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది హుటాహుటిన విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని తెలుస్తుంది. కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తారని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి సమాచారం.


మృతిచెందిన బాలుడిని పట్టుకుని రోదిస్తున్న తల్లి

## బస్సు ఢీకొని బాలుడు మృతి

**మంత్రాలయం, జూన్ 16, ప్రభాతవార్త:** మంత్రాలయంలో కర్ణాటక బస్సు ఢీకొని ఓ బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మైసూర్‌కు చెందిన ఒరిస్సా అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో మంత్రాలయం వచ్చారు. అభయాంజనేయస్వామి దర్శనం ముగించుకుని రోడ్డు దాటుతుండగా కర్ణాటక బస్సు నుంచి యాత్రికులతో వచ్చిన బస్సు కార్తీక్(4) అనే బాలుడిని ఢీకొంది. దీంతో బాలుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు తమ కళ్లముందే మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు

తిరుపతి, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు నిచ్చారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 74/2018 కేసులో ముద్దాయి వేలూరు జిల్లా పెరియపట్టికి చెందిన ముత్తు ఏలుమలైపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



## అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న ట్రస్ట్‌కు విరాళాలు అందుతున్నాయి. మంగళవారం ఉదయం ఒంగోలుకు చెందిన విజన్ ఆటోమొబైల్స్ సంస్థ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి విరాళం డిడిని అందజేశారు.

## తిరుమల సమాచారం



### పెరియాళ్వార్ ఉత్సవాలు ప్రారంభం

**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న లక్ష్మీ నారాయణస్వామి ఆల యంలో వైష్ణవ సంప్రదాయ మహామహుడు, శ్రీమహా విష్ణువు పరమభక్తుడు పెరియాళ్వార్ ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ఆరంభమయ్యాయి. ఈ ఉత్సవాలు జూన్ 25వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి తమ శిష్యబృందంతో కలిసి పెరియాళ్వార్ సన్నిధిలో దివ్యప్రబంధ పాశురాలను భక్తిపూర్వకంగా నివేదించి ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లారు. ఉత్సవాల చివరిరోజైన జూన్ 25న ఉదయం పెరియాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించనున్నారు. సాయంత్రం గోవిందరాజస్వామి గరుడ వాహనంపై, పెరియాళ్వార్ గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యమంగళ దర్శనం ప్రసాదించనున్నారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# తిరుమలలో పెరిగిపోతున్న వాహనాలు

- కాలుష్య నియంత్రణ దిశగా అడుగులు • తిరుపతి అలిపిరి వద్దే పార్కింగ్ ఏర్పాట్లు

**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యతోబాటు వాహనాలు పెరిగిపోతుండటంతో కొండపై పార్కింగ్ సమస్య తీవ్రమవుతోంది. తిరుమలలో సుమారు నాలుగువేల వరకు వాహనాలకు మాత్రమే పార్కింగ్ సదుపాయం ఉంది. ఆ తరువాత వాహనాలు వస్తే ఎక్కడ పార్కింగ్ చేయాలనేది తీవ్రమైన సమస్యగా మారింది. దీన్ని పరిష్కరించాలని ఎప్పటి నుండో టిటిడి అధికారులు ప్రతిపాదనలు రూపొందించినా కార్యాచరణలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో చాలావరకు యాత్రికుల వాహనాలు అలిపిరి టోల్‌గేట్ దాటడానికి దాదాపు 40నిమిషాలు సమయం పడుతోంది. అదేగాక తిరుమలలో ఉన్న 7,900వరకు గదులు కూడా 40వేల మంది భక్తులకు మాత్రమే వసతి కల్పించే వీలుంది. ఆ పై భక్తులు తిరుమలకు వచ్చినా ఎక్కడ విశ్రాంతి తీసుకోవాలి, ఎక్కడ ఉండాలనేది కూడా తలనొప్పి సమస్య. దీన్ని కొంతవరకు నియంత్రించడానికి టిటిడి అధికారులు తిరుమల కొండ క్రిందనే అలిపిరి సమీపంలో శాశ్వత పార్కింగ్ సమస్య పరిష్కారానికి ఆలోచన చేస్తున్నారు. ఇందుకోసం అలిపిరి సమీపంలోని జూ పార్క్ రోడ్డులో సుమారు 300 ఎకరాల అటవీ స్థలం ఉండటంతో వారికి ప్రత్యామ్నాయంగా టిటిడి స్థలాలు కేటాయించి, ఆ స్థలంలో విస్తృతమైన విశాల పార్కింగ్ వసతి, స్కానింగ్ హబ్ ఏర్పాటు దిశగా టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు.




ఇప్పటికే సాధారణ రోజుల్లోనూ తిరుమలకు దేశం నలుమూలల నుండి లక్షమందివరకు భక్తులు వస్తున్నారు. 4వేల వరకు వాహనాలు తిరుమలకు చేరుతున్నట్లు టిటిడి అధికారుల అంచనా. ఈ లెక్కన వాహనాలు సంఖ్య పెరిగితే దీనివల్ల ఘాట్‌రోడ్లపై వాతావరణం కాలుష్యం కూడా ఎక్కువవుతోందని శాస్త్రవేత్తల ఆవేదన.

సామాన్యభక్తుల దర్శనాలకు, వసతికి ప్రాధాన్యతనిస్తున్న టిటిడి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తిరుపతిలోనే పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఆలోచన చేస్తున్నారు. దేశం నలుమూలల నుండి వచ్చే యాత్రికుల వాహనాలను కొండ క్రిందే పార్కింగ్ చేయించాలని చూస్తున్నారు. భక్తుల సదుపాయాలపైన కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అవసరమైన మార్పులు చేస్తోంది. తిరుమల కొండ పైన వాహనాల రద్దీ నివారణ కోసం కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం వాహనాల రద్దీ కారణంగా కాలుష్యం కూడా పెరిగిపోతోంది. కొత్త ప్రతిపాదనల మేరకు కొండ కిందే పార్కింగ్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు.

తిరుపతిలోని పార్కింగ్ ప్రాంతం నుండి విద్యుత్ బస్సుల్లో యాత్రికులు తిరుమలకు చేరుకునే విధంగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సాధారణ రోజుల్లో తిరుమలకు గంటకు ఎన్ని వాహనాలు వస్తున్నాయి, ఎన్ని వాహనాలు తిరుగు ప్రయాణమవుతున్నాయి. వీటి పార్కింగ్ ఎక్కడ అనేది ఏఐ ద్వారా పరిశీలిస్తున్నారు.


ఒక్కోరోజు గంటకు 400వరకు వాహనాలు తిరుమలకు వస్తుండటం విశేషం. మరీ రోజంతా ఉదయం నుండి సాయంత్రంలోపు నాలుగువేల వరకు వాహనాలు చేరుతుండటంతో పార్కింగ్ సమస్య జఠిలమవుతోంది. అలిపిరి వద్ద అధునాతన విశ్రాంత భవనం మెగా టౌన్‌షిప్ ఏర్పాటు కూడా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇవన్నీ రానున్న సెప్టెంబర్ బ్రహ్మోత్సవాల లోపు కార్యరూపం దాల్చి సిఎం చేతుల మీదుగా పనులు ప్రారంభించాలని ఆలోచన చేస్తున్నారు.



## గంగమ్మకు భక్తిశ్రద్ధలతో మరుపొంగళ్లు

**తిరుపతి, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి ప్రజల ఆరాధ్య దైవమైన తాతయ్యగుంట గంగమ్మకి నిర్వహించే ఐదవ మరు పొంగళ్ళు కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో వైభవంగా జరిగింది. గంగమ్మ జాతర అనంతరం ఐదు మంగళవారాల పాటు కొనసాగుతున్న మరు పొంగళ్ళు సంప్రదాయంలో చివరి మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు నిర్వహించారు. భక్తులు పొంగళ్ళు సమర్పించి కుటుంబ శ్రేయస్సు, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ పురాణ, జానపద, దైవిక పాత్రల వేషధారణలతో పాల్గొని భక్తులను ఆకట్టుకున్నారు. నేరేళ్లమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గంగమ్మ ఆలయం వరకు భక్తి పారవశ్యంతో కొనసాగింది. డప్పుల మోతలు, భక్తి గీతాలు, జై గంగమ్మ నినాదాల మధ్య కళాకారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా మాజీ గంగమ్మ గుడి చైర్మన్, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి గంగమ్మ పై తిరుపతి ప్రజలకు ఉన్న అపారమైన భక్తి, విశ్వాసానికి మరు పొంగళ్ళు కార్యక్రమాలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలు సమాజంలో ఐక్యతను పెంపొందించి భారతీయ సంస్కృతిని భావితరాలకు చేరవేస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని, లోకక్షేమం చేకూరాలని గంగమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. దర్శనం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

## కురుక్షేత్రలో 25 నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** హర్యానా రాష్ట్రంలో పుణ్యక్షేత్రమైన కురుక్షేత్ర వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుండి జులై 3వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముందుగా జూన్ 24న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు సన్నాహకంగా జూన్ 19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వ హిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజా సామగ్రిని పవిత్ర జలాలతో శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. జూన్ 25న ధ్వజారోహణం, పెద్దశేష వాహనం ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ ధ్వజారోహణం నిర్వహించి, సాయంత్రం పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. 26న చిన్నశేష వాహనం, హంస వాహనంపై స్వామివారి దివ్య విహారం జరుగుతుంది. 27న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహన సేవలు నిర్వహిస్తారు. 28 నకల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం సేవలు జరుగుతాయి. 29న ఉదయం మోహినీ అవతారం, కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం సేవ జరుగుతుంది. 30న హనుమంత వాహనం, గజ వాహనం, జూలై 1న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం పైదివ్య దర్శనం కల్పిస్తారు. 2న రథోత్సవం, అశ్వవాహనం. భక్తుల గోవింద నామ స్మరణల మధ్య రథోత్సవం నిర్వహించి, రాత్రి అశ్వవాహనంపై స్వామివారు విహరిస్తారు. 3న చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలను ముగి స్తారు. బ్రహ్మోత్సవాల అనంతరం 4న సాయంత్రం పుష్పయాగం వైభవంగా నిర్వహి స్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు వాహనసేవలు జరగనున్నాయి.

# రికార్డు స్థాయిలో భక్తుల లగేజీ డిపాజిట్ సేవలు

- అర కోటి మందికి పైగా భక్తులకు లగేజీ సురక్షంగా జమ బట్వాడా



**తిరుమల, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** వేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు టిటిడి విస్తృత స్థాయిలో లగేజీ డిపాజిట్, డెలివరీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. భక్తులు శ్రీవారి దర్శనం, కాలినడక యాత్ర సమయంలో తమతో తీసుకువచ్చే లగేజీ, బ్యాగులు, సెల్ ఫోన్లను భద్రంగా ఉంచుకునేందుకు తిరుమలలో కాలినడక మార్గాల్లో కలిపి మొత్తం 65 కౌంటర్లు ఏర్పాటు చేసి 345 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరంగా సేవలందిస్తున్నారు. టిటిడి కల్పించిన ఈ సేవలను భక్తులు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రికార్డు స్థాయిలో 51,38,976 మంది భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసుకున్నారు. గత ఏడాది ఏప్రిల్ లో 20,75,481 మంది భక్తులు తమ లగేజీని భద్రపరచుకోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 23,15,279 మంది భక్తులు తమ లగేజీని భద్రత పరచుకున్నారు. గత ఏడాది మే నెలలో 23,82,622 తమ లగేజీని భద్రపరచుకోగా, ఈ ఏడాది 28,23,697 మంది భక్తులు తమ లగేజీని భద్రపరచుకున్నారు. అంటే గత ఏడాది ఏప్రిల్ నెలతో పోల్చితే 2,39,798 లగేజీ డిపాజిట్లు, మే నెలతో పోల్చితే 4,41,075 లగేజీ డిపాజిట్లు అత్యధికంగా నమోదు కావడం విశేషం. తిరుమలలో రద్దీ పెరిగిన నేపథ్యంలో గత మూడు రోజుల్లో 3,41,742 మంది ఉచిత లగేజీ సేవలు వినియోగించుకున్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు కాలినడక మార్గాల ద్వారా తిరుమలకు చేరుకునే భక్తుల కోసం ప్రత్యేక డిపాజిట్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలిపిరి కాలినడక మార్గం లగేజీ కేంద్రం లో 5 కౌంటర్లు, 45 మంది సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 15 మంది). 10,194 లగేజీ డిపాజిట్ల సామర్థం. శ్రీవారి మెట్టు లగేజీ కేంద్రంలో 2 కౌంటర్లు, 10 మంది సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 5 మంది), 3,025 లగేజీ డిపాజిట్ల సామర్థం ఉంది. ఈ కేంద్రాల్లో లగేజీ డిపాజిట్ చేసిన భక్తులు తిరుమలలోని డెలివరీ కేంద్రాల్లో సులభంగా తిరిగి పొందే సౌకర్యాన్ని టిటిడి కల్పించింది. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల కోసం లగేజీ, సెల్ ఫోన్ డిపాజిట్ సౌకర్యం అందుబాటులో ఉంది. ఫ్రీ హాల్‌లో 8 కౌంటర్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్– 1, 2 కౌంటర్లు, నారాయణగిరి షెడ్ – 5 కౌంటర్లు, డిడి హాల్– 3 కౌంటర్లు, 300 రూపాయలు హాల్ 4 కౌంటర్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్ అప్ స్కానింగ్ (కంపార్ట్‌మెంట్03) – 2 కౌంటర్లు, డెలివరీ కేంద్రాలు తలనీలాలు సమర్పించే భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్ట సమీపంలో కూడా ప్రత్యేక కేంద్రాలను టిటిడి ఏర్పాటు చేసింది.



## ముత్యాలదండల అలంకరణలో గంగమ్మ

అత్యంత మహిమాన్వితమైన తిరుపత తాతయ్యగుంట గంగమ్మ జాతర చివరి మంగళవారం ముత్యాల అలంకరణలో దర్శనమిచ్చారు. ముత్యాలు తెల్లనివి.. చల్లదనాన్నినిస్తాయి. అంతటి ముత్యాలను తానే ఆలయంలో అలంకరించుకుని భక్తులకు దర్శనమివ్వడం విశేషం. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకము చేసిన అనంతరము దాతలు కవిత, శివకుమార్, లీలాచంద్ర సహకారంతో ముత్యాల పూసలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఇఒ ఎ.జయకుమార్ దర్శన ఏర్పాట్లు చేయించారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**కోవూరు, (నెల్లూరు), జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళల రాజకీయ సాధికారతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రాధాన్యత ఇస్తుంటే ఒక హోం మంత్రిగా పనిచేస్తున్న మహిళపై వైసిపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత నీచమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. విపిఆర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా మరింత ముందుకు రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ బాబులు 33శాతం రిజర్వేషన్ కల్పించి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్ర హోం మంత్రిగా ఎదిగిన వంగలపూడి అనితపై వైసిపి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కోలేక వ్యక్తిగత అంశాలు, దుస్తులు, మేకప్ వంటి విషయాలను ప్రస్తావించడం మంచిది కాదన్నారు. రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ తల్లి చెల్లి భార్య వంటి మహిళా బంధువులు ఉంటారని, ఇటువంటి పరిస్థితుల్లో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. రాజకీయ నాయకుల విధానాలు, నిర్ణయాలపై విమర్శలు చేయవచ్చు గానీ, వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. రాష్ట్ర హోం మంత్రి హోదాలో ఉన్న ఒక దళిత మహిళ ఆత్మ విశ్వాసంతో గౌరవప్రదంగా ఉండకూడదా అని ప్రశ్నించారు. సాధారణ కుటుంబం నుంచి ఉపాధ్యాయినిగా ఉద్యోగం ప్రారంభించి కష్టపడి హోం మంత్రి స్థాయికి చేరుకున్న అనితపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని ఆయా పార్టీల నాయకత్వం నియంత్రించాలన్నారు.

# మామిడి రైతు బేజారు

- తోతాపురి ధర కేజీ రూ.4కు పతనం
- దిక్కుతోచని స్థితిలో తోతాపురి రైతు



**చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:** జిల్లాలో మామిడి రైతు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మామిడి సీజన్‌పై ఆశలు పెట్టుకున్న రైతుకు సీజన్ ప్రారంభం నుండి మామిడి ధర పతనం కావడంతో ఈ సీజన్ తమను నష్టాల ఊబిలోకి నెట్టివేస్తుందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం మామిడి పల్ప్ ఫ్యాక్టరీల రైతులకు కేజీ తోతాపురి రకం మామిడి కేజీ రూ.7కు కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉండటంతో రైతులు నష్టాల మునిగిపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం తోతాపురి రకం మామిడిని పల్ప్ ఫ్యాక్టరీలు రూ.4 నుండి రూ.5 వరకు రైతులకు చెల్లిస్తుండగా ర్యాంపుల వద్ద మాత్రం కేజీ తోతాపురి రూ.4 కంటే ఎక్కువకు ఎవరు కొనుగోలు చేయడం లేదు. జిల్లాలో మామిడి సీజన్ ప్రారంభం కాకముందు నుండి ఇటు జిల్లా అధికార యంత్రాంగం, మామిడి రైతులు, అటు పల్ప్ ఫ్యాక్టరీల యాజమానులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపినప్పటికీ సీజన్ ప్రారంభమైన అనంతరం మామిడి ధర మాత్రం ఏ మాత్రం పెరుగలేదు. ఈ సీజన్‌లో తోతాపురి మామిడి కేజీకి రూ.18 చెల్లించాలని మామిడి రైతు సంఘాలు ఆందోళనలు నిర్వహించి డిమాండ్ చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం కన్పించడం లేదు. గత సీజన్‌లో సైతం మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రభుత్వం స్పందించి మామిడికి ప్రోత్సాహక ధర నిర్ణయించి మామిడి రైతుకు కేజీకి రూ.4 చెల్లించింది. అలాగే పల్ప్ ఫ్యాక్టరీలు తోతాపురి రకం మామిడి కేజీకి రూ.4 చెల్లించడంతో గత సీజన్‌లో తోతాపురి రైతుకు కేజీ మామిడికి రూ.8 లభించింది. జిల్లాలో 79 వేల హెక్టార్ల నుండి 97 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి పంట సాగు అవుతోంది. ఇందులో 55 వేల హెక్టార్ల విస్తీర్ణంలో తోతాపురి రకం మామిడిని అత్యధిక రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో తోతాపురి మామిడి పండ్ల నుండి పల్ప్ తయారు చేసి ఇతర దేశాలకు శీతల పానీయ ఫ్యాక్టరీలు, ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి 31 పల్ప్ ఫ్యాక్టరీలు వున్నాయి. ఈ సీజన్ ప్రారంభంలో కేవలం 5 ఫ్యాక్టరీలు మాత్రమే పల్ప్ చేయడానికి సిద్ధమై ప్రారంభమైనప్పటికీ రాను రాను 28 ఫ్యాక్టరీలు మామిడి పల్ప్‌ను తయారు చేయడానికి సిద్ధం అయ్యాయి. ఇందులో ప్రస్తుతం కేవలం 14 పల్ప్ ఫ్యాక్టరీలు మాత్రమే తోతాపురి మామిడిని కొనుగోలు చేసి పల్ప్‌ను తయారు చేస్తున్నాయి. మిగిలిన ఫ్యాక్టరీలు తోతాపురి మామిడిని ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. జిల్లాలో తోతాపురి మామిడి ఉత్పత్తి అధికంగా ఉండటం, పల్ప్ ఫ్యాక్టరీలు తక్కువగా ఉండటంతో మామిడికి గిట్టుబాటు ధర లేకపోయినప్పటికీ రైతులు తమ తోటల్లోని తోతాపురి మామిడిని పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించడానికి సిద్ధమవుతున్నారు. అయితే ఫ్యాక్టరీలకు తోతాపురి మామిడి అధికంగా వస్తుండటం, ఫ్యాక్టరీల్లో పల్ప్ తక్కువగా ఉత్పత్తి చేయాల్సి ఉండటంతో అత్యధిక రైతులు ఫ్యాక్టరీలకు తీసుకెళ్ళిన మామిడి ఆన్‌లోడ్ చేయడానికి రెండు రోజుల సమయం పడుతున్నది. మామిడి సీజన్ జులై నెలాఖరు వరకు కొనసాగనుండటంతో జిల్లాలో వున్న అన్ని పల్ప్ ఫ్యాక్టరీలను తోతాపురి మామిడి పల్ప్‌ను తయారు చేయడానికి సిద్ధం చేస్తే మామిడి రైతులకు మామిడికి గిట్టుబాటు ధర లేకపోయినా తమ తోటల్లో ఉత్పత్తి అయిన మామిడిని సకాలంలో పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించి ఎంతో కొంత మొత్తం రైతులు దక్కించుకునే అవకాశం వుంది. గత ఏడాది మామిడి సీజన్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రభుత్వం స్పందించి కేజీ తోతాపురి మామిడిపై రూ.4 ప్రోత్సాహక ధర చెల్లించింది. మామిడి సీజన్ పూర్తయిన రెండు నెలల్లో మామిడి రైతుకు ప్రభుత్వం నుండి రావాల్సిన కేజీపై రూ.4 ప్రోత్సాహక ధర వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యింది. ఈ సీజన్‌లో సైతం తోతాపురి మామిడి రైతులు గత సీజన్ కంటే ఎక్కువ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుండటంతో ప్రభుత్వం స్పందించి తోతాపురి రైతును ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

**మామిడి ధరపై సిఎం సమక్షంలో సమావేశం:** జిల్లాలో మామిడి ధర పెంచడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఒక వారం రోజుల్లో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం కన్పిస్తుంది. ముఖ్యమంత్రి స్థాయిలో సమావేశం జరిగిన అనంతరం తోతాపురి మామిడి ధర పెరిగే అవకాశం కన్పిస్తుంది. జిల్లాలో అత్యధిక రైతులు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తుండటంతో వారి ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని తోతాపురి మామిడి ధర పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి ఇప్పటికే చర్చించడం జరిగింది.




## జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై 5 స్టార్ ఫ్యామిలీ నూతన చిత్రం

**తిరుపతి, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఫైవ్ స్టార్ కుటుంబ చిత్రం పోస్టర్ ను సినీ నిర్మాత ఎన్ వి ప్రసాద్ ఆవిష్కరించారు. నటీనటులుగా వాసుదేవ్ ,నితిన్ శ్రీకర్, కార్తిక్ , దిలీప్, తిలక్, లక్ష్మణ్, కుసుమ కుమారి నటించారు. నటుడు భానుచందర్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు వాసుదేవ్ ఆధ్వర్యంలో ఈ చిత్రం తిరుపతి పరిసర ప్రాంతాలలో షూటింగ్ నిర్వహించుకున్నందున ఆ తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదాలు వల్లే సినిమా మంచి విజయం సాధిస్తుందని నిర్మాత ఎన్ వి ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి మనిరామ్ కలరి ఎడిటింగ్, అనిల్ కుమార్ సంగీతం చాలా ప్లస్ అవుతుందని డాక్టర్ కరుణానిధి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎన్వి ప్రసాద్, డాక్టర్ కరుణానిధి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఓంకార్, డైరెక్టర్ వాసుదేవ్, కుసుమ కుమారి, నితిన్ శ్రీకర్, కార్తిక్, తిలక్, లక్ష్మణ్, మురళి తమ్మిశెట్టి, వంశీ, నాని, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ ఆస్ట్రా విజువల్ స్టూడియోస్‌లో శరవేగంగా జరుగుతోంది ఇటీవలే కన్యాకుమారి లో పాటల చిత్రీకరణ పూర్తి చేసుకుంది.

## హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ ఆగ్రహం

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. మహిళా మంత్రిని మేకప్ మంత్రి అని సంబోధిస్తూ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలుండాలి గానీ, ఒక మహిళా ప్రజాప్రతినిధి రూపం, దుస్తులు, మేకప్ గురించి మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని శైలజ స్పష్టం చేశారు. ఇది హోంమంత్రిని మాత్రమే కాకుండా మొత్తం మహిళా సమాజాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్లపై చర్చ జరుగుతున్న వేళ, ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు మహిళలు రాజకీయాల్లోకి రాకుండా నిరుత్సాహపరుస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. నైతిక విలువలు లేనివారు నాయకులు కాలేరని హితవు పలికారు. ఈ వ్యవహారాన్ని మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోంది. కేవలం వ్యాఖ్యలు చేయడమే కాకుండా, వాటిని సమర్థించుకునేలా అమర్‌నాథ్ మాట్లాడటంపై కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీకి లేఖ రాయాలని నిర్ణయించింది. అలాగే గుడివాడ అమర్‌నాథ్‌కు సమన్లు జారీ చేయనుంది.

## జూనియర్ కళాశాలలో 329 మంది పార్ట్‌టైమ్ సిబ్బంది సేవలు మరో ఏడాది కొనసాగింపు

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 329 మంది పార్ట్‌టైమ్ సిబ్బందికి 2026-27 విద్యా సంవత్సరానికి కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్లు, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండర్లు, కన్సాలిడేటెడ్ పే సిబ్బంది వీరి సేవలు 01 జూన్ 2026 నుండి 30 ఏప్రిల్ 2027 వరకు కొనసాగిస్తామన్నారు.

# కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలు



విజయోత్సవ సంబరాల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు(వైద్యం), జూన్ 16 ప్రభాతవార్త:** కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలు అని, రాష్ట్రంలోని 111 దేవాలయాలలో నిత్యాన్నదానం అమలు చేస్తున్నామని, అలాగే 808 కోట్ల రూపాయలతో 684 దేవాలయాల అభివృద్ధి, పునః నిర్మాణం చేస్తున్నామని, మరో 73 కోట్ల 99 లక్షలతో 6,116 దేవాలయాలలో దీప,దూప నైవేద్యం పథకం, 2500 కోట్ల రూపాయలతో దత్తులూరులో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటు చేశామని, సోమశిల కండలేరు రిజర్వాయర్ ద్వారా జిల్లా రైతాంగానికి తొలి విడతగా ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, మరో నాలుగు లక్షల ఎకరాలకు త్వరలో సాగునీరు అందిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. మంగళవారం నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లలో ప్రజలకు కల్పించిన నమ్మకం, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించేలా విజయోత్సవాలని నిర్వహిస్తున్నా మన్నారు. నెల్లూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో కలిసి ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకం సూపర్ హిట్ అయిందని, 16 వేలమంది ఉపాధ్యాయులకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ కల్పన, 6000 కానిస్టేబుల్ ఉద్యోగాలను ప్రత్యక్షంగా నియమించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ చాలా చిన్నదని,అయినను దానిని ముందు వరుసలో నిలిపే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద 684 దేవాలయాల అభివృద్ధి పునర్నిర్మాణానికి రూ.808 కోట్లు వెచ్చించడం జరుగుతున్నదని తెలిపారు. ధూప దీప నైవేద్యం కార్యక్రమం కింద 6,116 దేవాలయాలలో 73 కోట్ల 99 లక్షల రూపాయలు వెచ్చించడం జరుగుతున్నదని, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 5000 గుడిలలో భజనలు ఆలయాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 111 దేవాలయాలలో నిత్యాన్నదానం జరుగుతున్నదని సుమారుగా సంవత్సరానికి మూడు కోట్ల మందికి అన్న ప్రసాదం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో పరిశ్రమలు రావడం ఆనందదాయకమని నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి ముఖ్యమని అన్నారు. ఎం ఎస్ ఎం ఈ పార్కును రాష్ట్రంలోనే తొలిసారిగా ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజినరీ లీడర్ అని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంచి డిస్కోయిన్ ఉన్న వ్యక్తి అని, నారా లోకేష్ బాబు డిసిప్లిన్, పట్టుదల గల వ్యక్తి అని వారి అడుగుజాడలలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్ళవలసిన అవసరం ఉందన్నారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ విధివిధానాలతో రాష్ట్రం చాలా నష్టపోయిందని ప్రధానమంత్రి మోడీ, సిఎం చంద్రబాబుల కృషితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం జరుగుతున్నదని తెలిపారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నమ్మకం 12 సంవత్సరాల మోడీ పాలన అమోఘమన్నారు. చంద్రబాబు నాయుడు చెప్పినవన్నీ చేయడం జరిగిందన్నారు. కావలి నియోజకవర్గం శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్, గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, గోపాలపురం శాసనసభ్యులు, జోనల్ ప్రెసిడెంట్ వెంకట రాజు, శాసన మండల సభ్యులు బీద రవిచంద్ర, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్ రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమం అనంతరం డిఆర్డిఏ శాఖ ద్వారా పలువురు లబ్ధిదారులకు ట్రాక్టర్లు, ఆటోలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, శాసనసభ్యులతో కలిసి అందజేశారు.

## హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

### - 2015లో జరిగిన హత్య కేసులో కోర్టు తీర్పు

**మార్కాపురం, జూన్ 16 ప్రభాతవార్త:** కొమరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2015లో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధిస్తూ మార్కాపురం 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవాని మంగళవారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం, టేకులపెంట గ్రామానికి చెందిన కొండమల్ల శివ (25) గ్రామంలో జరుగుతున్న తప్పులను ప్రశ్నిస్తూ ఉండేవాడు. ఇదే గ్రామానికి చెందిన వీర్నేని లింగయ్య తరచూ గ్రామస్తులతో వివాదాలు సృష్టిస్తూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించేవాడు. తనకు ఎదురునిలుస్తున్న శివపై లింగయ్య కక్ష పెంచుకుని, ఇతర నిందితులతో కలిసి 2015 సెప్టెంబర్ 27న శివ ఇంటి వద్ద మారణాయుధాలతో దాడి చేశాడు. ఈ దాడిలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై శివ తల్లి కొండమల్ల ఆదిలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కొమరోలు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.77/2015 కింద కేసు నమోదు చేశారు. అప్పటి గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎండీ ఫిరోజ్, వి. శ్రీరామ్ దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం విజయలక్ష్మి వాదనలు వినిపించారు. మార్కాపురం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మార్గదర్శకత్వంలో పోలీసు సిబ్బంది సాక్షులను సమయానుసారం కోర్టులో హాజరుపరుస్తూ పటిష్టమైన ట్రయల్ మానిటరింగ్ నిర్వహించారు. సమర్పించిన సాక్ష్యాధారాల ఆధారంగా నిందితులపై నేరం రుజువైనట్లు కోర్టు నిర్ధారించి నలుగురు నిందితులకు జీవిత ఖైదు విధించింది.

## ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

- 4గంటల పాటు ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించిన అధికారులు
- త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పణ

**తిరుపతి(విద్య), జూన్ 16 ప్రభాతవార్త:** తిరుపతిలోని ప్రముఖ విద్యాసంస్థ అయిన ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌పై వచ్చిన వేధింపుల ఆరోపణల వ్యవహారం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అదే కళాశాలలో పనిచేస్తున్న ఓ మహిళా అధ్యాపకురాలు, ప్రిన్సిపాల్ తనను మానసికంగా, వృత్తిపరంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలంటూ ఆమె ఏకకాలంలో టీటీడీ విజిలెన్స్ విభాగానికి మరియు విజయవాడలోని రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదులు పంపడంతో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు అత్యంత ప్రాధాన్యతతో స్పందించారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం తిరుపతిలో హైడ్రామా నడిచింది. విజయవాడ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన రాష్ట్ర మహిళా కమిషన్‌కు చెందిన ముగ్గురు సభ్యుల ఉన్నత స్థాయి బృందం, టీటీడీ విజిలెన్స్ అధికారులతో కలిసి కళాశాలలో నేరుగా రంగంలోకి దిగింది. ఉదయం నుంచే కళాశాల ప్రాంగణంలో విచారణ ప్రక్రియను ముమ్మరం చేశారు. తొలుత ఫిర్యాదు చేసిన బాధితురాలైన మహిళా అధ్యాపకురాలితో విడిగా సమావేశమై, ఆమె పడుతున్న ఇబ్బందులు, ప్రిన్సిపాల్ అనుచిత ప్రవర్తనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. అనంతరం ఈ వేధింపుల వ్యవహారంపై నిజానిజాలు తెలుసుకునేందుకు కళాశాలలోని ఇతర మహిళా, పురుష అధ్యాపకులను, ల్యాబ్ మరియు కార్యాలయ సిబ్బందిని విచారణ కమిటీ ఒక్కొక్కరిగా పిలిచి ఆరా తీసింది. ఈ క్రమంలో కళాశాల అంతర్గత వాతావరణంపై భిన్న కోణాల్లో సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కళాశాలలో జరుగుతున్న కొన్ని పరిణామాలపై కొందరు అధ్యాపకులు ,సిబ్బంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారు విచారణ కమిటీకి, టీటీడీ విజిలెన్స్ అధికారులకు తమకు తెలిసిన వివరాలను లిఖితపూర్వకంగా (లిఖితపూర్వక స్టేట్‌మెంట్లు) అందజేసినట్లు సమాచారం. ఇది ఈ కేసులో కీలక ఆధారంగా మారే అవకాశం ఉంది. కళాశాలలో ప్రాథమిక సమాచారం, ఆధారాలు సేకరించిన అనంతరం, విచారణ బృందం తమ ఫోకస్‌ను ప్రిన్సిపాల్‌పైకి మళ్లించింది. టీటీడీ పరిపాలనా భవనానికి చేరుకున్న మహిళా కమిషన్ బృందం, టీటీడీ విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్‌ను గదిలోకి పిలిపించి విచారించారు.

# ఆగస్టు నాటికి వెలిగొండ పూర్తి చేస్తాం

- టన్నెల్ లైనింగ్, టిబిఎం తొలగింపు పనులు వేగవంతం
- మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**కొత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, ఆగస్టు చివరి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా పనులు చేపడుతోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్సన్‌బాబుతో కలిసి వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్లు, ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి టన్నెల్‌లలోకి వెళ్లి లైనింగ్ పనులు, టన్నెల్ బోరింగ్ మెషిన్ (టిబిఎం) తొలగింపు పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి మిగిలిన పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్లకు సంబంధించిన రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్లు పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొల్లంవాగు నుంచి ఒక టీఎంసీ నీరు టన్నెల్‌లలోకి చేరేలా 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించాల్సి ఉండగా, ఇప్పటివరకు 58 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించినట్లు చెప్పారు. టన్నెల్1లో అడ్డుగా ఉన్న 1.2 లక్షల క్యూబిక్ మీటర్ల మక్‌లో 40 వేల క్యూబిక్ మీటర్లను ఇప్పటికే తొలగించినట్లు వివరించారు. టన్నెల్ 2లో మొత్తం 7 కిలోమీటర్ల లైనింగ్ పనులకు గాను 5.5 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1.5 కిలోమీటర్ల పనులను జూలై చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిలిచిపోయిన టిబిఎం వెలికితీత పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, యంత్రంలోని ఏడు కంపార్ట్‌మెంట్లలో మూడు ఇప్పటికే బయటకు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. క్లిష్టమైన హెడ్ భాగాన్ని టన్నెల్‌లోనే పూడ్చిపెట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఫీడర్ కెనాల్‌లో 5.3 కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ పనులను ఐదు నెలల్లో పూర్తి చేశామని, ప్రస్తుతం కొనసాగుతున్న 21 కిలోమీటర్ల లైనింగ్ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించినట్లు తెలిపారు. మేఘా తుఫాన్ కారణంగా ఫీడర్ కెనాల్‌లో ఏర్పడిన భారీ గండిని సీసీ వాల్ నిర్మాణం ద్వారా పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. తీగలేరు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్ పనులతో పాటు శాశ్వత డైవర్షన్ రోడ్డు నిర్మాణాన్ని జూన్ నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సాగు సీజన్ ప్రారంభానికి ముందే నల్లమలసాగర్ రిజర్వాయర్‌ను నీటితో నింపేలా పనులు ముమ్మరంగాకొనసాగుతున్నాయని చెప్పారు. అదేవిధంగా వెలిగొండ నిర్వాసితులకు ఈ నెలలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్అండ్ఆర్ పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వకు అవసరమైన పునరావాస కార్యక్రమాల కోసం అదనపు బడ్జెట్‌లో రూ.905 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎసిబికి పట్టుబడ్డ వెల్దుర్తి ఇఒ

**వెల్దుర్తి, జూన్ 16 ప్రభాతవార్త:** ఇంటి నిర్మాణం అప్రూవల్ కోసం వెల్దుర్తి పట్టణానికి చెందిన సతీష్ అనే వ్యక్తి వద్ద నగదు తీసుకుంటున్న వెల్దుర్తి గ్రామపంచాయతీ ఇఒ లక్ష్మీనాథ్ మంగళవారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ఉన్న వీధిలో ఇతనికి ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలానికి సంబంధించి ఉన్న డి పట్టాతో గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి తను ఇంటి నిర్మాణం చేపడతారని అప్రూవల్ అనుమతులు మంజూరు చేయాలని ఇఒకు విన్నవించుకున్నాడు. అనుమతులు మంజూరు చేయాలంటే రూ.50 వేల ఇవ్వాలని ఇఒ డిమాండ్ చేశారు. దీంతో ఒప్పందం కుదుర్చుకున్న సతీష్ ముందస్తుగా ఇఒకు రూ.40 వేలు ఇచ్చేందుకు సిద్ధమై ఎసిబికి సమాచారం అందించాడు. వెల్దుర్తి పట్టణ సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన హనుమాన్ సర్కిల్ ఎదురుగా ఉన్న ఓ టీ స్టాల్ వద్ద నగదు ఇస్తుండగా అప్పటికే వ్యక్తి నిర్వహిస్తున్న ఎసిబి అధికారులు వల్లపన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## రూ.15లక్షలతో ఉడాయింపు

### పోలీసులకు ఫిర్యాదు... కేసు నమోదు

**ఏర్పేడు, జూన్ 16 ప్రభాతవార్త:** రూ.లక్షకు మూడు లక్షలు అంటూ ఓ సామాన్యునికి ఆశ చూపి రూ.15 లక్షలతో ఉడాయించిన సంఘటన మంగళవారం తిరుపతి జిల్లా ఏర్పేడు మండల కేంద్ర సమీపంలో చోటుచేసుకుంది. ఓ సామాన్యుడు అత్యాసకు పోయి మొదటికి మోసపోయిన ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు అందింది. మంగళవారం శ్రీకాళహస్తి తిరుపతి హైవేలో చోటు చేసుకున్న సంటనపై ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు అందింది. అంజిమేడు గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు డాబా వద్ద తిరుపతి జిల్లా తడ మండలం వెండ్లూరు గ్రామానికి చెందిన కె.రవిచంద్రారెడ్డి అనే వేణు ఆతనికి కొందరు వ్యక్తులు లక్షకు మూడు లక్షలు డబ్బు ఇస్తామని ఆశ చూపారు. దాంతో రవిచంద్రరెడ్డిని ప్రైవేటు డాబా వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేసారు. ఒప్పందం మేరకు అతనిని బెదిరించి ఆతని వద్ద ఉన్న రూ.15 లక్షలు తీసుకొని కారులో పలాయనం చిత్తగించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు సిఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కదిరి కూటమిలో కుంపట్లు మొదలయ్యాయా?

- ఎమ్మెల్యే కందికుంట, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి మధ్య సైలెంట్ వార్ నడుస్తున్నదా?
- అంతు పట్టని కదిరి రాజకీయం

**అనంతపురం, జూన్ 16 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ తెలుగుదేశం పార్టీని బలోపేతం చేశారు. ఎన్నికల్లో గెలిచినా ఓడినా పార్టీలోనే వ్యూహాత్మకంగా తనదైన శైలిలో పావులు వెతుకుతుంటాడు. ఇప్పటివరకు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన నేపథ్యంలో రాబోయే ఆరు నెలల్లో మంత్రివర్గ విస్తరణ జరిగితే తన సీనియార్టీని గుర్తిస్తే మంత్రి కావాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆశతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి మధ్య అంతర్గతంగా సైలెంట్ వార్ నడుస్తోందని, ఎందుకు ఏమిటి అన్నది తిరిగి రావటం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అయితే బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి పలు విషయాలపై ఎమ్మెల్యే పేరు ప్రస్తావించకుండా కదిరి ప్రాంతంలో అవినీతిపై స్పందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాత్రం బహిరంగంగా ఎక్కడ మాట్లాడకుండా మోనంగా ఉన్నాడని, కొందరు కదిరి టౌన్ టిడిపి నాయకులు మాత్రం బహిరంగంగా బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి వైసీపీకి ఏజెంట్ గా ఉన్నాడని, కుటుంబ ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. తాజా సంఘటనతో ఆధారంగా కదిరిలో కూటమిలో కుంపట్లు మొదలయ్యాయని రాజకీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా సోమవారం అనంతపురంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కదిరి బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి డీఎస్సీ విషయంలో వైసీపీ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండపడ్డారు. అదే సమయంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తనకు ప్రాణహాని ఉందని, కొందరు వ్యక్తులు ఫోన్ చేసి తనతో మాట్లాడిన వ్యవహారంపై కదిరి పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదుపై కదిరి పోలీసులు స్పందించకపోతే జిల్లా ఎస్పీని కలుస్తానని చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత మార్చి నుంచి కూటమిలో చిన్నపాటి వివాదాలు పట్టింపుకుపోవడంతో పెరుగుతూ వచ్చాయి. గతంలో కదిరి ఎమ్మెల్యేగా బిజెపి తరపున ఎమ్మెస్ పార్థసారధి ఉండేవారు. టిడిపి, బిజెపి పొత్తులో భాగంగానే అప్పట్లో టిడిపి అండతో ఎమ్మెల్యే అయ్యారు. ఆ సమయంలో ఎమ్మెస్ పార్థసారధి కలిసి కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా తీరే ఎక్కేవారు. అలా కదిరి తీరు లాగినప్పుడల్లా పార్థసారధితో పాటు విష్ణువర్ధన్ రెడ్డి తీరే ఎక్కే వారిని చెబుతుంటారు. అయితే గత మార్చిలో ప్రముఖ కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి తేరు ఎక్కకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేశారని, దీని వెనుక ఎమ్మెల్యే ఉన్నాడని బిజెపి వర్గీయుల అనుమానం. ఈ విషయంపై అప్పట్లో టిడిపి పెద్దలకు, బిజెపి పెద్దలకు విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.. ఆ తర్వాత కాలక్రమమైన కదిరి పట్టణంలో జరుగుతున్న కొన్ని విషయాలపై బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యక్షంగా పరోక్షంగా పావులు కలిగినట్లు తెలుస్తోంది. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కదిరి మున్సిపల్ కమిషనర్ పైన, కదిరి సబ్ రిజిస్టర్ ఆఫీస్‌పైన రాష్ట్ర మంత్రి నారాయణ, ఇతర ఉన్నతాధికారులకు బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదులు చేసినట్లు తెలియ వచ్చింది. అదేసమయంలో కదిరి లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో టెంకాయల టెండర్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని ఫిర్యాదు చేసి టెండర్లు నిలుపుదల వెనుక బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సోమవారం (15వ తేదీ) పలువురు బిజెపి జిల్లా నేతలతో అనంతపురంలో విలేకరుల సమావేశానికి బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి సన్నద్ధమయ్యారు. ఆ మేరకు వాట్సాప్ గ్రూపుల ద్వారా విలేకరులకు చేరవేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల ఉత్సవాల జరుగుతున్న నేపథ్యంలో కదిరి వివాదం పైన బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి ఏదైనా మాట్లాడతారని అనుకున్నారా ఏమోగానీ రాష్ట్ర మంత్రి ఒకరు విష్ణువర్ధన్ రెడ్డికి ఫోన్ చేసి వివాదాలు మాట్లాడవద్దని చెప్పడంతో, డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తానని విష్ణువర్ధన్ రెడ్డి సమాధానం ఇచ్చి అమెరికా విలేకరులతో మాట్లాడినట్లు విశ్వసనీయ వర్గాల బోగట్టా. బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి పార్టీ తరఫున వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ పార్టీ అప్పగించిన పనులు చేస్తుంటారు. ఇన్నాళ్లు వన్ ప్లస్ వన్ గన్మెన్ల భద్రత ఉంది. తాజా పరిణామాలతో కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఆ గన్మెన్ల భద్రతను ఇంకా ఎక్కువగా పెంచినట్లు తెలియ వచ్చింది. విష్ణువర్ధన్ రెడ్డి వ్యవహారంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట ఎక్కడ బహిరంగంగా స్పందించకపోవడం కొసమెరుపుగా చెప్పొచ్చు.

ఆట

**అల్జీరియాతో అర్జెంటీనా ఢీ**
**నేటి ఉదయం 6.30గంటలకు**
**భారత్‌లోనూ మెస్సీ మానియా**

# వరల్డ్ ఛాంపియన్లకు తొలి పరీక్ష



**కాన్సాస్ సిటీ, జూన్ 16:** సాకర్ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తొలి పోరుకు సిద్ధమైంది. గ్రూప్-జేలో ఉన్న అర్జెంటీనా.. అల్జీరియాతో తలపడనుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం ఆరున్నర గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్టార్‌ప్లేయర్ లియోనెల్ మెస్సీ చేసే మ్యాజిక్ కోసం ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా తన వరల్డ్ కప్ యాత్రను విజయంతో ప్రారంభించాలని చూస్తుండగా.. చరిత్ర సృష్టించే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అండర్‌డాగ్ అల్జీరియా ఆశిస్తోంది. మెస్సీ మాయాజాలం, మహ్రేజ్ ప్రతిభ మధ్య జరిగే ఈ పోరు ఉత్కంఠ రేపుతోంది.

**హాట్ ఫేవరెట్‌గా మెస్సీ సేన**

లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అయితే మెస్సీ ఫిట్‌నెస్ కాస్త ఆందోళన పరుస్తోంది. అతను ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశాలు



ఎక్కువగానే ఉన్నాయి. గోల్ కీపర్ ఎమిలియానో మార్టినెజ్ కూడా అందుబాటులో ఉండడం అర్జెంటీనాకు ఊరటనిచ్చే అంశం. మెస్సీని ఎంతవరకు నిలువరిస్తారన్న అంశంపైనే అల్జీరియా విజయావకాశాలు ఉంటాయి. డ్రాగా ముగించినా గొప్పగానే భావించవచ్చు. అయితే ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయకూడదని అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోనీ హెచ్చరిస్తున్నాడు. 2022 ప్రపంచకప్‌ తొలి మ్యాచ్‌లో ఎదురైన అనుభవాన్ని గుర్తుచేస్తే... అల్జీరియా నైపుణ్యమైన జట్టని పేర్కొన్నారు. రియాద్ మహ్రేజ్ నాయకత్వంలోని అల్జీరియా మెరుపు దాడులతో ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆటగాళ్లకు కోచ్ స్పష్టంగా సూచించాడు.

**భారత్‌లోనూ మెస్సీ మానియా**

ఫిఫా ప్రపంచకప్ మానియా ఇప్పుడు భారత్‌లో కూడా టాప్ గేర్‌కు చేరుకుంది. లియోనెల్ మెస్సీ ఆడుతుండడంతో ఈ మ్యాచ్‌పై భారత్‌లో కూడా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా కేరళ, గోవా, బెంగాల్‌లో ఫిఫా కళ వచ్చేసింది. ఆపై డిఫెండింగ్ చాంపియన్స్ హోదాలో అర్జెంటీనా బరిలోకి దిగుతుండడంతో కేరళలో సాకర్ ఫీవర్ ఊపేస్తోంది. ఇక కేరళలో అయితే మెస్సీతో పాటు రొనాల్డో, నెయ్మర్, ఎంబాపె, సాలా, లామినే యమాల్ వంటి ఆటగాళ్లకు కూడా విపరీతమైన ఆదరణ ఉంది. అక్కడి ఇళ్లకు కూడా ప్రజలు తమ కిష్టమైన జట్ల రంగులను పెయింటింగ్ వేసుకున్నారు. ఇక బుధవారం ఒక్కరోజే ముగ్గురు బిగ్‌స్టార్స్ మ్యాచ్‌లు ఆడనుండడంతో ఫిఫాలో అసలు సమరం మొదలుకానుంది.

బుధవారం తెల్లవారుజామున ఫ్రాన్స్, సెనెగల్ మధ్య పోరు జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్ ఎంబాపె బరిలోకి దిగనున్నాడు. ఆ తర్వాత ఉదయం 6.30 గంటలకు మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా.. అల్జీరియాతో తలపడనుంది. ఇక రాత్రి 10.30 గంటలకు పోర్చుగల్.. కాంగో రిపబ్లిక్‌తో తలపడనుంది. ఇలా త్రిమూర్తులు ఒకే రోజు మ్యాచ్ ఆడనుండడంతో ఫుట్‌బాల్ అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.



# హాకీ సెమీస్‌లోకి దూసుకెళ్లిన భారత్

**ఆక్లాండ్, జూన్ 16:** నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నీలో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆక్లాండ్‌లోని నార్త్ హార్బర్ నేషనల్ హాకీ సెంటర్‌లో జరిగిన పూల్-ఎ రెండో మ్యాచ్‌లో భారత్ మహిళలు 2-1 గోల్స్‌తో జపాన్‌పై కంగుతినిపించింది. పూల్-ఎలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందిన భారత్.. సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. భారత్ తరఫున కెప్టెన్ సలీమా టెటే 33వ నిమిషంలో, ఫార్వర్డ్ లాల్‌రెమ్ సియామి 49వ నిమిషంలో గోల్స్ చేశారు. జపాన్‌కు లభించిన ఏకైక గోల్‌ను 35వ నిమిషంలో హిరామిత్సు అందించింది. వందో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన మిడ్‌ఫీల్డర్ జ్యోతికి ఇది చిరస్మరణీయ గేమ్‌గా మారింది.

మొదటి అర్ధభాగంలో ఇరుజట్లకు గోల్స్ అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయాయి. 33వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను భారత్ గోల్‌గా మలిచింది. నవనీత్ కౌర్ ఇచ్చిన పాస్‌ను నిక్కీ ప్రధాన్ అద్భుతంగా సలీమా వైపు మళ్లించింది. కెప్టెన్ దాన్ని విజయవంతంగా గోల్‌పోస్ట్‌లోకి నెట్టింది. రెండు నిమిషాల తర్వాత హిరామిత్సు పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జపాన్‌ను 1-1తో సమవుజ్జీగా నిలిపింది. ఇక 49వ నిమిషంలో సుశీల చాను.. సర్కిల్ అంచు నుండి గోల్ వైపు అందించిన అద్భుత పాస్‌ను అందుకున్న లాల్‌రెమ్ సియామి బంతిని నెట్‌లోకి మళ్లించి భారత్‌కు విజయాన్ని అందించింది. 18న జరిగే పూల్-ఎ చివరి లీగ్ మ్యాచ్‌లో ఉరుగ్వేతో భారత్ తలపడనుంది. పూల్-ఎ నుండి రెండో సెమీఫైనల్ స్థానం కోసం జపాన్-అమెరికా తలపడతాయి.

# అరౌజో గోల్‌తో గట్టెక్కిన ఉరుగ్వే

**మియామి:** సాకర్ ప్రపంచకప్‌లో చిన్న జట్లు పెద్ద ఆటతో మేటి జట్లకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. కబొవెర్డెతో మ్యాచ్‌ను గోల్ లెస్‌గా స్పెయిన్ ముగించగా... బెల్జియం, ఈజిప్ట్ మ్యాచ్ 1-1తో డ్రా అయింది. ఇక రెండుసార్లు చాంపియన్స్ ఉరుగ్వే తృటిలో ఓటమి నుంచి తప్పించుకుంది. గ్రూప్ హెచ్‌లో భాగంగా సౌదీ అరేబియాతో జరిగిన మ్యాచ్‌ను ఉరుగ్వే 1-1తో డ్రా ముగించి ఊపిరి పీల్చుకుంది. గత ప్రపంచకప్‌లో అర్జెంటీనాను ఓడించిన సౌదీ.. ఈ మ్యాచ్‌లోనూ సంచలనం సృష్టించే ఊపులో కనిపించింది. 41వ నిమిషంలో అబ్దులేలాహ్ అల్ అమ్రి గోల్ చేసి సౌదీకి ఆధిక్యం అందించాడు. ఈ ఆదిక్యం 80వ నిమిషం వరకు కొనసాగింది. చివరకు మాక్సీ అరౌజో చేసిన గోల్‌తో ఉరుగ్వే గోల్స్ సమం చేసింది. డ్రాతో గటెక్కింది. అయితే ఉరుగ్వేకు పలు అవకాశాలు వచ్చాయి. 5వ నిమిషంలో బాక్స్ అంచు నుంచి మాక్సీ అరౌజో కొట్టిన కిక్‌ను సౌదీ గోల్ కీపర్ మొహమ్మద్ అలోవైస్ సమర్థంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత ఉరుగ్వేకు కార్నర్ లభించినా, గోల్ చేయడంలో విఫలమైంది. 18వ నిమిషంలోనూ ఉరుగ్వే కొట్టిన షాట్ గోల్‌పోస్టు తగులుకుంటూ వెళ్లింది.

**ఈజిప్ట్‌ను ముంచిన సెల్ఫ్ గోల్: 1-1 గోల్స్‌తో బెల్జియం మ్యాచ్ డ్రా**

సియాటెల్‌లో జరిగిన మరో గ్రూప్-జి పోరులో బెల్జియం, ఈజిప్ట్ 1-1తో డ్రా అయ్యాయి. సలాహ్ పాస్‌ను అందుకున్న ఎమామ్ అషూర్ 19వ నిమిషంలో గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. మ్యాచ్ అంతా బెల్జియం ఆధిపత్యం ప్రదర్శించినా గోల్స్‌గా మలచలేకపోయింది. 65వ నిమిషంలో రొమెలు లుకా మైదానంలోకి అడుగుపెట్టిన 22 సెకన్లకే ప్రభావం చూపించాడు. థామస్ ఇచ్చిన క్రాస్‌ను అడ్డుకునే క్రమంలో ఈజిప్ట్ ఆటగాడు మహ్మద్ హానీ సెల్ఫ్ గోల్ చేయ డంతో బెల్జియం సమం చేసింది. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయాన్ని అందుకోవాలన్న ఈజిప్ట్ కల మరోసారి నెరవేరలేదు.





# ఇరాన్ గేమ్ భళా: న్యూజిలాండ్‌తో డ్రా

**కాలిఫోర్నియా, జూన్ 16:** ఫిఫా ప్రపంచకప్‌లో మేటి జట్లు ఉన్నా అందరి చూపు ఇరాన్‌పైనే. సాకర్ వరల్డ్ కప్‌లో పాల్గొంటుందా? లేదా? అన్న సందిగ్ధం నుంచి అమెరికాకు వచ్చిన ఇరాన్ అదిరే ఎంట్రీ ఇచ్చింది. గ్రూప్-జిలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను 2-2తో డ్రా చేసి ఆశ్చర్యపరిచింది. ఆరంభంలో న్యూజిలాండ్ ఆధిక్యం కనబరిచింది. ఆట ప్రారంభమైన ఏడో నిమిషంలోనే గోల్ చేసి ఆధిక్యంలో నిలిచింది. క్రిస్ వుడ్ అందించిన పాస్‌ను ఎలిజా జస్ట్ గోల్‌గా మలిచాడు. అటు తర్వాత అటాక్‌కు దిగిన ఇరాన్ చివరకు 31వ నిమిషంలో గోల్ చేసింది. రామిన్ రెజాయియన్ గోల్ సాధించి ఇరాన్‌ను సమవుజ్జీగా నిలిపాడు. రెండో అర్ధ భాగం 54వ నిమిషంలో ఎలిజా జస్ట్ మరోసారి గోల్ చేయడంతో న్యూజిలాండ్ 2-1తో ఆధిక్యం పొందింది. పది నిమిషాలకే ఇరాన్ మరో గోల్ చేసింది. 64వ నిమిషంలో రెజాయియన్ అందించిన క్రాస్‌ను ఈసారి మహమ్మద్ మొహెబ్బి గాల్లోకి ఎగిరి హెడర్‌తో గోల్‌గా మలచడంతో మ్యాచ్ 2-2తో సమంగా ముగిసింది.

**అమెరికా విడిచి వెళ్లాలన్నారు: ఇరాన్ కోచ్**

ఈ మ్యాచ్ ముగిసిన వెంటనే అమెరికా విడిచి వెళ్లిపోవాలంటూ తమకు ఆదేశాలు వచ్చాయని ఇరాన్ కోచ్ అమీర్ ఘలేనోయి అన్నారు. ఈ టోర్నీలో తాము అణచివేతకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాచ్ ఆడిన తర్వాత విశ్రాంతి తీసుకునేందుకు ఇరాన్ జట్టు రాత్రి కాలిఫోర్నియాలో ఉండాలనుకుంది. కానీ, మెక్సికోకు వెళ్లాలని ఆదేశాలు వచ్చాయన్నారు. లాస్‌ఏంజిల్స్‌లోనే ఇరాన్ తదుపరి మ్యాచ్ 22న బెల్జియంతో ఆడాల్సి ఉంది. అయితే అమెరికాలోనే మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నా... మెక్సికోలోని టిజువానాలో ఇరాన్ జట్టుకు బస ఏర్పాటు చేశారు. మ్యాచ్ జరిగే రోజు అక్కడి ఉంచి మ్యాచ్ ఆడే వేదికకు ఇరాన్ జట్టును విమానంలో తరలిస్తారు. అమెరికా వీసాలు నిరాకరించడంతో కోచింగ్ సహాయక సిబ్బంది జట్టుతో లేకపోవడాన్ని ఇరాన్ కెప్టెన్ మెహ్దీ తరేమీ, కోచ్ అమీర్ ఘలేనోయి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ పరిస్థితి జట్టు సన్నద్ధతను మరింత క్లిష్టతరం చేసిందన్నారు.

## పెట్టుబడుల ఉపసంహరణతో భారీ ఆదాయం

# తొలి త్రైమాసికంలో 15వేల కోట్లకు పైగా వసూళ్లు




**న్యూఢిల్లీ,జూన్ 16:** కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పెట్టుబడుల ఉపసంహరణ (డిస్‌ఇన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ.15వేల కోట్లకు పైగా ఆదాయం సమీకరించనున్నది. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) లావాదేవీల ద్వారా ఈ ఆదాయం పెరిగి, ప్రభుత్వ పన్నేతర రాబడులకు ఊతం ఇస్తోంది. కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌ఎల్‌సీ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థల్లో వాటాల విక్రయాల ద్వారా ఈ వృద్ధి నమోదైంది. ప్రస్తుత త్రైమాసికంలోనే కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.14,000 కోట్లను సమీకరించింది. ఇంకా లెక్కల్లో చేరాల్సిన ఆదాయంతో ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది.ఆర్థిక వ్యయ భారం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక వ్యవస్థకు నాన్‌ట్యాక్స్ క్యాపిటల్ రిసీట్స్ కీలక ఆధారంగా మారుతున్నాయి.

పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల మోనిటైజేషన్ ద్వారా అధిక ఆదాయం సమకూరితే ఆర్థిక లోటు నియంత్రణకు తోడ్పడటంతో పాటు 2027 ఆర్థికసంవత్సరంలో లక్ష్యాలను చేరుకోవడంలో ప్రభుత్వానికి సహాయ పడుతుందని అంచనా. ముఖ్యంగా ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులపై సబ్సిడీ వ్యయం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ఆదాయం ప్రాధాన్యం సంతరించుకుంది. 2027 ఆర్థికసంవత్సరంలో లో కేంద్ర ప్రభుత్వం రూ.80వేల కోట్ల విలువైన ఆస్తుల మోనిటైజేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో ఐడిబిఐ బ్యాంక్ వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో మైనారిటీ వాటాల విక్రయాలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మరింత వాటా విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

అధికారిక గణాంకాల ప్రకారం ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నాన్‌ట్యాక్స్ క్యాపిటల్ రిసీట్స్ రూపంలో మొత్తం రూ.21,732.23 కోట్లను సమీకరించింది. ఇందులో పెట్టుబడులు విత్‌డ్రా ద్వారా రూ.13,389.42 కోట్లు, ఆస్తుల మోనిటైజేషన్ ద్వారా రూ.6,367 కోట్లు, డివిడెండ్ ఆదాయం ద్వారా రూ.1,976 కోట్లు లభించాయి.




## కాసులు కురిపిస్తున్న

# గోల్డ్ బాండ్స్

**ముంబయి,జూన్ 16:** సావరీన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) 202021 సిరీస్‌లో పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లకు కనకవర్షం కురుస్తోంది. ఐదేళ్ల కాలపరిమితి పూర్తి కావడంతో, ఈ బాండ్లను గడువుకు ముందే అమ్ముకునేందుకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించిన విమోచన ధరను కూడా ప్రకటించడంతో ఇన్వెస్టర్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. రూ. 4,627 పెట్టుబడిపై రూ. 14,774 రాబడి ఎస్‌జీబీ 202021 సిరీస్ బాండ్లను 2020 జూన్ 16న జారీ చేశారు. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి గ్రాముకు రూ. 4,627 ధరకు, ఇతర మార్గాల ద్వారా కొన్నవారికి రూ. 4,677 ధరకు బాండ్లను కేటాయించారు. ఇప్పుడు ఐదేళ్ల తర్వాత, ఆర్బీఐ ఈ బాండ్ల ముందస్తు విమోచన ధరను యూనిట్‌కు (ఒక గ్రాముకు) రూ. 14,774గా నిర్ణయించింది.

అప్పట్లో ఆన్‌లైన్‌లో గ్రాముకు రూ. 4,627 పెట్టి కొన్నవారికి ఇప్పుడు గ్రాముపై రూ. 10,147 లాభం వస్తుంది. దీనిని శాతాల్లో లెక్కిస్తే, రాబడి 219.30 శాతంగా ఉంటుంది. ఎవరైనా ఆ సమయంలో రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే, వారికి ఇప్పుడు వడ్డీ ఆదాయం కాకుండానే సుమారు రూ. 3.19 లక్షలు చేతికి వస్తాయి. ఈ ఐదేళ్ల పాటు ఏటా 2.5 శాతం చొప్పున వడ్డీ కూడా ఇన్వెస్టర్ల ఖాతాలో జమ అయింది. ఎస్‌జీబీ నిబంధనల ప్రకారం బాండ్ల జారీ తేదీ నుంచి 8 ఏళ్ల మెచ్యూరిటీ పీరియడ్ ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో నిధులు అవసరమైన వారి కోసం, ఐదేళ్ల తర్వాత గడువుకు ముందే అమ్ముకునే వెసులుబాటును ఆర్బీఐ కల్పిస్తుంది. ఈ బాండ్లను 2020 జూన్ 16న జారీ చేయడంతో, 2026 జూన్ 16 నాటికి ఐదేళ్ల లాక్ ఇన్ పీరియడ్ పూర్తయింది.

దీంతో ముందస్తు ఉపసంహరణకు మార్గం సుగమమైంది. ఆర్బీఐ ఈ విమోచన ధరను యాదృచ్ఛికంగా నిర్ణయించదు. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రచురించే ధరల ఆధారంగా, విమోచన తేదీకి ముందున్న మూడు పనిదినాల్లోని 999 స్వచ్ఛత కలిగిన బంగారం ముగింపు ధరల సగటును లెక్కించి ఈ ధరను ఖరారు చేస్తుంది. 219 శాతం లాభాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ, బాండ్లను అమ్ముకోవాలా లేక మెచ్యూరిటీ వరకు ఉంచుకోవాలా అనేది ఇన్వెస్టర్ల వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలపై ఆధారపడి ఉంది.

# వార్ ఒప్పందంతో ఈక్విటీల ర్యాలీ


**ముంబై, జూన్ 16:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మళ్లీ కొనుగోళ్లకు దిగడం వంటి అంశాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఒప్పందం కుదిరిందన్న వార్తలు ఇంధన సరఫరాపై ఉన్న ఆందోళనలను తగ్గించడంతో బ్రెంట్‌క్రూడ్ ధర బ్యారెల్‌కు 83 డాలర్ల కంటే దిగువకు చేరింది. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. మెటల్స్, హెల్త్‌కేర్, ఫార్మా రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.బీఎస్‌ఈ సెన్సెక్స్ 544.15 పాయింట్లు పెరిగి 76,808.48 వద్ద ముగిసింది.ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 135.25 పాయింట్లు శాతం లాభపడి 23,989.15 వద్ద స్థిరపడింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 4.03 శాతం, నిఫ్టీ 3.57 శాతం మేర ర్యాలీ తీశాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.33 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.48 శాతం పెరిగాయి. బీఎస్‌ఈలో 2,293 షేర్లు లాభపడగా, 1,967 షేర్లు



నష్టపోయాయి. 169షేర్లు మార్పులేకుండా ముగిశాయి. రూపాయి కూడా డాలర్‌తో పోలిస్తే బలపడగా, 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ స్వల్పంగా తగ్గింది. బంగారం ఫ్యూచర్స్ ధరలు స్వల్ప లాభాల్లో ట్రేడ్ అయ్యాయి. రిటైల్ అమ్మకాలు తగ్గగా, పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి అంచనాలను మించి నమోదైంది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేరు 3.68 శాతం ఎగిసింది. బెంగళూరుకు చెందిన ఏఐ స్టార్టప్ సర్వమ్ ఎఐలో రూ.1,427 కోట్ల వ్యూహాత్మక పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ ప్రక

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

టించింది.సుజ్లాన్ ఎనర్జీ షేరు 4.25 శాతం లాభపడింది. దేశంలో విండ్ ఎనర్జీ సామర్థ్యాన్ని భారీగా పెంచే అవకాశాలు ఉన్నాయని కేంద్ర మంత్రి పేర్కొనడం ఇందుకు కారణమైంది.1500 మెగావాట్ల విండ్ టర్బైన్‌ల సరఫరా కోసం ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించడంతో షేరు లాభపడింది.ఇతర ప్రధాన షేర్లుఆదాని పోర్టులు ప్రత్యేక ఆర్థిక జోన్ 0.90 పెరిగింది. గోదావరి బయో రిఫైనరీస్ 5.56జంప్ చేసింది. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే ఆవిష్కరణకు జపాన్ పేటెంట్ లభించింది. బంధన్ బ్యాంకు 2.78 లాభపడింది. రూ.303.74 కోట్ల ఎన్‌పీఏలను విక్రయించేందుకు బోర్డు ఆమోదంతెలిపింది.మిని డైమండ్స్ ఇండియాషేరు9.77 పెరిగింది.16.25 కోట్ల వజ్రాల సరఫరా ఆర్డర్ వచ్చిందన్న ప్రకటన షేర్లనుపెంచింది. ధనలక్ష్మిబ్యాంకు 1.77 నష్టపోయింది.మొత్తంగా, అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా మారడం, ఎఫ్‌ఐఐలు మళ్లీ కొనుగోళ్లకు రావడం, రూపాయి బలపడడం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజు కూడా లాభాల్లో ముగిశాయి.



# కిమ్స్ క్యూఐపి ఇష్యూ ఓపెన్

**ముంబయి,జూన్ 16:**కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్) మంగళవారం తన క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ క్యూఐపి ఇష్యూను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఒక్కో ఈక్విటీ షేర్‌కు ఫ్లోర్ ప్రైస్‌ను రూ.771.73గా నిర్ణయించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన వివరాల్లో తెలిపింది. కంపెనీ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ 16న ఇష్యూ ప్రారంభానికి ఆమోదం తెలిపి, నిధుల సమీకరణకు సంబంధించిన ప్రాథమిక ప్లేస్‌మెంట్ డాక్యుమెంట్స్‌ను ఆమోదించింది. అలాగే సంస్థాగత పెట్టుబడిదారులకు ఫ్లోర్ ప్రైస్‌పై గరిష్ఠంగా 5 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వడానికి కూడా కంపెనీకి అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి 2026 ఏప్రిల్ 15న పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదారుల ప్రత్యేక తీర్మానం ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో గరిష్ఠ డిస్కౌంట్‌ను అమలు చేస్తే ఒక్కో షేర్ ధర రూ.733.14 వరకు ఉండే అవకాశం ఉంది.తుది ఇష్యూ ధరను క్యూఐపికు నియమించిన బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లతో సంప్రదించి నిర్ణయిస్తామని కిమ్స్ పేర్కొంది. ఈ ఇష్యూకు సంబంధించి 2026 జూన్ 16ను రిలెవెంట్ డేట్‌గా ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ నిర్ణయించింది.ఈ క్యూఐపికి సంబంధించి కిమ్స్ డైరెక్టర్ల బోర్డు 2026 మార్చి 11న జరిగిన సమావేశంలో ఆమోదం తెలిపింది. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ద్వారా వాటాదారుల అనుమతి కూడా లభించింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ అనేది లిస్టెడ్ కంపెనీలు దీర్ఘకాలిక పబ్లిక్ ఇష్యూ ప్రక్రియ లేకుండానే సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి మూలధనం సమీకరించేందుకు ఉపయోగించే మార్గం. విస్తరణ ప్రణాళికలు, కొనుగోళ్లు, వ్యాపార వృద్ధి లేదా బ్యాలెన్స్ షీట్ బలోపేతం కోసం కంపెనీలు ఈ విధానాన్ని తరచుగా వినియోగిస్తుంటాయి.




# ఇంధన ఎగుమతులపై ఎక్సైజ్ సుంకం పెంపు

**న్యూఢిల్లీ,జూన్ 16:**పెట్రోల్, డీజిల్, విమానఇంధన (ఏటీఎఫ్) ఎగుమతులపై కేంద్రం ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని (విండ్‌ఫాల్ ట్యాక్స్) పెంచింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. దేశీయ ఇంధన నిల్వలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడడంతో పాటు, ఎగుమతుల ద్వారా లభిస్తున్న అదనపు లాభాలపై నియంత్రణ సాధించడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టినట్లు తెలుస్తోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.13.50 నుంచి రూ.14కు పెంచారు.విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై సుంకాన్ని 9.50 నుంచి రూ.12.50కు పెంచారు. పెట్రోల్ ఎగుమతులపై ప్రస్తుతం అమల్లో ఉన్న లీటరుకు రూ.1.50 సుంకంలో ఎలాంటి మార్పు చేయలేదు. కొత్త రేట్లు జూన్ 16 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయం దేశీయ వినియోగదారులపై తక్షణ ప్రభావం చూపదని కేంద్రం స్పష్టం చేసింది. దేశీయ మార్కెట్‌కు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్‌పై ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని తెలిపింది. ఇజ్రాయెల్ఇరాన్ ఘర్షణల నేపథ్యంలో మార్చి 26న కేంద్రం విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తిరిగి అమల్లోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి అంతర్జాతీయ ముడిచమురు ధరలు, రిఫైనరీల లాభాల పరిస్థితిని బట్టి ప్రతి రెండు వారాలకు ఒకసారి సుంకాలను సమీక్షిస్తోంది.

## టిసిఎస్‌కు అమెరికా కోర్టులో షాక్

# రూ.1986 కోట్ల పరిహారం




**న్యూయార్క్,జూన్ 16:**భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌టీసీఎస్ కు అమెరికాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాలుగా నడుస్తున్న ట్రేడ్ సీక్రెట్స్ వ్యాపార రహస్యాలు చౌర్యం కేసులో అమెరికా సుప్రీంకోర్టులో ఆ సంస్థకు షాక్ తగిలింది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో టీసీఎస్‌పై దాదాపు 220 మిలియన్ డాలర్ల భారత కరెన్సీలో సుమారు రూ.1,986 కోట్లు ఆర్థిక భారం పడుతుందని అంచనా. ఈ వివాదం మూలాలు అమెరికాలోని లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్ వ్యాపారంలో ఉన్నాయి. డీఎక్స్‌సీ టెక్నాలజీ అనే సంస్థకు చెందిన పూర్వ కంపెనీ అయిన కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ), 1990లలో తమ యాజమాన్యంలోని ఒక ప్రత్యేకమైన లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్‌ను ట్రాన్స్‌అమెరికా అనే బీమా సంస్థకు లైసెన్స్ ఇచ్చింది. కొన్నేళ్ల తర్వాత ట్రాన్స్‌అమెరికాకు చెందిన 2,200 మందికి పైగా ఉద్యోగులను టీసీఎస్ నియమించుకుంది. ఈ ఉద్యోగుల ద్వారా సీఎస్‌సీకి చెందిన రహస్య సాఫ్ట్‌వేర్ సమాచారాన్ని, దాని పనితీరును తెలుసుకుని, దానికి పోటీగా ఒక కొత్త ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫామ్‌ను టీసీఎస్ అభివృద్ధి చేసిందని డీఎక్స్‌సీ ఆరోపించింది. ఈ ఆరోపణలతో డీఎక్స్‌సీ, 2019లో డల్లాస్‌లోని ఫెడరల్ కోర్టులో టీసీఎస్‌పై దావా వేసింది. టీసీఎస్ తమ వ్యాపార రహస్యాలను దుర్వినియోగం చేసిందని, గోప్యమైన సమాచారంతో లబ్ధి పొందిందని ఆరోపించింది. టీసీఎస్ మొదటి నుంచి ఈ ఆరోపణలను ఖండిస్తూ వచ్చింది. తాము పొందిన సమాచారం రహస్యమైనది కాదని, చట్టబద్ధంగానే సాఫ్ట్‌వేర్‌ను యాక్సెస్ చేశామని వాదించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No.37, 38 Industrial Estate, Ramanjaneyapuram, Kadapa-516002. Phone : 2764 4999. Fax: 040-27642512, RNINo. 64846, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.